

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


విచ్ఛిన్న శక్తులపై పోరాటం కొనసాగింపునకు ప్రతిన

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ నలుగురు మవోయిస్టులు మృతి

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 333 | శనివారం | 24-05-2025 | హైదరాబాద్    Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12 | వెల రూ. 5.00


## జోహార్లు



సాయుధపోరాట యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ 29వ వర్థంతి నేడు

## కోటాలోనే విద్యార్థుల మరణాలు ఎందుకు?

- రాజస్థాన్ సర్కారుపై 'సుప్రీం..సీరియస్'
- ఒక్క ఏడాదిలోనే 14మంది విద్యార్థుల ఆత్మహత్యలు నమోదా అని విస్మయం
- మార్గదర్శకాలు జారీచేసినా ఎఫ్ఐఆర్ నమోదులో ఇంత నిర్లక్ష్యమా? అని పోలీస్ అధికారిపై బెంచ్ ఆగ్రహం




**న్యూఢిల్లీ :** కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరగడంపై శుక్రవారం సుప్రీంకోర్టు రాజస్థాన్ ప్రభుత్వాన్ని విచారించింది. ఈ 'పరిస్థితి తీవ్రమైనది' అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మాట్లాడుతూ ఈ ఒక్క ఏడాదే ఇప్పటివరకూ కోటా నగరం నుంచి 14ఆత్మహత్యలు నమోదు తరువాయి 2లో

## కెసిఆర్ చుట్టూ దెయ్యాలు

- నా లేఖ బైటికి రావడం కోవర్టుల పనే
- పార్టీలో నా పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి?
- బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు రాసిన లేఖపై ఎమ్మెల్సీ కవిత
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అభిమానుల ఘన స్వాగతం
- సిఎం కవితక్క అంటూ నినాదాలు




**ప్రజాపక్షం / హైదరాబాద్**

''కెసిఆర్ గారు దేవుడు. కానీ కెసిఆర్ చుట్టూ కొన్ని దెయ్యాలు ఉన్నాయి. వాళ్ళ వల్ల పార్టీకి నష్టం జరుగుతున్నది. పార్టీలో ఉండే నేను, కెసిఆర్ కూతురుని, అంతర్గతంగా నేను రాసిన లేఖనే బైటికి వచ్చిందంటే, మరి ఇతర సామాన్యుల సంగతి, పార్టీలో ఇతరుల పరిస్థితి ఏమిటని చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది'' అని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కె.కవిత అన్నారు.కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని తాను చెప్పిన కొద్ది రోజుల్లోనే కెసిఆర్‌కు తాను రాసిన లేఖ బహిర్గతం కావడమంటే, పార్టీలో ఉన్న అందరు ఆలోచించుకోవాల్సిన విషయమని చెప్పారు. పార్టీలో కొందరు కోవర్టులు ఉన్నారని, వారిని ఏమి చేయాలో పార్టీ నిర్ణయించుకోవాలన్నారు. అమెరికా నుండి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. తన భర్త, కుమారుడితో కలిసి ఆమె రాత్రి 8:55 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపలికి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మీడియాతో తాను 20 రోజుల క్రితం బిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్‌కు రాసిన లేఖపై స్పందించారు. తొలుత 'జై తెలంగాణ' అంటూ మూడుసార్లు నినాదాలు తరువాయి 2లో

## బాంబులు వేశారనడం సిగ్గుచేటు

- తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే కెటిఆర్ గోబెల్స్ ప్రచారం
- కాళేశ్వరంపై బాంబులు వేస్తే ఎఫ్ఐఆర్‌లో ఎందుకు పేర్కొనలేదు
- ఆధారాలు అందజేస్తే ఇప్పటికైనా ఎఫ్ఐఆర్‌లో చేరుస్తాం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ
- పిసి ఘోష్ కమిషన్ నోటీసులకు ఎందుకు అంత వణికారని మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్**

బిఆర్‌ఎస్ పాలనలో కమీషన్లకు కక్కుర్తిపడి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కాళేశ్వరం నిర్మాణం పేరుతో లక్ష కోట్ల రూపాయలను వృధా చేయడమే కాకుండా గడిచిన పదేళ్ల కాలంలో తెలంగాణలో నీటిపారుదల రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేశారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యకం చేశారు. సచివాలయంలో శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని కప్పి పుచ్చుకునేందుకు ఇప్పుడు ఎవరో బాంబులు పెట్టడం కారణగానే కాళేశ్వరం కుంగిపోయిందని మాజీ మంత్రి కెటిఆర్ నిస్సిగ్గుగా గోబెల్స్ ప్రచారానికి తెర లేపారని విమర్శించారు. ఇదే అంశాన్ని గత ఏడాది కాలంగా విచారణ కొనసాగిస్తున్న రిటైర్డ్ జస్టిస్ పిసిఘోష్ కమిషన్‌కు ఎందుకు ఆధారాలు అందజేయలేదని ప్రశ్నించారు. ఈ ఘటన బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, ఎఫ్ఆర్ఐ కూడా నమోదు చేశారని, ఇందుకు సంబంధించిన ఆధారాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేస్తే ఇప్పటికైనా ఎఫ్ఆర్ఐలో చేర్చి విచారణ చేపడుతామని మంత్రి స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలు కూడా కాళేశ్వరంలో అవినీతి చోటుచేసుకుందని, నిర్మాణంలో ఘోర తప్పిదాలకు పాల్పడ్డారని తరువాయి 2లో

## అసెంబ్లీకి రండి... సమస్యలపై చర్చించండి




- తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి.. సరిదిద్దుకుంటాం
- అధికారం ఉంటేనే అసెంబ్లీకి వస్తానంటే... ప్రజలే బుద్ధి చెబుతారు
- మాజీ సిఎం కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టు అనుమతులను పొందడానికి ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని స్పష్టీకరణ




**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. 'ప్రతిపక్ష నాయకుడికి నేను విజ్ఞప్తి చేస్తున్నా.. శాసనసభకు రండి... ప్రజా సమస్యలపై చర్చించండి...మేం ఏదైనా తప్పులు చేస్తే సూచనలు ఇవ్వండి.. సరిదిద్దుకుంటాం... అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తామని మీరు అనుకుంటే.. ప్రజలు గుణపాఠం చెబుతారు. ప్రజాప్రతినిధులుగా నిత్యం ప్రజలకు అండగా ఉండాలి. గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నా. ముఖ్యమంత్రి అయ్యాక కూడా నేను ఏనాడు అహంభావం ప్రదర్శించలేదు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ కలుస్తున్నా' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం ఇచ్చే వరకు నేను నిద్రపోయేది లేదని స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పస్తాపూర్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలన-ప్రగతి బాట బహిరంగ సభ ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టు అనుమతులను పొందడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని '50 సార్లు' కలవడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, అభివృద్ధిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ, ప్రతిపక్షాల సహకారం ప్రాముఖ్యతను నొక్కి తరువాయి 2లో

## రాష్ట్రంలో మళ్ళీ కరోనా



- హైదరాబాద్‌లో తొలి కేసు నమోదు
- ఓ వైద్యునికి పాజిటివ్‌గా నిర్ధారణ
- దేశంలో విజృంభిస్తున్న మహమ్మారి

**ప్రజాపక్షం/హైదరాబాద్**

ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి వళ్లీ వచ్చింది. తెలంగాణలో కొవిడ్ కలకలం రేపింది. రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో తొలి కరోనా కేసు నమోదు అయింది. కూకట్ పల్లిలో ఓ వైద్యునికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని అధికారులు ప్రకటించారు. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయనకు ఆర్‌టిపిసిఆర్ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆయనను క్వారంటైన్‌లో ఉంచామని, ఆయన కుటుంబ సభ్యులకు కూడా కరోనా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అయితే ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో తరువాయి 12లో

## రాజీనామా యోచనలో యూనస్



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ అనిశ్చితి నెలకొంటోంది. దేశంలోని రాజకీయ పార్టీల మధ్య సఖ్యత లేకపోవడం మధ్యంతర ప్రధాన సలహాదారుడిని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తాజా పరిణామాలతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న మహమ్మద్ యూనస్ పదవి బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నారు. 'ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పనిచేస్తాను...నేను పనిచేయలేను... బాధ్యతల నుంచి తప్పుకుంటా' అని యూనస్ అసహనం వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కోటా పోరుతోతరువాయి 2లో

## భారత విదేశాంగ విధానం కుప్పకూలింది

- ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని ఎవరు అడిగారో చెప్పాలి
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్
- భారత ప్రతిష్ఠతో ప్రధాని మోదీ రాజీపడ్డారని ఆరోపణ
- దేశ ప్రయోజనాలను త్యాగం చేయడంపై మండిపాటు



**న్యూఢిల్లీ :** భారతదేశ విదేశాంగ విధానం 'కుప్పకూలింది' అని శుక్రవారం ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ పాకిస్తాన్‌తో ఎందుకు హైఫన్ చేయబడిందని, రెండు దక్షిణాసియా పొరుగు దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఎవరు అడిగారో వివరించాలని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను డిమాండ్ చేశారు. డచ్ బ్రాడ్‌కాస్టర్ ఎన్ఒఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు పహల్గామ్ ఉగ్రవాద దాడి, భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలపై జైశంకర్ సమాధానమిచ్చిన వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ చేసిన పోస్ట్‌ను రాహుల్ ట్యాగ్ చేశారు. 'భారత్ పాకిస్తాన్‌తో ఎందుకు హైఫన్ చేయబడింది? పాకిస్థాన్‌ను ఖండించడంలో ఒక్క దేశం కూడా మనల్ని ఎందుకు సమర్థించలేదు? భారత్-పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వం చేయమని ట్రంప్‌ను ఎవరు అడిగారు?' తరువాయి 2లో

## సామాజిక న్యాయం అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళండి

- ఇది ఎన్నికల అంశం కాదు.. కాంగ్రెస్ సైద్ధాంతిక నిబద్ధత..
- కాంగ్రెస్ అధికార ప్రతినిధుల వర్క్‌షాప్‌లో మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంశాన్ని నిర్భయంగా ప్రజలలోకి తీసుకెళ్ళాలని, అది ఎన్నికల అంశం కాదని, సైద్ధాంతిక నిబద్ధతకు సంబంధించిన అంశమని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. సామాజిక న్యాయంపై ఢిల్లీలో శుక్రవారం ఏర్పాటు చేసిన అధికార ప్రతినిధులు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం అంశాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళి, ప్రజలలో అవగాహన సృష్టించాల్సిన బాధ్యత పార్టీ అధికార ప్రతినిధులదేనని చెప్పారు. కులగణన గురించి దేశానికి అవగాహన వస్తున్నదని, కాబట్టి సామాజిక న్యాయం అంశాన్ని వాస్తవాలు, సున్నితత్వంతో ప్రజలలోకి భయం లేకుండా తీసుకు వెళ్ళాలని సూచించారు. అధికార ప్రతినిధులే పార్టీ ఆలోచనలకు గొంతుక అని ఖర్గే అన్నారు. ఇది కేవలం సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కాదని, రాజ్యాంగం ఆత్మను పరిరక్షించేందుకు జరుగుతున్న పోరాటమని, ఇది ఎన్నికల అంశంగా కాకుండా సైద్ధాంతిక నిబద్ధతగా చూడాలని అన్నారు. ఇదొక చరిత్రాత్మక ప్రయత్నమని, అందరం కలిసి ప్రతి ఒక్క పౌరునికి గుర్తింపు, మర్యాద, హక్కులతో పాటు సమాన గౌరవం ఉండే భారతదేశాన్ని కలిసి కట్టుగా నిర్మిద్దామన్నారు. దేశం కుల న్యాయం గురించి మాట్లాకుంటున్నదని, ఇలాంటి సమయంలో ఆ చర్చకు సరైన దిశ ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదని, దీనిని నినాదం స్థాయి నుంచి విధానం స్థాయికి తీసుకెళ్ళాలని అధికార ప్రతినిధులకు మల్లిఖార్జున ఖర్గే నిర్దేశించారు. 'జిత్నా ఆబాది ఉత్నా హక్ (జనాభా ఎంతో అంతే హక్కు)' తరువాయి 2లో

## టార్గెట్ హిడ్మా

- కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్
- ఆహారం, నీరు అందక డీహైడ్రేషన్‌కు గురవుతున్న మావోయిస్టులు
- ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ఒకొక్కరు మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్**



మావోయిస్టు అగ్రనేత మడవి హిడ్మా టార్గెట్‌గా కర్రెగుట్ట ఆపరేషన్ కొనసాగుతోంది. నెల రోజుల నుంచి కర్రెగుట్టను చుట్టుముట్టిన వేలాది పోలీసు బలగాలు హిడ్మా కోసం గాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ఒకొక్కరు నేలకొరుగుతున్నారు. దీంతో కర్రెగుట్టలో మావోయిస్టు క్యాడర్ దిశానిర్దేశం లేక బిక్కుబిక్కుమని ఉన్నారు.వీళ్లలో సుమారు 75 మంది ఇప్పటికే ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 27 మందిలో సిపిఐ (మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శి సంబాల కేశవ రావు అలియాస్ బసవరాజ్ తరువాయి 12లో


## చిన్నారులను చిదిమేస్తున్నారు..!

- యథేచ్ఛగా లింగనిర్ధారణలు... భ్రూణ హత్యలు
- పరీక్షలకు రూ.15వేలు, అబార్షన్‌కు రూ.35వేలు

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి**



స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు కాసులకు కక్కుర్తి పడి గర్భస్థ శిశువులను కడుపులోనే చిదిమేస్తున్నారు. లింగనిర్ధారణ... భ్రూణ హత్యలు నేరమని ప్రభుత్వం ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా వాటిని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. చిన్నారుల పసి ప్రాణాలను పిండం దశలోనే గాలిలో కలుపుతున్నారు. తల్లికడుపులో పెరుగుతున్న పిండం ఆడా?మగా? అని నిర్ధారించడానికి రూ.15వేలు, గర్భస్రావం చేయడానికి రూ.35 వేలు తీసుకుంటున్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా లింగ నిర్ధారణలు... భ్రూణ హత్యలు గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నాయి. అయినా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 229 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో 35కు పైగా ప్రసూతి ఆసుపత్రులు, 44 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణ ప్రాంతాలలో ఉన్నాయి. ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడా? మగా ? బిడ్డ అని పరీక్షలు చేసి ఆడశిశువే అని నిర్ధారించిన తర్వాత కడుపులోనే చిదిమేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో లింగనిర్ధారణ, భ్రూణ హత్యలపై ప్రభుత్వం తీసుకవచ్చిన చట్టాలపై అవగాహన లేకపోవడంతో అనేక మంది పేద, మధ్యతరగతి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణాఫ్రికా బంగారు గనిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాలోని బంగారు గని ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. క్లూఫ్ గనిలోని స్కిప్ మార్గం వద్ద ప్రమాదం జరగ్గా, కొంత మంది సురక్షితంగా బయటకు వచ్చరని సిబన్యే స్టిల్‌వాటర్ మైనింగ్ కంపెనీ ప్రకటించింది. అయితే, ఇంకా 260 మంది వరకూ కార్మికులు గనిలోనే ఉన్నారని, వారిని సాధ్యమైనంత త్వరలో వెలికితీసే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. అందరూ సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది.






## వేరే వర్సిటీకి వెళ్లండి..

### హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశంపై ట్రంప్ సర్కారు నిషేధం

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశంపై ట్రంప్ ప్రభుత్వం నిషేధం విధించింది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ యూనివర్శిటీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) కార్యదర్శి క్రిస్టి నోయెమ్ లేఖ రాశాలు. ఇది వరకే హార్వర్డ్ యూనివర్సిటీ నిధులను భారీగా తగ్గించిన ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు విదేశీ విద్యార్థుల ప్రవేశంపై నిషేధం విధించడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విదేశీ విద్యార్థులు వరే వర్సిటీకి వెళ్లాలని లేదా దేశం విడిచి వెళ్లాలని వర్సిటీకి రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఇకపై హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు ఉండవని ప్రకటించారు. ఉత్తర్వులను ఉల్లంఘించే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ప్రవేశం పొందే వ్యవస్థ అయిన విశ్వవిద్యాలయం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిఐఎస్) సర్టిఫికేషన్ కూడా ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. కొంతకాలంగా హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ సర్కారు ఆగ్రహంతో ఉంది. అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు ఇజ్రాయెల్ పట్ల కక్షపూరితంగా, అమెరికాకు వ్యతిరేకంగా, హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారని ట్రంప్ ప్రభుత్వ ఆరోపణ. చైనా కమ్యూనిస్టు పార్టీతో వర్సిటీ కలిసి పని చేస్తున్నదని కూడా విమర్శిస్తున్నది. మాసచూసెట్స్‌లోని హార్వర్డ్ వర్సిటీ కేంబ్రిడ్జ్ క్యాంపస్‌లోనే, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 140 దేశాలకు చెందిన, దాదాపు 6,800 మంది విదేశీ విద్యార్థులు ఏటా ప్రవేశం పొదుతున్నారు.

## కోర్టులో హార్వర్డ్ దావా




**బోస్టన్ (మాసచూసెట్స్/ అమెరికా):** ఐవీ లీగ్ స్కూల్‌లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడంపై నిషేధం విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హార్వర్డ్ యూనివర్సిటీ కోర్టులో సవాలు చేసింది. కేవలం ఒక్క సంతకంతో యూనివర్సిటీ విదేశీ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీయడడం ఎంత వరకు సమంజసమని కోర్టులో వేసిన దావాలో ప్రశ్నించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అమెరికా వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, ఉగ్రవాదులకు కొమ్ముకాస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం చేసిన విమర్శలను వర్సిటీ ఖండించింది. విదేశీ విద్యార్థుల ప్రవేశంపై నిషేధం విధించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. ఇలాంటి నిర్ణయాలు వర్సిటీకి మాత్రమేగాక,యావత్‌అమెరికాకు కూడా నష్టాన్ని కలుగచేస్తుందని ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. దీనిపై తాము తదుపరి చర్యలకు సిద్ధమైనట్లు పేర్కొంది. అయితే, ట్రంప్ సర్కార్ నిర్ణయంతో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని విదేశీ విద్యార్థులంతావేరేయూనివర్శిటీకి బదిలీ కావాల్సి ఉంటుంది. లేదంటే.. అమెరికాలో చట్టపరమైన హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ హోదాను పునరుద్దరించుకోవాలనుకుంటే, మూడు రోజుల్లో తమ ఆరు డిమాండ్లను అంగీకరించాలని హార్వర్డ్ యూనివర్శిటీకి ట్రంప్ సర్కార్ ఓ అవకాశం ఇచ్చింది.

### ఆరు కండీషన్లు ఇవే..

1) గత ఐదేళ్లలో యూనివర్శిటీలో చదువుతున్న విద్యార్థులు క్యాంపస్‌లో లేదా బయట జరిపిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులన్నీ సమర్పించాలి. ఆడియో, వీడియో పుటేజీలతో సహా అందజేయాలి.

2) గత ఐదేళ్లలో వలసదారు కాని (నాన్ ఇమిగ్రెంట్) విద్యార్థులు పాల్పడిన ప్రమాదకర, హింసాత్మక చర్యలకు సంబంధించిన రికార్డులను ఆడియోలు, వీడియో పుటేజ్ లతో అందజేయాలి.

3) నాన్ ఇమిగ్రెంట్ విద్యార్థులు.. ఇతర విద్యార్థులు లేదా యూనివర్సిటీ సిబ్బందిని బెదిరిస్తే ఆ రికార్డులను సమర్పించాలి.

4) గత ఐదేళ్లలో వలసేతర విద్యార్థులు క్యాంపస్‌లో లేదాబయటఇతరహక్కులనుహరించిన ఘటనలుచోటుచేసుకుంటే ఆ వివరాలు అందించాలి.

5) గత ఐదేళ్లలో హార్వర్డ్‌లో నమోదుచేసుకున్న వలసేతర విద్యార్థుల క్రమశిక్షణ రికార్డులను ఇవ్వాలి.

6) క్యాంపస్‌లో వలసేతర విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొంటే ఆ ఆడియో, వీడియో ఫుటేజ్‌లను ప్రభుత్వానికి సమర్పించాలని క్రిస్టి నోయెమ్ ఆదేశించారు.

## టార్గెట్ 'కొలంబియా'?



**న్యూయార్క్:** హార్వర్డ్ యూనివర్సిటీపై తొలుత ఆరోపణలు చేసి, నిధుల్లో కోతపెట్టి, అనంతరం విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేసిన ట్రంప్ సర్కారు,ఇప్పుడు తన దృష్టిని కొలంబియా వర్సిటీపై కేంద్రీ కరించినట్టు స్పష్టమవుతున్నది. అక్కడ ఇజ్రాయెల్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని అమెరికా సెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆరోపించింది. కొలంబియా విశ్వవిద్యాలయంలో జాతీయ పౌర హక్కుల చట్టంలోని ఆరో అధికరణ ఉల్లంఘన జరుగుతున్నదని ఒక నివేదికలో పేర్కొంది. కొంతకాలం క్రితం కూడా ఇలాంటి ఆరోపణలే వెలువడ్డాయి. అనంతరం 400 మిలియన్ డాలర్ల సాయాన్ని ట్రంప్ ప్రభుత్వం ఆ వర్సిటీకి నిలిపివేసింది. హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడాన్ని నిషేధించక ముందు ఇవే పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందుకే, కొలంబియా వర్సిటీకి కూడా విదేశీ విద్యార్థుల చేరికపై ఆంక్షలు విధించడం లేదా పూర్తిగా నిషేధించడం జరగవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ రకంగా చూసినా ట్రంప్ సర్కారు తదపరి లక్ష్యం కొలంబియా వర్సిటీగానే కనిపిస్తున్నది.

## మాస్కోపై డ్రోన్ దాడులు!

### భారత ఎంపిల బృందం విమానం ఆలస్యం

**మాస్కో:** ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేయడంతోపాట, పాకిస్తాన్ వైఖరిని అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు భారత పార్లమెంటు సభ్యులు(ఎంపిలు)వివిధ దేశాల్లో పర్యటిస్తున్న క్రమంలో, మాస్కో చేరాల్సిన బృందం నిర్ణీత సమయం కంటే సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. డిఎంకె సభ్యురాలు కనిమొళి నేతృత్వంలోని భారత ఎంపిల బృందం డొమొడెడొవొ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుందని రష్యా అధికారులు ప్రకటించారు. వివిధ కారణాల వల్ల 153 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపారు. అయితే, కారణాలు వెల్లడించలేదు. కానీ, స్థానికులను ఉటంకిస్తూ పిటిఐ ఇచ్చిన సమాచారం మేరకు, మాస్కో విమానాశ్రయం లక్ష్యంగా ఉక్రేన్ డ్రోన్ల దాడిని కొనసాగిస్తున్నది. ఈ కారణంగానే పలు రన్‌వేలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విమానాల రాకపోకలకు ఇదే ప్రధాన కారణం.

## కెసిఆర్ చుట్టూ దెయ్యాలు (మొదటి పేజీ తరువాయి)

చేశారు. తన కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని వచ్చే లోపల ఏదో లేఖ లీక్ అయిందని ,రెండు మూడు రోజులుగా హంగామా అవుతుందని తెలుస్తున్నదని, రెండు వారాల క్రితం తాను పెద్దలు కెసిఆర్‌కు లేఖ రాసానని కవిత చెప్పారు. ఇదివరకు కూడా తాను కెసిఆర్‌కు లేఖ ద్వారా అభిప్రాయాలను వెల్లడించేదానిని అని, ఈసారి కూడా రెగ్యులర్‌గా ఇచ్చిన ఫీడ్ బ్యాకేనని, అందులో ప్రత్యేకత ఏమిలే దన్నారు. అయితే, ఈసారి మాత్రం లేఖ బైటికి రావడం బాధాకరంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. పార్టీలో అన్నిస్థాయిలో ఉన్న నాయకులందరూ అనుకుంటున్న విషయాలు, ఇటీవల దాదాపు సగం తెలంగాణలో తాను పర్యటించిన సందర్భంలో తెలంగాణ ప్రజలు అనుకుంటున్న అంశాలనే లేఖలో చెప్పానే తప్ప వ్యక్తిగత ఎజెండా లేదన్నారు. కానీ, మా నాయకునికి రాసిన లేఖ బహిర్గతమైందంటే ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. పార్టీలో చిన్న చిన్నలోపాలను చర్చించుకొని,సవరించుకొని, కోవర్టులను పక్కకు జరుపుకుంటూ ముందుకుపోతే పార్టీ పది కాలాల పాటు చల్లగా ఉంటుందనే భావన ఉన్నదన్నారు.లేఖలో కూడా తాను కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఏమీ రాయలేదని, పార్టీని బలోపేతం చేసేందుకు రాసానని చెప్పారు. ఈ లేఖను చూసి కాంగ్రెస్, బిజెపి బాగా సంబరపడుతున్నట్లుగా ఉన్నాయని, ఏదో బిఆర్ఎస్ ఆగమైపోతుందని, కెసిఆర్‌కు ఏమో అయింది అనుకుంటున్నాయని పేర్కొన్నారు. మా నాయకుడు కెసిఆరేనని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ బాగుపడుతుందని, ఆయన నాయకత్వంలోనే బిఆర్ఎస్ ముందుకు పోతుందని బలంగా నమ్ముతున్నట్లు కవిత వెల్లడించారు.

**కవితకు కొత్త బ్యానర్ల స్వాగతం :** కెసిఆర్ కుమార్తె కె.కవిత శుక్రవారం సాయంత్రం అమెరికా నుంచి తరిగి వస్తున్న సందర్భంలో శంషాబాద్ విమానాశ్రయంలో కోలాహలం చోటుచేసుకుంది. తండ్రికి కవిత రాసిన లేఖ ఐడియాలు సోషల్‌మీడియాలో పెద్ద ప్రచారం పొందటం దీనికి నేపథ్యం. ఆమెకు స్వాగతం చెప్పటానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలెవరూ రాలేదు. గులాబీరంగు జెండాల జాడలేదు. బిసి సంఘాల పేరుతో, కవిత మహిళా సంఘం జనజాగృతి పేరుతో బ్యానర్లు, ప్లకార్డులతో జనాలు చేరారు. సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేస్తున్న కవితకు స్వాగతం పలికారు. బ్యానర్ కూడా గులాబీ రంగు కాదు. నీలం రంగు బ్యాక్‌గ్రౌండ్‌పై పసుపుపచ్చలో అక్షరాలు. ప్లకార్డులపై కూడా గులాబీ లేదు. వీరెవరు, ఎవరు ఆర్గనైజ్ చేశారు, బిఆర్ఎస్‌లో దీని పర్యవసానమేమిటో రోజులు గడిస్తే గాని తెలియదు.

## యోచనలో యూనస్
(మొదటి పేజీ తరువాయి)

షేక్ హసీనా ప్రభుత్వం కూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయి. ఆపద్ధర్మ ప్రభుత్వంలోనూ పరిస్థితులు పూర్తిస్థాయిలో చక్కబడలేదు. ప్రజాందోళనలు ఉధృతమవుతున్నాయి. నిరసనలు పెరుగుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. దీంతో నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనపై ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో తీవ్ర అసహనం ఉంది. ప్రభుత్వ వర్గాల్లోనూ అసంతృప్తి ఉంది. దేశాన్ని పాలించగల యూనస్ సామర్థ్యంపై ప్రశ్నలు వస్తున్నాయి. దీంతో ఆయన పదవీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు నేషనల్ సిటిజన్ పార్టీ కన్వీనర్ నహీద్ ఇస్లాం తెలిపారు. తాజా సలహా మండలి సమావేశంలో యూనస్ తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. బంగ్లాదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, అంతర్గత విభేదాలు తలెత్తుండటం, తన పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలు వస్తుండటంతో మదన పడుతున్న యూనస్‌ను ఆయన అధికారిక నివాసంలో సమాచార సలహాదారు మెహఫూ ఆలం, ప్రభుత్వ సలహాదారు ఆసిఫ్ మహమూద్ షోజిబ్ భూయన్, నేషనల్ సిటిజన్ పార్టీ నహీద్ ఇస్లాం కలిశారు. పెరుగుతున్న వివాదాస్పద డిమాండ్లపై యూనస్ ఆందోళన వ్యక్తంచేసినట్లు ఇస్లాం అనంతరం మీడియాకు తెలిపారు. 'నేను ఇలా పని చేయలేను. రాజకీయ పార్టీలన్నింటి మధ్య ఏకాభిప్రాయం లేకుండా ముందుకెళ్లలేం' అని యూనస్ అన్నారన్నారు. తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని తాను యూనస్‌ను కోరినట్లు ఇస్లాం చెప్పారు. పార్టీల మధ్య ఐక్యతకు యూనస్ హామీ ఇవ్వగలరని, ఆయనకు అందరి సహకారం లభిస్తుందని నహీద్ ఇస్లాం ఆకాంక్షించారు. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ సహా ఇతర పార్టీలు తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్ర అసంతప్తి వేళ బంగ్లా సైన్యాధికారి వకార్‌ఉజ్‌జమాన్‌తో విబేధాలు సమస్యను పెంచాయి. అయితే ఎన్నికల నిర్వహణ, సైనిక వ్యవహారాల్లో జోక్యం సహా యూనస్ నిర్ణయాలతో వీరి మధ్య విభేదాలు పెరిగినట్లు తెలుస్తోంది. 2026 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని యూనస్ పేర్కనడంపై అభ్యంతరం వ్యక్తమైంది. 'యూనస్‌కు 84 ఏళ్లు. ఇంతటి ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు' అని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాగా, దేశ భద్రత, భవిష్యత్తు కోసం బలంగా ఉండాలని రాజీనామా ఆలోచన మానుకోవాలని యూనస్‌ను తాను కోరినట్లు నహిద్ ఇస్లాం వెల్లడించారు.

## మరణాలు ఎందుకు?
(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయని విస్మయం వ్యక్తం చేసింది. 'రాష్ట్ర ప్రభుత్వంగా మీరు ఏమి చేస్తున్నారు?. ఎందుకు ఈ పిల్లలు కోటా నగరంలో మాత్రమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?. ఒక రాష్ట్రంగా మీరు ఏ ఆలోచనా చేయలేదా?' అని జస్టిస్ పార్థివాలా రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని ఉద్దేశించి ప్రశ్నించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ను ఏర్పాటు చేశామని న్యాయవాది చెప్పారు. ఖరగ్‌పూర్ ఐఐటిలో 22ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయమై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. మే 4న ఆ విద్యార్థి తన హాస్టల్ రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటాన్ని కనుగొన్నారు. ఎన్ఇఇటి (నీట్) ఆశావహ విద్యార్థిని కోటాలోని తన రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మరో కేసును కూడా ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి కోటాలో నివసిస్తున్నారు. ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి మరణానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ధర్మాసనం గమనించింది. అయితే మే 8న నమోదైన ఎఫ్ఐఆర్ నమోదుకు సంబంధించి 4 రోజుల ఆలస్యం ఎందుకు అయ్యిందని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది.'ఈ విషయాలను తేలికగా తీసిపారేయొద్దు. ఇవి చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయాలు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మార్చి 24న అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఉన్నత విద్యాసంస్థలలో పునరావృతం అవుతున్న విద్యార్థుల ఆత్మహత్యల కేసులను పరిగణనలోనికి తీసుకుని, విద్యార్థుల మానసిక సంఘర్షణలను పరిష్కరించడానికి, అటువంటి సమస్యలను నివారించడానికి సుప్రీంకోర్టు ఒక జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం ధర్మాసనం మాట్లాడుతూ ఇలాంటి ఆత్మహత్యల కేసులలో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా త్వరగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం అవసరమని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. కోర్టుకు హాజరైన పోలీస్ అధికారిని ఉద్దేశించి ధర్మాసనం మాట్లాడుతూ 'మీరు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసేందుకు ఎందుకు 4రోజుల సమయాన్ని తీసుకున్నారు?. ధర్మాసనం ప్రశ్నకు ఆ పోలీస్ అధికారి స్పందిస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని విన్నవించారు. చట్ట ప్రకారం మీరు మీ దర్యాప్తును కొనసాగించండి' అని ధర్మాసనం ఆయనను ఆదేశించింది. ఆత్మహత్య గురించి తెలుసుకున్న తర్వాత ఐఐటి ఖరగ్‌పూర్ అధికారులు పోలీసులను అప్రమత్తం చేసినట్లు రికార్డుల్లోకి వచ్చింది. అయితే ఐఐటి ఖరగ్‌పూర్ తరపు న్యాయవాది, పోలీస్ అధికారి చెప్పిన వివరణకు ధర్మాసనం సంతృప్తి చెందలేదు.' ఈ విషయం గురించి కఠినమైన అభిప్రాయానికి వచ్చాం. పోలీస్ స్టేషన్ జ్యూరీస్‌డిక్షన్‌కు సంబంధించి ఇన్‌చార్జి పోలీస్ ఆఫీసర్‌కు వ్యతిరేకంగా కంటెంప్ట్ కింద కూడా మేం ముందుకు వెళతాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తు తప్పనిసరిగా సరైన దిశలో జరగాలని బెంచ్ చెప్పింది. కోటా ఆత్మహత్య కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడాన్ని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నదని, రాష్ట్రంలోని ఆత్మహత్యల కేసుల గురించి ప్రత్యేక దర్యాప్తు బృందానికి అవగాహన ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది బెంచ్‌కు తెలియజేశారు. కోటాలో ఎంతమంది యువ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారో చెప్పండి అని ధర్మాసనం ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ 14మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ధర్మాసనానికి నివేదించగా బెంచ్ దీనిని తిప్పికొడుతూ ఎందుకు ఈ విద్యార్థులు చనిపోతున్నారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ కోర్టుకు మిశ్రమ నివేదికను ఇవ్వడానికి ముందు దాని సమయం ఆసన్నమైందని పేర్కొంది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మీరు మా తీర్పును ధిక్కరిస్తున్నారు. మీరు ఎందుకు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయలేదు' అని రాజస్థాన్ ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. బెంచ్ మాట్లాడుతూ 'విద్యార్థి విద్యాసంస్థ కల్పిస్తున్న వసతులను వినియోగించుకుంటూ వారు కల్పించిన నివాసంలో ఏమీ ఉండలేదు కదా? 2024లో విద్యార్థిని వెళ్లిపోయి తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నది కదా' అని బెంచ్ చెప్పింది. సుప్రీంకోర్టు మార్గనిర్దేశానికి అనుగుణంగా నడుచుకోవడం సంబంధిత పోలీస్ అధికారిగా మీ డ్యూటీ చేయాలి. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి దర్యాప్తు జరపాల్సిన డ్యూటీ మీది. అయితే ఇన్‌చార్జి అధికారి గా పోలీస్‌స్టేషన్ ప్రాదేశికానికి సంబంధించిన డ్యూటీని నిర్వర్తించడంలో ఆయన వైఫల్యం చెందారు. కోర్టు జారీచేసిన ఆదేశాలను ఆయన ఏ మాత్రం పాటించలేదు' అని బెంచ్ అసహనం వ్యక్తం చేసింది. కోటా కేసులో పరిస్థితిని వివరించేందుకు సంబంధిత పోలీస్ అధికారిని జులై 14న హాజరుకావాలని ఆదేశిస్తూ అత్యున్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

## కుప్పకూలింది
(మొదటి పేజీ తరువాయి)

అని రాహుల్ ప్రశ్నిస్తూ వీటికి వివరణ ఇస్తారా అని నిలదీశారు. భారత విదేశాంగ విధానం కూలిపోయిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ భారత ప్రతిష్టతో రాజీ పడ్డారని రాహుల్ గురువారం ఆరోపించారు. పాకిస్తాన్‌పై సైనిక వైరాన్ని నిలిపివేయడానికి అంగీకరించడం ద్వారా మోదీ దేశ ప్రయోజనాలను ఎందుకు త్యాగం చేశారని నిలదీశారు. 'మోదీ జీ.. ఖాళీ ప్రసంగాలు చేయడం ఆపండి. ఒక్క మాట చెప్పండి: ఉగ్రవాదంపై పాకిస్థాన్ ప్రకటనను మీరు ఎందుకు నమ్మారు? ట్రంప్‌కు తలవంచి భారతదేశ ప్రయోజనాలను ఎందుకు త్యాగం చేశారు? కెమెరాల ముందు మాత్రమే మీ రక్తం ఎందుకు మరుగుతుంది? మీరు భారతదేశ ప్రతిష్టతో రాజీ పడ్డారు!' అని ఆయన ఎక్స్‌లో చేశారు. విదేశాంగ మంత్రిని కాంగ్రెస్ నాయకులు 'జైచంద్ జైశంకర్' అని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయంలోని ఎఐసిసి కార్యదర్శి గౌరవ్ పాంధి మాట్లాడుతూ 'జైచంద్ జైశంకర్ విదేశాంగ మంత్రిగా కొనసాగుతున్న ప్రతి రోజు, ఆయన కేవలం ఒక బాధ్యత మాత్రమే కాదు, భారతదేశ జాతీయ ప్రయోజనాలకు తీవ్రమైన ముప్పుగా మిగిలిపోతున్నారు. ఆయనను వెంటనే పదవి నుండి తొలగించాలి. ఆయన వైఫల్యాలను పరిశోధించడానికి స్వతంత్ర విచారణ ఏర్పాటు చేయాలి' అన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాయుధ దళాలు బలంగా ముందుకు సాగుతున్న సమయంలో ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ఇండోపాక్ వివాదంపై తమ నాయకుల ప్రకటనలపై కాంగ్రెస్, బిజెపి మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. అధికార పార్టీ రాహుల్ గాంధీని 'ఆధునిక యుగం మీర్ జాఫర్' అని, ప్రతిపక్ష పార్టీ జైశంకర్‌ను 'నవ యుగం జైచంద్' అని అభివర్ణిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వ్యాఖ్యలపై రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకున్నాయి. సోషల్ మీడియాలో మీమ్‌లను కూడా పోస్ట్ చేశాయి. దేశానికి ద్రోహం చేస్తున్నారని పరస్పరం ఇరు పార్టీలు నిందించుకుంటున్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి పాకిస్థాన్‌ను ముందే హెచ్చరించారని ఆరోపిస్తూ కాంగ్రెస్, రాహుల్ గాంధీ జైశంకర్‌పై విమర్శల చేశారు. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేశానని అమెరికా అధ్యక్షుడు పదేపదే చెబుతున్నారు.

## ప్రజల్లోకి తీసుకెళ్ళండి
(మొదటి పేజీ తరువాయి)

అనేది నినాదం కాదని, జాతీ నిర్ణయం అని తెలిపారు. కులగణన కొత్తదేమి కాదని, కాంగ్రెస్ పార్టీ నిరంతరం ఈ అంశాన్ని లేవనెత్తిందని, మానిఫెస్టోలో, పార్లమెంటులో, వీధుల్లో, సామాజిక న్యాయం గురించి మాట్లాడే ప్రతి వేదికపై లేవనెత్తిందని గుర్తు చేశారు. ''దేశ అధికార వ్యవస్థలో ఒబిసి, దళితులు, ఆదివాసీల భాగస్వామ్యం ఎంత? అని మనం ప్రశ్నించాలి. ఆ వర్గాల జనాభాకు అనుగుణంగా మీడియా, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు, కార్పొరేట్ రంగంలో, ఉన్నత విద్యా సంస్థల్లో ప్రాతినిధ్యం ఉందా? లేకపోతే, అందుకు కారణమేమిటి? దానికి పరిష్కారమేమిటి?' అని ఖర్గే అన్నారు. ''దాని నిజాన్ని బైటికి తీసుకురావడమే పరిష్కారమని, సామాచారాన్ని ప్రజల ముందుంచాలని, తరువాత విధానాలను పునర్నిర్మించాలి. అందుకే కుల గణనను మేము అంకెల కసరత్తులా కాకుండా భారతీయ ప్రజాస్వామ్య నైతిక కర్తవ్యంగా భావిస్తున్నామ''ని ఖర్గే వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) ప్రకారం ఒబిసి, దళితులు, ఆదివాసీ విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాల్సిందిగా స్పష్టంగా డిమాండ్ చేసిందన్నారు. కొత్త సమాచారం ఆధారంగా 50 శాతం రిజర్వేషన్ పరిమితిని పునః పరిశీలించాలని కోరామని అన్నారు.

### తెలంగాణ నమూనాకు కేంద్రం స్వీకరించాలి

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వే ఒక నమూనాను అందించింది, ఇందులో సమాజం, నిపుణులు, ప్రభుత్వం అన్ని వర్గాలు పాల్గొన్నాయని ఖర్గే తెలిపారు. ఇలాంటి ప్రజలకు అనుగుణమైన, పారదర్శక నమూనాని కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలని, ఈ ప్రక్రియలో సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## చర్చించండి
(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. కెసిఆర్ తన హయాంలో రాష్ట్ర అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఫార్మా, ఐటి రంగాలను బలోపేతం చేయడంతో పాటు పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచి సంపదను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మెదక్ ప్రాంతానికి ఇందిరమ్మకు ఉన్న అనుబంధం విడదీయలేనిదని ఆయన అన్నారు. మెదక్ పేరు గురుకు వస్తేనే ఇందిరమ్మను తలచుకుంటామని తెలిపారు. ఇందరమ్మ తన చివరి రోజుల్లో మెదక్ ఎంపిగా కొనసాగారని గుర్తు చేశారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసా రూ. 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి పాలకులు అన్నారని, కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం రూ.5500 కోట్లు కేటాయించామని, కోటి మంది మహిళల కోటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునుద్ఘాటించారు. మిని వరల్డ్ కాంపిటేషన్‌కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని, మీరందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచామని, భూ సేకరణను వేగవంతం చేశామని చెప్పారు. త్వరలో హ్యుందాయ్ కార్ల తయారీ కంపెనీ ఇక్కడ పనులు ప్రారంభిస్తోందని చెప్పారు. నిమ్జ్ భూ నిర్వాసితులైన 5612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తామన్నారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం బిహెచ్‌ఎల్ , బిడిఎల్, నిమ్జ్ ,ఇక్రిశాట్, ఇవన్ని కాంగ్రెస్ హయంలో వచ్చినవేనన్నారు. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా మారుస్తామని ముఖ్య మంత్రి వ్యాఖ్యానించారు. 15 నెలల్లో తెలంగాణకు 3 లక్షల కోట్ల పెట్టు బడుల్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జహీరాబాదు చెరుకు రైతులు సహకార సంఘంగా ఏర్పడి ముందుకు వస్తే నిమ్జ్‌లో స్థలం కేటాయించి చెరుకు కర్మాగారం ఏర్పాటుకు సహకారం అందిస్తామని చెప్పారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏ రోజూ తాను సిఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. ప్రతిపక్షాలు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామన్నారు. ప్రపంచంలో తెలంగాణాన్ని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు దామదర్ రాజనర్సిహ, కొండాసురేఖ, ఎం.పి సురేష్ శేట్కర్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మాణిక్యరావు, జిజిఐసి నిర్మల జగ్గారెడ్డి, పిసిసి వర్కింగ్‌ప్రసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ ఫంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బసవేశ్వర విగ్రహం ఆవిష్కరణ

అంతకు ముందు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. హుగ్గెల్లి కూడలిలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. మామునూరులో కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణంలో రూ. 498.67 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అక్కడ మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం పరిశీలించారు.

## సిగ్గుచేటు (మొదటి పేజీ తరువాయి)

తేల్చాయని, అన్ని నివేదికలను క్రోడీకరించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మూడేళ్లకే కూప్పకూలడానికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని మంత్రి స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఇప్పటికే 17 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది గత ప్రభుత్వం రాజకీయ దురుద్దేశం, కాసుల కక్కుర్తితో లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరానికి బదులుగా ప్రతిపాదిత బిఆర్ అంబేద్కర్–ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద రూ.38 వేల కోట్లతో నిర్మించి ఉంటే ఆ ప్రాజెక్టు పూర్తై దాదాపు 17లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన రూ.62 వేల కోట్లతో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పాలమూరు రంగారెడ్డి, నెట్టంపాడు, బీమా, ఎస్ఎల్‌బిసి, డిండి, సీతారామసాగర్, సమ్మక్క సారక్క ప్రాజెక్టులు కూడా పూర్తైయ్యేవని, తద్వారా తెలంగాణ సస్యశామయ్యేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కానీ మాజీ సిఎం కెసిఆర్ మాత్రం తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి మరీ అధిక వడ్డీ రేటుతో స్వల్పకాలిక రుణాలను తెచ్చి మేడిగడ్డ వద్ద కాళేశ్వరంపేరుతో ప్రాజెక్టు నిర్మించి నీటిని తరలించి రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం మోపారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు.

### కమిషన్ నోటీసులకే ఎందుకంతా వణుకు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై ఏర్పాటు చేసిన రిటైర్డ్ జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు జారీ చేస్తే ఎందుకంతా వణుకుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఏ తప్పు చేయకుండా నిర్భయంగా కమిషన్ ముందు తమ వివరణను ఇవ్వవచ్చు కదా అన్నారు. గతంలో దేశంలో ఏర్పాటైన అనేక కమిషన్ల ముందు పెద్ద నాయకులు సైతం హాజరై తమ వివరణ ఇచ్చారని ఆ సందర్భాలను ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యున్నత పదవులు నిర్వహించిన వ్యక్తి జస్టిస్ పిసి.ఘోష్‌తో న్యాయ విచారణ కమిటీ ఏర్పాటు చేశారని, ఇది పూర్తిగా స్వతంత్ర కమిటీ అని, ప్రభుత్వానికి ఏలాంటి సంబంధంలేదని, అలాంటి కమిటీకి కూడా బిఆర్‌ఎస్ నాయకులు తప్పు పట్టడం అర్థరహితమన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎవరైనా మావోయిస్టులు ఉంటే లొంగిపోండి : డిజిపి జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎవరైనా మావోయిస్టులు ఉంటే పోలీసుల ముందు లొంగిపోవాలని డిజిపి డాక్టర్ జితేందర్ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇప్పటి వరకు 300 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారికి పోలీసు శాఖ తరపున పునరావాసం కల్పించామని తెలిపారు. అయితే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో (కర్రెగుట్ట) జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లపై డిజిపి జితేందర్ స్పందించారు. మావోయిస్టులకు ఉనికి లేదని..తెలంగాణ రాష్ట్రంలో ఏ మూలన ఎవరైనా మావోయిస్టులు ఉంటే భయపడాల్సిన అవసరం లేదని..వారంతా పోలీసుల ముందు లొంగిపోతే వారికి పునరావాసం చట్టప్రకారం కల్పిస్తామని జితేందర్ పేర్కొన్నారు.

**‘ఉగ్ర’ స్లీపర్ సెల్స్‌లను గుర్తిస్తున్నాం :** పేలుళ్ల కుట్ర సూత్రధారి సమీర్ కేసు దర్యాప్తు కొనసాగుతోందని డిజిపి జితేందర్ తెలిపారు. నిందితులు ఉగ్ర కుట్రలో భాగంగా ఒక గ్రూప్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తే తాము విచ్ఛిన్నం చేశామని చెప్పారు.

# ఆశయం, ఆచరణ సమ్మిళితుడు గిరిప్రసాద్

నేడు 29వ వర్ధంతి



నమ్మిన సిద్ధాంతంకై నడిచిన రణధీరుడు ఆయన. యుక్త వయస్సులోనే తెలంగాణ గ్రామీణ ప్రాంత ఈతి బాధలను చూసి చలించి ఉన్నత విద్యను వదిలి సరాసరి రాజకీయ శిక్షణా శిబిరానికి చేరుకున్న కార్యశీలి. సామాన్య కార్యకర్తగా మొదలైన ఆ ప్రస్థానం భారత కమ్యూనిస్టు పార్టీలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆశయం, ఆచరణ మూర్తీభవించిన మహనీయుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి నేడు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి ఒక పరిస్థితిలో జరుపుకుంటున్నాం. 99 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానాన్ని ముగించుకుని సిపిఐ శత వసంతంలోకి అడుగిడింది. నాటి ఉద్యమ ఘట్టాలను నేటి తరానికి తెలియజేస్తూ కార్యకర్తలను భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేస్తున్న సందర్భమిది. వాడవాడలా పార్టీ శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్న విషయం విదితమే. మరోపక్క పెరుగుతున్న మతోన్మాదం, ఆర్థిక అంతరాలు దేశాన్ని సంక్లిష్ట స్థితికి నెట్టివేస్తున్న సమయం, నాటి తెలంగాణ సాయుధ పోరాటం దళ కమాండర్ నుంచి రాజ్యసభ సభ్యునిగా, సిపిఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి వరకు సాగిన గిరిప్రసాద్ జీవితాన్ని మననం చేసుకుని ఆ స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ప్రజా పోరాటాలను నిర్వహించాలి. నల్లమల గిరిప్రసాద్ ఖమ్మం జిల్లా మధిర మండలం తొండలగోపవరం గ్రామంలో ఎగువ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. మద్రాస్ కళాశాలలో చదువుకుంటూ తెలంగాణలోని పరిస్థితులు, ఆంధ్రమహాసభ కార్యక్రమాలను తెలుసుకుని విద్యను మధ్యలో వదిలేసి ఇప్పటి ఎన్‌టిఆర్ జిల్లా తునికిపాడు గ్రామంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యాడు. ఆ తర్వాత గ్రామ రక్షణ దళంలో సభ్యునిగా చేరాడు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గిరి దళానికి నాయకత్వం వహించాడు. పాల్వంచ ప్రాంతంలో గ్రామాలను విముక్తి చేసి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశాడు. మన్యం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందిన గిరిప్రసాద్‌ను అంతం చేసేందుకు నిజాం రక్కసిమూకలు అనేక ప్రయత్నాలు చేశాయి. గిరిదళంపై కాల్పులు జరపటంతో తుపాకి గుండ్లకు గిరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. రక్తం మడుగులో ఉన్న గిరిప్రసాద్‌ను గిరిజనులు రక్షించారు. సాయుధ పోరాట విరమణ అనంతరం ఖమ్మం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ‘విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు’ అనే నినాదంతో ఉవ్వెత్తున సాగిన విశాఖ ఉక్కు సాధనోద్యమ సందర్భంగా తన తోటి సిపిఐ సభ్యులతో కలిసి రాజీనామా చేశారు. 1992లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఖమ్మంజిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, సిపిఐ జాతీయ ఉపప్రధాన కార్యదర్శిగా గిరిప్రసాద్ పనిచేశారు. పార్టీ నిర్మాణంపై గిరిప్రసాద్ మాటలు సదా అనుసరణీయం. కమ్యూనిస్టులకు నిర్మాణమే ఏకైక ఆయుధమని సమర్థులు, చైతన్యవంతులైన కార్యకర్తలు మాత్రమే ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చగలరని ఆయన బోధించేవారు. నిరంతరం నూతన కార్యకర్తలను పార్టీ వైపు ఆకర్షించడం, వారికి సైద్ధాంతిక శిక్షణనిచ్చి పార్టీని బలోపేతం చేయడం నాయకులా పార్టీ బాధ్యుల కర్తవ్యం కావాలని గిరిప్రసాద్ చెప్పేవారు. గ్రామస్థాయి నుండి అన్ని కమిటీలు పట్టుదలతో పనిచేసినప్పుడే ఇతర ప్రాంతాలకు, ఇతర రంగాలకు పార్టీ విస్తరించగలుగుతామని ఆయన చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ప్రజల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని సంబంధాలు దాదాపుగా ఆర్థిక సంబంధాలుగా మారుతున్నవేళ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించడం, వారిని సుశిక్షితులైన కార్యకర్తలుగా తయారు చేయడం అంత తేలికైన పనికాదు. ఇందు కోసం వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకత్వం మరింతగా శ్రమించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గిరిప్రసాద్ మాటలను జ్ఞప్తికి తెచ్చుకోవాలి. 1980 దశకంలో మధిరలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన గిరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు నాయకుల వద్దకు భవిష్యత్తులో రాకపోవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఉండకపోవచ్చు. ఎవరైతే జనంలోకి వెళతారో వారే నాయకులుగా మిలుగుతారన్నారు. నేటి పరిస్థితిని దాదాపు మూడు దశాబ్దాల క్రితమే చెప్పిన కమ్యూనిస్టు తత్వవేత్త గిరిప్రసాద్. శత వసంతంలోకి కమ్యూనిస్టు పార్టీ అడుగిడిన సందర్భంగా నేటి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపడంతో పాటు కమ్యూనిస్టు భావజాలానికి దూరంగా జరుగుతున్న యువతను ఆకర్షించాలి. ప్రజా సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి బహుముఖ పోరాటాలు నిర్వహించడమే గిరిప్రసాద్‌కు మనమిచ్చే నివాళి. శత వసంత వేళ కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో నిప్పులు చెరగని సూర్యుడిలా మసకబారని చంద్రునిలా నిలిచిన గిరిప్రసాద్‌కు అక్షరాంజలి ఘటిస్తున్నాం.


ప్రజాపక్షం— ఖమ్మం

## ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. అయితే రాగల రెండురోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, దాంతో పాటు కర్నాటక, తమిళనాడుతో పాటు దక్షిణ మధ్య ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

# 42శాతం బిసి రిజర్వేషన్లు అమలుకు కృషి

డిల్లీలో కులగణనపై టిపిసిసి మహేష్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. కులగణన వల్ల రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయని, దాంతో ఏ కులానికి ఎంత రిజర్వేషన్లు ఇవ్వాలో లెక్క తేలిందన్నారు. ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో శుక్రవారం ఆయన కులగణనపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు జైరాం రమేష్, కొప్పుల రాజు, మధుయాష్కీ, దేశవ్యాప్తంగా ఉన్న ఎఐసిసి జాతీయ అధికార ప్రతినిధులు, మీడియా ఇంచార్జ్‌లు పాల్గొన్నారు. సుమారు రెండున్నర గంటలపాటు సాగిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కులగణన ప్రక్రియను కూలంకుషంగా వివరించారు. బిసి కులగణన హామీతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణన హామీ ఇవ్వడంతో సమాజంలో బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగవంతమైన కార్యాచరణతో చేసిన కులగణన దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కులగణన దేశంలోనే మొదటిసారి తెలంగాణలో జరగడం, అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగడం గొప్ప విషయమన్నారు. రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో కులగణన చేపట్టామన్నారు. రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపినట్లు వివరించారు. ఇది చరిత్రాత్మక నిర్ణయం, దేశంలో మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గర్వకారణమన్నారు.




# కవిత ప్రశ్నించినప్పుడు కెసిఆర్ సమాధానం ఏదీ?

బిజెపితో బిఆర్ఎస్ దోస్తీపై ముందునుంచే చెబుతున్నాం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** బిఆర్ఎస్, బిజెపి వేర్వేరు కాదని, గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విమర్శించారు. గత పది సంవత్సరాలు బిఆర్ఎస్, బిజెపి మధ్య ఉన్న సంబంధంపై తాము ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు. తాము అడిగితే రాజకీయం అని అన్నారని, మరి కెసిఆర్ కూతురు కవితనే ఈ ప్రశ్నలు అడిగితే అందుకు కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాసిన లేఖపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2001 నుంచి పార్టీలో ఉన్నవారికి ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వడం లేదని, బిజెపిపై సరైన విమర్శలు ఎందుకు చేయలేదని కవిత ప్రశ్నించారని పేర్కొన్నారు. కవిత నేరుగా పార్టీ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశారని తెలిపారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్‌రావులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ సగటు మనిషికి ఉన్న అనుమానాన్ని కవిత వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలీయంగా నిజనిర్ధారణ జరిగే విధంగా కవిత లేఖ ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపిలోని కొందరితో బిఆర్ఎస్ పార్టీలోని కొంత మంది స్నేహపూర్వకంగా ఉంటున్నారని కవిత ప్రశ్నించారని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం తప్పు చేస్తున్నా కెసిఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదని కాంగ్రెస్ అడిగితే రాజకీయం అన్నారన్నారు. ప్రజాస్వామ్యానికి అవకాశం లేని పార్టీ బిఆర్ఎస్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు సామాన్య కార్యకర్తలను కలవడం లేదని కూతురే విమర్శిస్తోందన్నారు. అధ్యక్షుడు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, కార్యకర్తల కష్టాలు పంచుకోవడం లేదన్నారు. అంత పెద్ద సభలో 2001 నుంచి పార్టీలో ఉన్న సీనియర్‌లకు మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వలేదని కవిత లేఖలో ప్రశ్నించారన్నారు. కవిత లేవనెత్తిన అంశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ ట్రబుల్ షూటర్ అని చెప్పుకునే హరీష్‌రావు, అధ్యక్షుడు కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బిజెపి నాయకత్వం సైతం సమాధానం చెప్పాలన్నారు. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. బిజెపి అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నప్పుడు బిజెపి, బిఆర్ఎస్ రాజకీయ అగ్రిమెంట్ ప్రకారం కెసిఆర్ సూచన మేరకే కిషన్ రెడ్డి అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి కెసిఆర్ ప్రతిపాదించిన అధ్యక్షుడు కాదా? దీనిపై స్పందించాలన్నారు. దేశబడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి ఇవ్వకపోయినా కెసిఆర్ ప్రశ్నించలేదన్నారు. విభజన హామీలు అమలు కాకపోయినా మాట్లాడలేదన్నారు. సీలేరు ప్రాజెక్ట్ ఎత్తుకుపోతే ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలన్నారు. కవిత లేఖను, ప్రశ్నల నుంచి ప్రజలను డైవర్షన్ చేయడానికి కెటిఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికపై ఈడీ పేరుతో వేదింపులు జరుపుతున్న కేసు బిజెపి వేదింపు కార్యక్రమేనన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు సంపాదించుకోవాలనుకుంటే లెక్క లేదన్నారు. 50 మంది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులను చేసిన ఘనత వారిదేనన్నారు. కానీ వారు దేశం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు. కెటిఆర్, బిజెపి డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డిపై మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం బాంబు పెట్టారేమో అని కమిషన్ వేశారన్నారు.

## బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** బూటకపు ఎన్‌కౌంటర్‌లు ఆపాలి.. మావోయిస్టులతో చర్చలు జరపాలని, మతోన్మాదానికి వ్యతిరేకంగా జనసేవాదళ్ కార్యకర్తలు పోరాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. జనసేవాదళ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలు ఈనెల 26 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరుగుతున్న నేపథ్యంలో శిక్షణ శిబిరాలు విజయవంతం చేయాలని వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె.బాష్‌మియా, పనాస ప్రసాద్, జనసేన రాష్ట్ర నాయకులు బోయిని అశోక్, మారెపాక అనిల్ కుమార్, దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్‌తో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మత ఉన్మాదం పెరిగిపోయి దేశ సమైక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, ఇలాంటి వాటిని ఎదుర్కోవటానికి జనసేవాదళ్ కార్యకర్తలు ముందుండాలని కోరారు. జనసేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడానికి మే 26 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆరు రోజులపాటు యువతకు సామాజిక సేవ, ప్రజలు విపత్కర పరిస్థితిలో ఉన్నపుడు, వరదలు, అగ్నిప్రమాదాలు, రైలు ప్రమాదాలతో పాటు జాతరలో ప్రజలకు సేవలు అందించే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను లేకుండా చేస్తామని అమాయక గిరిజనులను హతమారుస్తున్నారని, మావోయిస్టులు చర్చలకు వస్తామన్నా వారితో చర్చించకుండా బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని విమర్శించారు. అడవి సంపదను అంతా కూడా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితమైన విధానాలను అవలంబిస్తున్నదని ఆరోపించారు. మావోయిస్టులు ఈ దేశ పౌరులేనని, ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్నారపు రమేష్, కందిక చెన్న కేశవులు, సంగి ఎలేందర్, ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్‌రెడ్డి పేరుతో సిఎం అవినీతి గుట్టురట్టు




బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు పెట్టడంతో సిఎం అవినీతి బండారం మొత్తం బయటపడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభపెట్టాడని ఈడి నమోదు చేసిన చార్జ్‌షీట్‌తో సిఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైందన్నారు. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయిందని విమర్శించారు. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సిఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా తయారైందన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఈసారైనా రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకుంటుందా? లేదా రేవంత్ రెడ్డి పొంగులేటి తరహాలో చీకట్లో బిజెపి పెద్దల కాళ్లు పట్టుకుంటాడా? ఈడి, కేవలం చార్జ్‌షీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా? లేదా అమృత్ పథకం వంటి స్కామ్‌ల తరహాలో వదిలిపెడతారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న అన్నారు.

**మీ తప్పులు ఎత్తి చూపిస్తే కోర్టు తీర్పులను అపహాస్యం చేస్తారా? : కెటిఆర్**

కంచె గచ్చిబౌలి అయినా, పాలమూరు ప్రాజెక్ట్ అయినా, మీ తప్పులు ఎత్తి చూపిస్తే కోర్టు తీర్పులను అపహాస్యం చేస్తారా? అని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడంపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో పూర్తిగా విస్మయం చెందానని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేయడం సుప్రీంకోర్టును మాత్రమే కాదు, భారత రాజ్యాంగాన్ని కూడా కించపరచడమన్నారు.

# ‘నేడు’ నీతి ఆయోగ్ సమావేశానికి సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ‘వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్–2047’ ఎజెండాతో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరగనుంది. 2018 తర్వాత తొలిసారిగా తెలంగాణ ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతున్నారు. ఇందు కోసం సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ‘తెలంగాణ రైజింగ్–2047 విజన్’ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. తెలంగాణలో 2047నాటికి సాధించదల్చుకున్న లక్ష్యాలు, సుపరిపాలన విధానాలతో పాటు సమగ్రాభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై శనివారం ఢిల్లీలో జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పెట్టుబడుల సాధన, మౌలిక వసతుల అభివృద్ధికి ‘తెలంగాణ రైజింగ్’తో ముందుకు సాగుతున్న తీరును, ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సమగ్రంగా వివరిస్తారు. ముఖ్యంగా ఐటి, ఫార్మా, అర్బనైజేషన్ ముందున్న తెలంగాణ వాటిల్లో మరింత వేగంగా ముందుకు పోయేందుకు చేపడుతున్న చర్యలను వివరించనున్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పన, సమగ్రాభివృద్ధిలో భాగంగా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), రేడియల్ రోడ్లు, డ్రైపోర్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటిఐలను ఎటిసిలుగా మార్పు, యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో యూనివర్సిటీల ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న చొరవను గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముందు వివరించనున్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి చేసిన రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500లకే సిలిండర్ సరఫరా వంటి రాష్ట్రంలో నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తారు. సామాజిక సాధికారతలో భాగంగా ఎస్‌సి కులాల ఉప వర్గీకరణ, కులగణన, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శాసనసభలో తీర్మానించిన అంశాలనూ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ సంబంధం ఏమిటో తెలంగాణ ప్రజలకు స్పష్టమైంది

మెట్టు సాయి కుమార్ పిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కవిత లేఖ ద్వారా బిజెపి, బిఆర్ఎస్ సంబంధం ఏమిటో తెలంగాణ ప్రజలకు, సమాజానికి స్పష్టమైందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ వేర్వేరు కాదని గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు చెప్పిందని, అదే విషయాన్ని ఎమ్మెల్సీ కవిత బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాసిన లేఖలో ప్రస్తావించారని అన్నారు. తెలంగాణను అవమానించిన బిజెపితో కలిసి పనిచేసినందుకు తెలంగాణ సమాజానికి బిఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట కవిత రాసిన లేఖలో అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై ఉందని అన్నారు. బిఆర్ఎస్ విధానాలు ఏమిటని కవిత తన తండ్రిని అడిగారని, ఈ ప్రశ్నలకు కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు కాకుండా ఇంకెవరు సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ మిలాకత్‌కు నిదర్శనం పార్లమెంట్ ఎన్నికలో బిజెపి గెలిచిన సీట్లేనని పేర్కొన్నారు. కెటిఆర్ వద్ద ఆయన సోదరి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఉందా అని ప్రశ్నించారు. ఇప్పుడు కెటిఆర్ యూట్యూబ్ ఛానల్‌లు ఏమయ్యాయని, ఈ వార్త ఎందుకు కెటిఆర్ పేపర్‌లో, యూట్యూబ్ ఛానల్‌లలో రావడంలేదని సాయి కుమార్ నిలదీశారు. బిజెపికి మద్దతు ఇవ్వడంలో కెటిఆర్ ముందు వరుసలో ఉంటారన్నారు. తెలంగాణలో ఇక బిఆర్ఎస్ పార్టీకి మనుగడలేదన్నారు.

## హుస్సేన్‌సాగర్‌లో ఎస్‌డిఆర్‌ఎఫ్ ప్రదర్శన

పర్యవేక్షించిన డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టిజిఎస్‌పి) సిబ్బంది తో ఏర్పాటైన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) హుస్సేన్ సాగర్‌లో శుక్రవారం ప్రదర్శించింది. డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజిపి మహేష్ భగవత్,టిజిఎస్‌పి అదనపు డిజిపి సంజయ్‌కుమార్ జైన్‌లు పర్యవేక్షించారు.వరదలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్‌లోని అన్ని బెటాలియన్ల సిబ్బందితో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. గత డిసెంబర్ నెలలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1వ బెటాలియన్ యూసుఫ్‌గూడ, 2వ బేటాలియన్ ఆదిలాబాద్, 3వ బెటాలియన్ ఇబ్రహీంపట్నం, 4వ బెటాలియన్ వరంగల్, 5వ బెటాలియన్ ములుగు, 6వ బెటాలియన్ కొత్తగూడెం, 7వ బెటాలియన్ నిజామాబాద్, 8వ బెటాలియన్ కొండాపూర్, 10వ బెటాలియన్ బీచ్‌పల్లి, 12వ బెటాలియన్ నల్గొండ, 13వ బెటాలియన్ మంచిర్యాల, 17వ బెటాలియన్ సిరిసిల్ల సిబ్బందితో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) సిబ్బందితో శిక్షణ ఇప్పించారు. కటక్ (ఒడిశా), ఆర్కోణం (తమిళనాడు) వడోదర (గుజరాత్), పూణే (మహారాష్ట్ర), విజయవాడ (ఎపి) లోని ఎన్‌డిఆర్‌ఎఫ్ కేంద్రాలలో రెండు నెలల శిక్షణ పొందారు. శిక్షణ పొందిన టిజిఎస్‌పి సిబ్బంది హుస్సేన్ సాగర్ లోని బోట్ క్లబ్ వద్ద ప్రదర్శన ఇచ్చారు. బాధితులు నీళ్లలో మునిగిపోయినప్పుడు, ఆపదలో చిక్కుకున్నప్పుడు వారిని రక్షించే ప్రయత్నాలను ప్రదర్శన ద్వారా చూపించారు.

# పోలీస్ ఎన్‌కౌంటర్‌లో విజయలక్ష్మి మృతి

కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మహిళగా గుర్తింపు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పోలీసులకు, నక్సల్‌కు జరిగిన ఎదురు కాల్పుల్లో విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందినట్లు అధికారులు దృవీకరించారు. చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ సాయిలు గౌడ్ మొదటి భార్య రాధమ్మకు ముగ్గురు ఆడపిల్లలు, మూడో సంతానం విజయలక్ష్మి జన్మించిన ఏడాదికే పాము కాటుకు గురై రాధమ్మ మృతి చెందింది. అక్కడి నుండి విజయలక్ష్మి కేశంపేటలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి మహబూబ్‌నగర్‌లో డిగ్రీ పూర్తి చేసిన తరువాత హైదరాబాద్ లోని నిజాం కళాశాలలో ఎల్‌ఎల్‌బి చదువుతున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై ఉద్యమ బాట పట్టిన విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందినట్లు వివరించారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్ళిన యువతి అక్కడి నుండి అన్నల ఉద్యమాలకు ఆకర్షితురాలై పన్నెండు ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండిపోయింది. ఉద్యమాలకు ఆకర్షితురాలై వెళ్ళి మృత్యువు ఒడిలోకి చేరుకుంది. అప్పటి నుండి కుటుంబ సంబంధాలను తెంచుకొని ఉద్యమంలోకి వెళ్ళిన తర్వాత విజయలక్ష్మి తో ఏనాడు మాట్లాడలేదని, గ్రామానికి రాలేదని కుటుంబ సభ్యులు వివరించారు. పన్నెండు ఏళ్లుగా గ్రామానికి రాకుండా పోయిం ఎక్కడ ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్రంలో జరిగిన ఆపరేషన్ కగార్‌లో మృత్యువుపాలు కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

ఇన్నేళ్లుగా ఎక్కడ ఉందో..ఏమి చేస్తుందో తెలియక గ్రామస్తులు విజయలక్ష్మి ని పూర్తిగా మరచిపోయిన తరుణంలో నక్సల్స్ బరిలో ఉంటూ ఉద్యమాల కోసమే ఊపిరి పోయిందన్న సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం: కల్వకుర్తి నాగర్‌కర్నూల్ జిల్లా
‘ఈ’- ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
టెండర్ నోటీసు నం. E1/పెయింటింగ్/W-1/GF/2025-26/001, తేదీ. 23.05.2025
కల్వకుర్తి మునిసిపాలిటీలో జనరల్ ఫండ్ కింద (1) పనులకు ‘ఈ’సేకరణ ప్లాట్ ఫాంలో టెండర్లు పిలవబడినవి. 1. అంచనా విలువ: రూ. 3.50 లక్షలు, 2. పని పేరు: జనరల్ ఫండ్ 2025-26 కింద కల్వకుర్తి మునిసిపాలిటీలోని మున్సిపల్ కార్యాలయ భవనానికి నిర్వహణ మరియు పెయింటింగ్; 3. బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం: 24.05.2025 @ ఉదయం 11 గం.లకు; 4. బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం: 26.05.2025 @ మధ్యాహ్నం 4.30 గం.లకు మరిన్ని వివరాలను ‘ఈ’-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు అంటే ‘www.eprocurement.gov.in బిడ్డను ఆహ్వానించే అధికారి కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నెం. 9110540243, 7331109838.
DIPR R.O.No: 2386-PP/CL/ADVT/1/2025-26 Date: 23-05-2025 Sd/- కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, మే 24


# అకాల వర్షాలు – అపారనష్టం

వాతావరణ పరిస్థితులు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఎండలు మండే మే నెల లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు దంచికొట్టాయి. గాలులు వీచాయి. పగలు ఎండ – రాత్రి చల్లదనం, కొన్ని రోజులు ఉక్కపోత. ప్రధానంగా మెదక్, సూర్యాపేట, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో వరి రైతులకు అపారమైన నష్టం సంభవించింది. ఇందుకు వికటించిన ప్రకృతితోపాటు, ధాన్యసేకరణలో ప్రభుత్వ వైఫల్యాలు కారణం. పంట చేలల్లో నిలువుమీద ఉండగా, పంట కళ్లాల్లో ఉండగా చెదురుమదురుగా కురిసే అకాల వర్షాలకు నష్టపోవటం రైతు వ్యవసాయ జీవితంలో సర్వసాధారణం. కాని కోతలన్నీ అయిపోయి కొనుగోలు కేంద్రాలకు చేరినాక వారం – పది రోజులు కొనుగోలు జరగక పోవటం, ఇంతలో వర్షాలు కురిసి ధాన్యం కొట్టుకుపోవటం, తడిసిపోవటం, కాపాడుకు నేందుకు తగినన్ని టార్పాలిన్‌లు లేకపోవటం దారుణం. అవసరమైనంతగా హమాలీలు లభ్యంకాకపోవటం, రవాణాకు లారీలు దొరక్కపోవటం, మిల్లుకు చేరినాక వారు వెంటనే గోతాలు దించుకుని గోదాముకు చేర్చకపోవటం ఇత్యాది – ఒక్కోచోట ఒక అవాంతరం.

వర్షానికి తడిసిన ధాన్యం కొనటానికి అధికారులు తిరస్కరిస్తున్నారని మెదక్ జిల్లా రంగంపేట రైతులు గురువారం రాస్తారోకో చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో రైతు సేవా సహకార సంఘం నిర్వహిస్తున్న ధాన్య సేకరణ కేంద్రం వద్ద ఉప్పుల వెంకన్న అనే రైతు పెట్రోలు పోసుకుని ఆత్మహనన ప్రయత్నం చేయగా, తోటి రైతులు జోక్యం చేసుకుని అతన్ని కాపాడారు. ఆ రైతు 15వ తేదీన తెచ్చిన 150 బస్తాల ధాన్యాన్ని బుధవారం సాయంత్రం వరకు తూకం వేయలేదట! రవాణాలో తలెత్తిన జాప్యాలు కారణమని వివరించిన పౌరసరఫరాల అధికారి, తడిసిన ధాన్యం కూడా కొంటామని రైతులకు ఊరట చేకూర్చారు. అనేక కొనుగోలు కేంద్రాలవద్ద రైతులు కనీసం మూడు రోజులు పడిగాపులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లాల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి తుంగతుర్తి, అరవపల్లి, తిర్మల్‌గిరి, నాగారం మండలాల్లోని ఐకెపి కేంద్రాల్లో నిల్వచేసిన దాదాపు 5వేల క్వింటాళ్ల ధాన్యం నీటమునిగింది. జనగామ జిల్లాలో కూడా ధాన్యం కొనుగోలు నెమ్మదిగా సాగుతోంది. 1,85,000 టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా ఇంకా పూర్తికాలేదు. కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి మార్కెట్‌లో వర్షాలకు ధాన్యం దెబ్బతింది. ధాన్యం కొనుగోలుకు తాము 20రోజులుగా ఎదురు చూస్తున్నామని పలువురు రైతులు వాపోయారు. సిద్దిపేటలో వరిధాన్యం నాల్గవసారి నీళ్లలో నానింది. తోగుట, రామాయంపేట, తూప్రాన్ ప్రాంతాల్లో కూడా ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల ధాన్యం పూర్తిగా నీటిప్రవాహంలో కొట్టుకుపోయింది. ఇవి రైతుల దుర్భర అవస్థలకు, మనస్తాపానికీ కొన్ని ఉదాహరణలు. అంతకుముందు ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా ఇటువంటి అవస్థలే ఎదురైనాయి.

రైతులు ఆందోళన చెందవద్దు, తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతుధరకు కొనుగోలు చేస్తామని మంత్రులు రైతులకు భరోసా ఇస్తున్నా, ఆచరణలో తరుగుతీయటం వంటి సమస్యలు తప్పటం లేదు. అంచనాలకు మించి వరి దిగుబడి కూడా ఈ సమస్యకు కారణమనవచ్చు. బిఆర్‌ఎస్ వారి విమర్శలకు జవాబుగా ఇరిగేషన్, పౌరసరఫరాలమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన సమాధానం దీన్ని సూచిస్తోంది. 2022–23లో రబీ పంట కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం సేకరించిన వరి ధాన్యం 36.63 లక్షల మెట్రిక్ టన్నులు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరం (2024–25 సీజన్)మే 22 వరకు కొనుగోలు చేసిన ధాన్యం 60.61 లక్షల మెట్రిక్ టన్నులు. అంతకుముందు ఖరీఫ్ సీజన్‌లో కూడా ధాన్యం ఇబ్బడిముబ్బడిగా పండింది. ప్రభుత్వం చివరి గింజవరకు కొంటుందని చెబుతూ, వర్షానికి తడిసిన, తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. వరిధాన్యం ఉత్పత్తిలో నెం.1 స్థానానికి చేరామని సంబరపడే ప్రభుత్వం రైతుల ఇబ్బందులను తొలగించినపుడే రైతు కంట, ఇంట సంతృప్తి, సంతోషం.

# పాఠ్యపుస్తకాలనుంచి చరిత్ర కత్తిరింపు


రాం పునియాని

నూతన విద్యావిధానం–2020 క్రమం గా అమలులోకి తెస్తున్నారు. మిగతా విషయాలతోపాటు అది భారతీయ జ్ఞాన వ్యవస్థలు, భారతీయ సంప్రదాయాలపై దృష్టి కేంద్రీకరించింది. చరిత్ర కు సంబంధించి చేసిన మార్పుల్లో ఢిల్లీ సుల్తానేట్, మొగలాయీల పాలనను పుస్తకాలనుంచి తొలగించారు. దాదాపు 700 సంవత్సరాల చరిత్ర కనుమరుగు చేయబడింది. ఏ ప్రమాణంతో చూసినా ఇది చాలా సుదీర్ఘకాలం. ఎన్‌సిఇఆర్‌టి ఇంతకుముందే మొగలాయీలు, ఢిల్లీ సుల్తానులపై పాఠ్యాంశాలను కుదించింది. కోవిడ్–19 మహమ్మారి కాలంలో 2022–23లో సిలబస్ తగ్గింపులో భాగంగా అది తుగ్లక్‌లు, ఖిల్జీలు, మాంలుక్‌లు, లోడీలు వంటి రాచరికాల వివరాలను, మొగల్ చక్రవర్తుల సాఫల్యాలకు సంబంధించి రెండు పేజీల పట్టిక అందులో ఉన్నాయి. ఇప్పుడు కొత్తపుస్తకం వారికి సంబంధించిన ప్రస్తావనలన్నింటినీ తొలగించింది.

7వ తరగతి పాఠ్యపుస్తకం నుంచి ఢిల్లీ సుల్తానేట్, మొగల్ పాలకుల ప్రస్తావనలన్నీ తొలగించబడినాయి. ఇతర పుస్తకాలకు సంబంధించి ముస్లిం పరిపాలన ప్రస్తావనలు ఎక్కడవున్నా అవి తొలగించబడినట్లు పరిగణించబడతాయి. తొలగించబడిన వాటిలో ముంబై హింస (92–93) అనంతర, గుజరాత్ హింస (2002) అనంతర ప్రస్తావనలు, అలాగే నాథురాం గాడ్సె ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ అన్న ప్రస్తావన, గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం ప్రస్తావన తదితరాలున్నాయి. కుంభమేళాకు స్థానం లభించింది, ఆ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో అనేకమంది మరణించటం, అలాగే ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట ప్రస్తావనలేదు.

ఇదంతా కోవిడ్ కాలంలో మొదలైంది. విద్యార్థులపై భారం తగ్గించటం సాకుగా చెప్పారు. సిలబస్ ‘క్రమబద్ధీకరణ’ అన్నారు. హిందూ జాతీయవాద భావజాలానికి ఇబ్బందికరంగా ఉన్న ఈ భాగాలన్నిటినీ తొలగించారు.

ముస్లింలను రాక్షసులుగా చూపేందుకు, వారిపై ద్వేషం వ్యాప్తి చేసేందుకుగాను మొగలాయీలను మన చరిత్రలో విలన్‌లుగా చూపారు. అల్లావుద్దీన్ ఖిల్జీ లాంటి కొందరు అంతకు పూర్వ రాజులు కూడా హిందూత్వ కథనంలో కత్తెరకు గురైనారు. ముస్లిం రాజులను రాక్షసులుగా చిత్రించటమన్నది ఇంతవరకు దేవాలయాల ధ్వంసం చుట్టూ అల్లికతో ఉండేది. హేతువాద చరిత్రకారులు దాన్ని ఖండించారు. ముస్లిం రాజులు తమ కత్తిని ఉపయోగించి ఇస్లాంను వ్యాప్తి చేశారన్నది ఈ కథనానికి మరో స్తంభం. ఇస్లాంలోకి మతమార్పిడి ఆరంభంలో ముస్లిం అరబ్ వ్యాపారులతో సంబంధాలవల్ల జరిగినందున ఈ అంశం పూర్తిగా అసత్యం. అటుతర్వాత, కుల వ్యవస్థ నిరంకుశత్వాన్ని తప్పించుకోవటానికి దిగువస్థాయి కులాలనేకం ఇస్లాంను ఆలింగనం చేసుకున్నాయి.

హిందూత్వ భావజాలం ఈ కాలాన్ని చీకటికాలంగా, హిందువులకు వ్యతిరేకంగా నరమేధం జరిగిన కాలంగా చిత్రించేంతదూరం వెళ్లింది. రాచరికాల పరిపాలనకాలం రాజకీయ కారణాలతో ఎడతెగని యుద్ధాలు జరిగిన కాలం. తమ రాజ్యాలు విస్తరించాలని రాజులెప్పుడూ కోరుకున్నారు, ఆ క్రమంలో అనేకమంది హతులైనారు. దాన్ని నరమేధం అని పిలవటం పూర్తిగా సత్యదూరం. బ్రిటిష్‌వారు ‘విభజించు–పాలించు’ విధానం అమలు చేసేందుకు ప్రవేశపెట్టిన మతతత్వ చరిత్ర రచన నుండి హిందూత్వ వాదుల కథనం ఆరంభమైంది. ఇందులో రాజుల ఉద్దేశాలన్నీ మతంతో ముడిపెట్టబడినాయి, రాజులు మొత్తం మత సమాజానికి ప్రతీకగా చిత్రించబడ్డారు.

హిందూ మతతత్వ చరిత్ర రచన ముస్లింలు, క్రైస్తవులను, హిందువులను హింసలుపెట్టిన ‘విదేశీయులు’గా చిత్రిస్తూ మరికొంత ముందుకెళ్లింది. ముస్లిం మతతత్వ చరిత్ర రచన ఒకే నాణేనికి రెండో పార్శ్వంగా ముస్లింలను పాలకులుగా, హిందువులను వారికి సేవచేసే పౌరులుగా చిత్రించింది. ముస్లింలు తార్కికంగా ఈ దేశానికి పాలకులు అని వారు చిత్రించారు.

ఈ తర్కాన్ని ముందుకు తీసుకెళ్లటం మన ఉమ్మడి దేశాన్ని భారత్, పాకిస్థాన్‌గా విభజించేందుకు బ్రిటిష్‌వారికి సహాయపడింది. ఈ దేశంలో రెండు జాతులున్నాయని సావర్కార్ వ్యక్తీకరించారు. జిన్నా ముస్లింలకు ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ముందుకెళ్లారు. పాకిస్థాన్ దాని ఆవిర్భావం నుంచీ ముస్లిం మతోన్మాదం ఉచ్చులో పడింది. 8వ శతాబ్దంలో మొహమ్మద్ బిన్ కాశింతో పాకిస్థాన్ ఆరంభమైనట్లు వారి పాఠ్యపుస్తకాలు పేర్కొన్నాయి. ఇవాళ వారి పాఠ్యపుస్తకాలు హిందూ పాలకుల ప్రస్తావనను పూర్తిగా తొలగించాయి. హిందూ రాజు లు, సంస్కృతి ప్రస్తావనలన్నింటి తొలగింపులో హిందువులకు వ్యతిరేకం గా ముస్లిం మతోన్మాదం వ్యాప్తి చేసిన ద్వేషం శిఖరాగ్రాన్ని చేరింది.

భారతదేశం గత మూడు దశాబ్దాల్లో ఒక విధంగా పాకిస్థాన్ అడుగుజాడల్లో నడుస్తున్నది. పాకిస్థాన్ ప్రయాణం తీరు ప్రతిబింబాన్ని చివరి కామా వరకు బహుశా అనుసరిస్తున్నారు. పాకిస్థాన్ రచయిత్రి పహమిదా రియాజ్ ఈ అంశాన్ని ఎత్తిచూపారు. బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత ఆమె ఇలా రాశారు: “అరె! మీరు కూడా మాలాగా మారారా! ఇప్పటిదాకా ఎక్కడ దాక్కున్నారు?”

భారతదేశ విద్యపై హిందూత్వ భావజాలం పూర్తి నియంత్రణ సాధించకమునుపు, ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు వివిధ పద్ధతుల్లో సమాజ మత స్వరూపం వ్యాప్తి చేస్తుండేవి. శాఖబౌద్ధీలు, ఏకల్ విద్యాలయాలు, శిశుమందిర్ వంటివి వాటిలో ఉన్నాయి. కాలక్రమంలో ప్రధాన స్రవంతి మీడియా, సోషల్ మీడియా దాని సేవలోకి వచ్చాయి.

ఆ విధంగా, సంస్కృతి అనేది నిరంతరాయంగా రూపుదిద్దుకునే క్రమం. చరిత్ర క్రమంలో చాలామార్పులు సంభవించాయి. వాస్తుకళలోనే కాకుండా ఆహారపు అలవాట్లు, దుస్తులు, సాహిత్యం, మతరంగంలో సమ్మిళితం, గొప్ప భక్తి, సూఫీ సంప్రదాయాలు వృద్ధి చెందాయి. ఈ కాలంలోనే సిక్కుమతం ఆవిర్భవించింది, వికసించింది.

ఈ రాజకీయ భావజాలం ఇప్పుడు దాని మార్గాన్ని మార్చుకోవలసి ఉంటుంది. ముస్లిం పాలకులు లేనందున వారిప్పుడు ముస్లింలను రాక్షసులుగా ఎలా చిత్రించగలరు? ఔరంగజేబు లేదా బాబర్ ఇప్పుడు లేరు కాబట్టి కొత్త టెక్నిక్‌లు ఊహిస్తూ ఉండవచ్చు.

జాతీయవాద భావనకు చరిత్ర చాలా కీలకం. ‘జాతీయవాదులకు చరిత్ర నల్లమందుకు అలవాటుపడినవారికి నల్లమందు మొక్క లభించటం లాంటిది’ అన్నారు ఎరిచ్ ఫ్రోమ్. బిజెపి 1998లో ఎన్‌డిఎగా అధికారంలోకి వచ్చాక వారు చేసిన పెద్దపని ‘విద్య కాషాయీకరణ’. ఇక్కడ ముస్లిం రాజులను దుష్టులుగా, దుందుడుకు వాదులుగా, హిందూ రాజులను ఉజ్వలంగా, సాహసోపేతులుగా చిత్రించారు. వామపక్ష చరిత్రకారులు ఇంతవరకు చరిత్ర రచించారని, వారు ఢిల్లీ పాలకులపైన, ముస్లిం అనుకూలురుపైన దృష్టిపెట్టారని ఆరోపించారు. రాచరిక సామ్రాజ్యాలు చరిత్రలో ఎంతకాలం పరిపాలించాయన్న దాన్నిబట్టి పాఠ్యపుస్తకాల్లో వివరాలు పొందుపరచబడతాయి.

1980వ దశకంలో వచ్చిన పాఠ్యపుస్తకాల్లో హిందూ, అలాగే ముస్లిం రాజులగూర్చి మంచి సమాచారమే ఉంది. కథనం కేవలం మతం చుట్టూ తిరగలేదు. జన సమూహాల గూర్చిన సమగ్ర దృక్పథం – అనగా వాణిజ్యం, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలు పొందుపరచబడ్డాయి.

అయితే మన భవిష్యత్‌ను నిర్మించుకోవటానికి ‘రాజు కేంద్రకంగా ఉన్న చరిత్ర’ మనకు అవసరం లేదు. అటువంటి కథనాల్లో స్థానం లభించని విభిన్నమైన సామాజిక విభాగాలపై – అనగా దళితులు, మహిళలు, ఆదివాసీలు, చేతివృత్తులవారిపై మనం కేంద్రీకరించాలి.

(ఐపిఎ సర్వీస్)

# సంపూర్ణఅక్షరాస్యత.. మిజోరం ఆదర్శం

సామాజిక అభివృద్ధికి అక్షరాస్యత మూలస్తంభం. అభివృద్ధి చెందాలనుకున్న ప్రతి రాజ్యం, దేశం తమ అక్షరాస్యత స్థాయిని మెరుగుపరచుకునే దిశగా నిరంతరం కృషి చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఇటీవల మిజోరం రాష్ట్రం దేశంలో సంపూర్ణ అక్షరాస్యతను (95%) సాధించినట్టు అధికారికంగా ప్రకటించు కోవడం అభినందనీయమైన ఘట్టం. 1991 నుంచి త్రిపుర, కేరళ వంటి రాష్ట్రాలు అక్షరాస్యత పరంగా అగ్రగాములుగా నిలుస్తున్న సమయంలో, ఈ విజయంతో మిజోరం భారత దేశంలో అక్షరాస్యత రంగంలో మరో మార్గదర్శక రాష్ట్రంగా నిలిచింది. ఇక్కడ ఆశ్చర్యకరమైనది ఏమిటంటే, మిజోరం ఒక చిన్న, పర్వత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న, దూర ప్రాంతాల్లో గ్రామాలు కలిగిన రాష్ట్రం. పైగా సాంకేతిక వనరులు, లాజిస్టిక్ సదుపాయాలు పరిమితంగా ఉండటం వల్ల అక్కడ విద్యా విస్తరణ అనేది సాధారణంగా కష్టం అనిపించే విషయం. అయినప్పటికీ, మిజోరం ఈ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేయగలగడం వెనుక కారణాలను విశ్లేషించడం అవసరం. ముఖ్యంగా, అక్షరాస్యతశాతం ఇంకా మెరుగుపరచుకోలేని తెలంగాణకిది కీలక పాఠం.

**మిజోరం విజయ రహస్యం:**

ఆదికాలం నుంచే విద్యాపట్ల చైతన్యం ఈ ప్రాంతంలో ఉన్నది. మిజోరంలో క్రైస్తవ మిషనరీల ప్రభావం ఉండటంతో, అనేక దశాబ్దాల క్రితమే విద్యకు ప్రాధాన్యత నిచ్చే సంస్కృతి ఏర్పడింది. ప్రజలలో చదువు గురించి చైతన్యం ఏర్పడినది. స్థానిక పాలనా సంస్థల చురుకు దనంతో గ్రామ స్థాయిలో విద్యా సంస్థలు, బాలబాలికల పాఠశాలల నిర్వహణలో గ్రామస్థాయి పాలనా వ్యవస్థలు ముఖ్యపాత్ర పోషించాయి. ప్రజాప్రతి నిధు లు, కమ్యూనిటీ నాయకులు విద్యాపట్ల అవగాహన కలిగించడంలో భాగమయ్యారు. ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలుప్రాథమిక స్థాయిలోనే కాకుండా, హైస్కూల్ స్థాయి వరకు విద్యా సామగ్రి ఉచితంగా అందించడం వల్ల పేద కుటుంబాల పిల్లలు కూడా చదువుపై ఆసక్తి చూపగలిగారు. క్రమబద్ధమైన సామాజిక ప్రచారాలు, అక్షరాస్యత పై ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, ప్రజలలో విద్యపై అవగాహన కలిగించే విధంగా సంఘాలు, సంస్థలు పని చేశాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, రాష్ట్రం 91.33శాతం అక్షరాస్యత రేటును కలిగి, దేశంలో మూడవస్థానంలో ఉంది. ఈ పునాదిపై, మిగిలిన నిరక్షరాస్యులైన వ్యక్తులను గుర్తించి వారికి విద్యను అందించడానికి ULLAS మరియు నవభారత సాక్షరత కార్యక్రమాలను అమలు చేసారు. 2011జనాభా లెక్కల డేటా ఆధారంగా, సర్వేలు నిర్వహించబడ్డాయి మరియు 3,026మంది నిరక్షరాస్యుల ను గుర్తించి వారిలో1,692 మంది సంభావ్య అభ్యాస కులుగా గుర్తించారు. విద్యార్థు లు, విద్యావేత్తలు, రిసోర్స్ పర్సన్లను మరియు క్లస్టర్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్లు సహా మొత్తం 292మంది స్వచ్ఛంధ ఉపాధ్యాయులు ఈ మిషన్‌కు నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చారు. సమిష్టి కృషి, అంకితభావం మరియు సమాజ సమీకరణ ఫలితంగా మిజోరం పూర్తి అక్షరాస్యత సాధించింది.

**తెలంగాణలో పరిస్థితి**

తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడిన కొత్త రాష్ట్రంగా, అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోంది. తెలంగాణలో అక్షరాస్యత శాతం సుమారు 66.54% కాగా, ఇది జాతీయ సగటుతో పోలిస్తే తక్కువ. ఇది రాష్ట్రానికి మిగిలిన పథకాల విజయాన్ని మసక బార్చే అంశం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత స్థాయిలో మరింత మెరుగుదల అవసరం ఉంది.

**అక్షరాస్యత పెంచేందుకు చేయాల్సిన కార్యక్రమాలు:**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలి. పల్లెపల్లెకు అక్షరాస్యత చొచ్చుకుపోవాలంటే అక్కడ ప్రత్యేకంగా అక్షరాస్యత కేంద్రాలు, మొబైల్ లైబ్రరీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.నిరక్షరాస్యులు అయిన వయోజనులకు అక్షరాస్యతను పరిచయం చెయ్యాలి. ప్రాథమిక అక్షరాసత ప్రమాణాన్ని సాధించని వారికి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కారు అనే నియ మాలు పెట్టి ప్రజలను చదవడంపట్ల ప్రోత్సహిం చాలి. పెద్దల అక్షరాసత కార్యక్రమాలు శ్రద్ధగా కొనసాగించాలి. స్కూళ్ళకి వెళ్లని పెద్దలకు ప్రత్యేకంగా అక్షరాస్యత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. వీటిని గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో నిర్వహిం చాలి. బాలికల విద్యపై దృష్టి కేంద్రీకరించాలి. బాలికల పాఠశాలల సంఖ్యను పెంచాలి, రవాణా సౌకర్యాలను మెరుగుపర్చాలి. ఎందు కంటే అక్షరాస్యతలేని మహిళలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలోనే ఉంటారు. బహుళ భాషా విధానం విద్యా కార్యక్రమాలను కొనసాగించాలి. కొన్ని ప్రాంతాలలో స్థానిక భాషలలో విద్యా సామగ్రి అందుబాటులో లేకపోవడం వల్ల విద్యాపట్ల ఆసక్తితగ్గి పోతుంది. ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో గిరిజన భాష ల్లో పాఠ్య పుస్తకాలు అందించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో వయోజన విద్యపెంపుపై సరియగు నిధులు కేటాయించాలి. సాంకేతిక వనరుల వినియోగంనుపెంచి, డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ, మొబైల్ యాప్‌లు, రేడియో పాఠా లు, టీవీపై ప్రసారమయ్యే విద్యా కార్యక్రమాలను విస్తృ తంగా వినియోగించాలి. సామాజిక ఉద్యమంగా అక్షరాస్యత రేటు పెంచటం జరగాలి. ఇదిసామాజిక ఉద్యమంగా రూపొందించాలి. స్వచ్ఛ భారత్ లేదా పోలియో నిర్మూలన కార్య క్రమాల్లాగే అక్షరాస్యత సాధనలో కూడా సామాజిక భాగస్వామ్యం కీలకం.

కమలహాసన్ తుమ్మ
జీవశాస్త్ర నిపుణుడు
గౌతం మోడల్ స్కూల్స్, హైదరాబాద్
9505618252

## సిపిఐ మణిపూర్ రాష్ట్ర యూనిట్ మహాసభ

# విచ్ఛిన్న శక్తులపై పోరాటం కొనసాగింపునకు ప్రతిన

భారత కమ్యూనిస్టు పార్టీ మణిపూర్ రాష్ట్ర సమితి 24న మహాసభ మే 16–18 తేదీల్లో ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చలోవ్, లాంబాయ్‌లో ఇవావత్ స్మారక మందిరంలో జరిగింది. వచ్చే సెప్టెంబర్‌లో (21–25 తేదీలు) చండీగఢ్‌లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 25వ పార్టీ కాంగ్రెస్ సన్నాహకంగా మహాసభ జరిగింది. ఇక వరుసబెట్టి అన్ని రాష్ట్రాల్లో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభల ప్రారంభ సంకేతం ఈ మహాసభ. జాతివైషమ్యాలతో, హింసతో సంవత్సరం పైబడి కల్లోలంగా ఉన్న రాష్ట్రంలో కమ్యూనిస్టు శ్రేణుల నిబద్ధతను, స్థిర సంకల్పాన్ని ఈ మహాసభ వ్యక్తీకరించింది. సిపిఐ జాతీయ సమతి కార్యదర్శి పల్లబ్‌సేన్ గుప్తా మే, 16న మహాసభను ప్రారంభించారు. ప్రతినిధులు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో హాజరైనారు. రాష్ట్ర పార్టీ మాజీ కార్యదర్శి, రాష్ట్ర పార్టీ కంట్రోలు కమిషన్ చైర్మన్ లాంగో ఇబోయైమా, కేంద్ర కంట్రోలు కమిషన్ సభ్యుడు నారాసింగ్, రాష్ట్ర కార్యదర్శి లీసాగ్‌థం థోయిరన్ కూడా ప్రసంగించారు. వక్తలందరూ దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని, ముఖ్యంగా మణిపూర్‌లోని సంక్లిష్టమైన కల్లోల పరిస్థితిని ప్రధానంగా వ్యక్తీకరించారు. కేంద్రంలోని అలాగే రాష్ట్రంలోని ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముమ్మరం చేయాలని పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు వారు విజ్ఞప్తి చేశారు. జాతి వైషమ్యాలు రెచ్చగొడుతున్న బిజెపి విభజనవాద ఎత్తుగడలను వారు ఎండగట్టారు. ఈ ఎత్తుగడలు ప్రజలకు విపరీతమైన బాధలు, ప్రాణనష్టం కలిగించడమే గాక, మణిపూర్ ఐక్యత, భౌగోళిక సమగ్రతకు తీవ్రమైన ముప్పు తెస్తున్నది. ప్రజాస్వామ్యం, శాంతి, సామాజిక న్యాయం కాపాడుకోవలసిన అవసరాన్ని వక్తలు ఖండించారు.




అనంతరం ప్రతినిధుల సమావేశంలో రాష్ట్రసమితి కార్యదర్శి థోయిరన్ రాజకీయ నివేదిక, సహాయ కార్యదర్శి జయ కుమార్ నిర్మాణ నివేదిక ప్రవేశపెట్టారు. రాజకీయ నివేదిక మణిపూర్ ఎదుర్కొంటున్న బహుముఖ సమస్యలను, వాటిని పరిష్కరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని, “మణిపూర్‌ను కాపాడుదాం–మానవాళిని కాపాడుదాం” నినాదంతో సంవత్సరంపాటు పార్టీ సాగించిన కార్యక్రమాన్ని వివరించింది. ప్రస్తుత సంక్షోభానికి రాజకీయ పరిష్కారాన్ని డిమాండ్ చేసింది. మరుసటి రోజు 17న నివేదికలపై చర్చలో 40మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. విలువైన సూచనలు చేశారు. కొన్ని సవరణలతో రెండు నివేదికలు ఆమోదించబడినాయి. ఆరోజు సాయంత్రం సమావేశంలో సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ప్రసంగించారు. మతోన్మాద శక్తులకు, ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన మణిపూర్ ప్రజల, కమ్యూనిస్టుల ధైర్యసాహసాలను ఆయన ప్రశంసించారు. సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజంలను రక్షించుకోవటంలో పార్టీ సూత్రబద్ధ వైఖరిని పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో ప్రజల మధ్య విభజనను పెంచటంలో బిజెపి విధానాలను రాజా ఖండించారు. నిరంకుశ పెత్తందారీతనాన్ని, మతోన్మాదాన్ని ప్రతిఘటించేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులందరి మధ్య విస్తృత ఐక్యతకు విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో పార్టీకి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు నిర్మాణరీత్యా పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరాన్ని వక్కాణించారు.

రాష్ట్ర పార్టీ కొత్త కార్యదర్శిగా అథోక్‌పం నబచంద్రను, సహాయ కార్యదర్శులుగా నంగ్‌తోంచం సిన్హజిత్‌సింగ్, ఎస్.సరోజనీదేవిలను మహాసభ ఎన్నుకుంది. 13మందితో కార్యవర్గాన్ని, 35మందితో రాష్ట్రసమితిని, ఐదుగురితో కంట్రోలు కమిషన్‌ను ఎన్నుకుంది. ప్రజాసమస్యలపై సెప్టెంబర్ 29న రాష్ట్రస్థాయి పెద్ద ర్యాలీ నిర్వహించాలని రాష్ట్ర మహాసభ నిర్ణయించింది.

# అమెరికాలో ‘తెలుగు సంబరాలు’!

ప్రతి ప్రాణి తన ఉనికిని చాటుకోవడం సహజం. ఇంకా ప్రకృతిని, సృష్టిని విశ్వవ్యాప్తంగా విస్తరింపచేస్తున్న మనుషులు తమ ఉనికిని చాటుకోవడం అతిశయోక్తి కాదు. అమెరికాలో కూడా మా తెలుగు తల్లికి మల్లెపూదండ స్ఫూర్తితో తెలుగు సంఘాలు పని చేస్తున్నవి.“యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా” (యుఎస్‌ఎ)50 రాష్ట్రాలతో విరాజిల్లుతుంది. అందులో న్యూ జెర్సీ, డెలావేర్, వర్జీనియా, కనెక్టికట్, ఇల్లినాయిస్, టెక్సాస్, కాలిఫోర్నియా, మేరీల్యాండ్, జార్జియా, న్యూహాంప్షైర్, వాషింగ్టన్, మసాచుసెట్స్, కాన్సాస్, మిచిగాన్, మిన్నెసోటా, ఉత్తరకరోలినా, అరిజోనా, పెన్సిల్వేనియా, ఒహియో, రాష్ట్రాలలో తెలుగు అమెరికన్స్ నివసిస్తున్నారు. 2024 లెక్కల ప్రకారంగా దాదాపు 12.3 లక్షల మంది తెలుగు ప్రజలు ఉంటున్నారు. అమెరికాలో విదేశీ భాషలు మాట్లాడే ప్రజలలో తెలుగు మాట్లాడే ప్రజలు 11వ స్థానంలో, భారతీయ భాషలు మాట్లాడే ప్రజలలో తెలుగు మాట్లాడే ప్రజలు 3వ స్థానంలో ఉన్నారు. తెలుగు అమెరికన్స్‌కు “స్టెమ్”లో నిష్ణాతులన్న పేరుంది. 2001లో STEM/స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)ను “నేషనల్ సైన్స్ ఫౌండేషన్” రూపొందించింది. సైన్స్ విభాగంలో పరిశీలన లు, ప్రయోగాలు, సిద్ధాంతాల అభివృద్ధి ప్రాతిపదికన సహజ ప్రపంచాన్ని అధ్యయనం చేస్తారు. టెక్నాలజీ/సాంకేతికత విభాగంలో ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికి మరియు సాధనాలను, వ్యవస్థలను రూపొందించి శాస్త్రీయ జ్ఞానాన్ని, నైపుణ్యాలను వెలికితీస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో నిర్మాణాలను, యంత్రాలను, వ్యవస్థలను రూపొందించడం మరియు కార్యాచరణను శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే ప్రక్రియను వేగవంతం చేస్తారు. గణితం విభాగంలో సంఖ్యల, ఆకారాల సంబంధాలను అధ్యయనం చేసి శాస్త్రీయ, సాంకేతిక విభాగాల పునాదిని పటిష్టం చేస్తూ విస్తరింపచేస్తారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగువారు తెలుగు సంఘాలను పెట్టుకుని పండుగల సమయంలో కలుస్తారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా), ఉత్తర అమెరికా తెలుగు సంఘం, అమెరికన్ తెలుగు అసోసియేషన్, గ్రేటర్ అటాంట తెలుగు అసోసియేషన్, బే ఏరియా తెలుగు అసోసియేషన్, చికాగో తెలుగు సంఘం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, గ్రేటర్ ఇండియానాపోలీస్ తెలుగు అసోసియేషన్, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సొసైటీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ దెలావేర్ వ్యాలీ, సెంట్రల్ బోవా తెలుగు అసోసియేషన్, డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్, మాడిసన్ ఏరియా తెలుగు అసోసియేషన్, హారీస్‌బర్గ్ తెలుగు సంఘం, త్రిరాష్ట్ర తెలుగు సంఘం, తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ (టీనా), తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెయింట్ లూయిస్(టాస్) ఇంకా ప్రాంతీయంగా కూడా సంఘాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు 13,811 కిలోమీటర్ల దూరంలో సెయింట్ లూయిస్ పట్టణం ఉంటుంది. దీనికి అమెరికాలో 23వ అతి పెద్ద పట్టణంగా పేరుంది. తూర్పు సెంట్ లూయిస్ మెట్రోపాలిటన్ ఇల్లినాయిస్ రాష్ట్రంలో ఉంది. కాని మిగతా 23 చదరపు మైళ్ల పట్టణం అంతా మిస్సోరి రాష్ట్రంలోని మిసిసిపి నదికి పశ్చిమ ఒడ్డున సెయింట్ లూయిస్ మహానగరం ఉంది. అందువలన మిస్సోరి స్టేట్‌గానే పరిగణించుచున్నారు.

తెలుగునాట ఆంధ్రప్రదేశ్‌ను నదుల రాష్ట్రంగా పిలుచుకుంటాము. సెయింట్ లూయిస్ ను కూడా రివర్స్ టౌన్‌గా పిలువడంలో అతిశయోక్తి లేదు. పరిసరాల్లో మూడు నదులు ప్రవహించుతాయి. ‘మెరామిక్ నది’ సెయింట్ లూయిస్‌లోని కాజిల్ వుడ్ పార్క్ సమీపం నుండి ప్రవహించి ఆర్నాల్డ్ మరియు ఓక్విల్లే వద్ద “మిసిసిపి నది”లో కలుస్తుంది. మిస్సోరి రాష్ట్రంకు తూర్పు సరిహద్దుగా పట్టణం దిగువ నుండి “మిస్సోరి నది” ప్రవహిస్తోంది. పట్టణం ఉత్తర భాగంగా “మిసిసిపి నది” ప్రవహిస్తుంది. దాదాపు 61.74 చదరపు మైళ్ల విస్తీర్ణంలో సెయింట్ లూయిస్ పట్టణం ఉంది. లోతులేని లోయలు, సారవంతమైన నేలలు, బొగ్గు, బంకమట్టి, సున్నపు రాయి, మిల్లరైట్ నిక్షేపాలు, ఐ.టి, సీడ్స్ కంపెనీలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, వ్యవసాయంతో ఉపాధి అవకాశాలకు కొంగు బంగారంగా విరాజిల్లుతుంది. మిసిసిపి నది ఒడ్డున 630 అడుగుల స్టెయిన్ లెస్ స్టీల్ గేట్ వే ఆర్చ్ ఉంది. దీనికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మానవ నిర్మిత స్మారక చిహ్నంగా పేరుంది.

1987లో ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు జంధ్యాల “పడమటి సంధ్యా రాగం” సినిమాను సెయింట్ లూయిస్ పట్టణంలోనే తీశాడు. ఇక్కడ విద్య, ఉపాధి అవకాశాల గురించి వచ్చే కొత్త వ్యక్తులను స్వాగతించే సంస్కృతి ఉంటుంది. నివసిస్తున్న తెలుగు జనాభా నిర్దిష్టంగా అందుబాటులో లేదు. కాని యుఎస్‌ఎ సెన్సస్ బ్యూరో 2021 లెక్కల ప్రకారంగా భారతీయుల జనాభా 17,842 మంది సెయింట్ లూయిస్‌లో నివసిస్తున్నారు. ఇక్కడి భారతీయులు ఐ.టి రంగంలో నిష్ణాతులని, నైపుణ్యులని “ఇంటర్ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సెయింట్ లూయిస్ ప్రెసిడెంట్ ‘ఆరే ఒబెన్సన్’ అన్నారు. ఇక్కడి తెలుగు ప్రజలు మాత్రం సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, సంస్కృతిని, పండుగలను కలిసి చేసుకుంటారు. అలాగే సంఘాలను స్థాపించుకుని ఉనికిని చాటుకుంటున్నారు.

1979లో “తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెయింట్ లూయిస్ (టాస్/TAS)ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది, సంక్రాంతి, దీపావళి పండుగలను పురస్కరించుకుని అందరికి సెలవులు ఉన్న రోజులలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుతారు. అలాగే కుటుంబాల వనభోజనాలను/ఫ్యామిలీ పిక్నిక్‌లను కూడా ఏర్పాటు చేస్తారు. వార్షిక సభ్యత్వ రుసుంగా కుటుంబానికి 125 డాలర్లు(ఒక డాలర్ విలువ రూ.85.44/రూ.10,680), జీవిత సభ్యత్వ రుసుంగా 1500 డాలర్లు, కుటుంబ అతిథులకు, తల్లిదండ్రులకు 150 డాలర్లు వసూలు చేస్తారు. పోయిన వీకెండ్ సెలవు మే 10న “గ్రీన్ స్టెప్యూయర్ రిక్రియేషన్” హాల్‌లో “తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు”ఘనంగా జరిగినవి. దాదాపు 200 మంది బాలికలు, 30 మంది బాలురు సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. దాదాపు 600 నుండి 800మంది అమెరికన్స్ తెలుగువారు పాల్గొన్నారు. అలాగే చీరెలు, బట్టలు, డ్రెస్‌లు, ఆభరణాల స్టాల్స్‌లో అమ్మకాలు కూడా జరిగినవి. అమెరికన్స్ సెయింట్ లూయిస్ పట్టణంలో జరిగిన తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన నాయనమ్మలు, అమ్మమ్మలు, తాతలు తెలుగు రాష్ట్రాల పండుగలను, సంస్కృతిని ప్రతిబింబించినట్లుగా ఉన్నాయని ముచ్చటించుకున్నారు. అలాగే బాలుర కంటే బాలికలు 150కి పైగా ఎక్కువ మంది సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆశ్చర్యం అయినప్పటికీ సంతోషం.

మేరుగు రాజయ్య,
9441440791.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేడు నీతి ఆయోగ్ పాలక మండలి భేటీ

**న్యూఢిల్లీ:** నీతి ఆయోగ్ పాలక మండలి 10వ సమావేశం ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం జరగనుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అభివృద్ధికి కార్యాచరణపై ఈ సమావేశం చర్చించనున్నట్లు ఓ సీని యర్ అధికారి శుక్రవారం తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అన్ని రా ష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో ప్రధాని మొదటిసారి భేటీ కానుండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. సమావేశంలో 2024–26 బడ్జెట్, ఆర్థిక సవాళ్లపై సమాలోచనలు జరగనున్నట్లు అధికారి వెల్లడించారు. అమెరికా సుంకాల క్రమంలో భారత్ ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.26.7 శాతం మధ్యలో ఉంటుందన్నది అంచనా. 202526లో 6.2 శాతం నుంచి 6.3 శాతం వరకు ఆర్థిక వృద్ధి భారత్‌లో నమోదవుతుందని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు అంచనా వేశాయి. కాగా, నీతి ఆయోగ్ పాలక మండలిలో సభ్యులుగా ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు ఉంటారు. చైర్మన్ బాధ్యతలను మోదీ నిర్వర్తిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన క్రమంలో పది రకాల విజన్‌లను సమ్మిళితం చేసి సముచిత పత్రం రూపొందించే బాధ్యతను నీతి ఆయోగ్‌కు 2023లో అప్పగించారు.

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

### నలుగురు మవోయిస్టులు మృతి

**గడ్చిరోలి:** మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీస్ స్పెషల్ కమాండో యూనిట్ సి–60, సీఆర్‌పిఎఫ్ సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కవండే ప్రాంతంలో ఇటీవల ప్రారంభించిన ఫార్వార్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్‌ఒబి) సమీపంలో మావోయిస్టులు ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా గురువారం మధ్యాహ్నం ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షం మధ్య దాదాపు 300 మంది సీ60 కమాండోలు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఆపరేషన్ నిర్వహించారని.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు కాల్పుల అనంతరం భద్రతాదళాలు గాలించగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనా స్థలంలో కొన్ని తుపాకులు, వాకీటాకీ, నక్సల్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.


ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఎదురుకాల్పులు.. ఛత్తీస్‌గఢ్‌లోని వరుసగా ఎదురుకాల్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సుక్మా జిల్లాలోని కిష్టారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు భద్రతా బలగాలకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో కిష్టారం అటవీ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు.. భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా ఎదురు కాల్పులు కొనసాగుతోన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఈ ఎన్‌కౌంటర్‌ను జిల్లా ఎస్‌పి కిరణ్ చవాన్ పర్యవేక్షిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు పలువురు కీలక నేతలు సైతం ఉన్నారు.

## బెట్టింగ్ యాప్‌ల నియంత్రణ పిల్‌పై...
# కేంద్రం స్పందన కోరిన 'సుప్రీం'

'ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన అంశం' అని నోటీస్ జారీ

ఆన్‌లైన్ యాప్‌లకు ప్రభావితమై పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని


పిటిషనర్ కెఎ.పాల్ ఆవేదన



**న్యూఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ముసుగులో ప్రజలు బెట్టింగ్, జూదం ఆడుతున్నారని, బెట్టింగ్ యాప్‌లను నియంత్రించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రం స్పందనను కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కెఎ.పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి నోటీస్ జారీ చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం యాప్‌లను ఉపయోగించిన తర్వాత అనేకమంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నారని ఆరోపిస్తూ కెఎ.పాల్ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.ఈ తరహా ఆన్‌లైన్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిలో యాక్టర్లు, క్రికెటర్లు ఉన్నారని, అందువల్లే పిల్లలు వాటికి ఆకర్షితులు అవుతున్నారని పిటిషన్‌దారు ఆరోపించారు. స్మోకింగ్ వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేసేందుకు బొమ్మలను,హెచ్చరికల వ్యాఖ్యలను సిగరెట్ ప్యాకెట్లపై ముద్రిస్తున్నారని, కానీ బెట్టింగ్ యాప్‌ల విషయంలో అలాంటి సంకేతాలు, హెచ్చరికలు ఏవీ కూడా లేవని పాల్ తన పిటిషన్‌లో చెప్పారు. ఐపిఎల్ కొనసాగుతున్న సమయంలో ఈ యాప్‌లను మాజీ ఇండియన్ టీమ్ క్రికెటర్లు కూడా ప్రమోట్ చేస్తున్నారని, అలాంటప్పుడు పిల్లలు ఎందుకు ఆకర్షితులు కారని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్మాసనం స్పందిస్తూ ఐపిఎల్ పేరుతో అనేకమంది ప్రజలు బెట్టింగ్, జూదంలో మునిగిపోతున్నారని ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని చెప్పింది. గత కొద్ది ఏళ్లుగా చనిపోతున్న పిల్లల తల్లిదండ్రులు ఎవరైతే ఉన్నారో వారు మిలియన్లలో వినతిపత్రాలు అందజేస్తున్నారని పాల్ వాదించారు. 'తెలంగాణ రాష్ట్రంలో 1,023మంది ప్రజలు మరణించారు. 25మంది బాలీవుడ్, టాలీవుడ్ యాక్టర్లు/ ఇన్‌ఫ్లూయర్స్ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడారు' అని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.వీటికి సంబంధించిన ఇన్‌ఫ్లూయర్లపై తెలంగాణ ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని పాల్ తెలిపారు. 'ఈ రోజుల్లో మనం మన పిల్లలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. వారు వారి పాఠశాలలకు కూడా తీసుకెళుతున్నారు. తల్లిదండ్రులు ఒక టీవీ చూస్తే, పిల్లలు మరొకటి చూస్తున్నారు. ఇది పూర్తిగా సామాజిక ఉల్లంఘన. మనం ఏమి చేయగలం?. ఈ బెట్టింగ్‌లో ప్రజలే స్వచ్ఛందంగా కూరుకుపోతున్నారు. ప్రత్యేకించి దీనిని నిలువరించేందుకు మేం మీతో ఉంటాం. ఈ తప్పుడు భావన కింద కేవలం మీరు మాత్రమే చట్టం ద్వారా నిలిపివేయగలరు' అని బెంచ్ చెప్పింది. జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ 'ప్రజలు హత్య చేయకుండా మనం ఆపలేం. చట్టం కూడా బెట్టింగ్ లేదా జూదంలో కూరుకుపోకుండా ప్రజలను ఆపలేదు' ధర్మాసనం స్పందిస్తూ కేంద్రం దీనిపై తన స్పందనను తెలియజేయాలని కోరింది. ఈ విషయమై అత్యున్నత న్యాయస్థానం అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ సహాయాన్ని కోరింది. అవసరమైతే దీనిపై అన్ని రాష్ట్రాల స్పందనను కూడా తెలియజేయాలని సూచించింది.

## పాక్‌కు గూఢచర్యం: మరో ఇద్దరి అరెస్ట్






**లక్నో:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నారన్న అనుమానంతో ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొంది. ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేసే మొహద్ హరూన్‌ను నోయిడాలో అదుపులోకి తీసుకొన్నారు. అతడికి పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలోని ముజమ్మల్ హుస్సేన్‌తో సంబంధాలున్నట్లు గుర్తించారు. ఇతడు వీసా కోసం డబ్బులు, ఇతర సున్నిత సమాచారం చేరవేయడంతోపాటు తీవ్రవాద భావజాల వ్యాప్తికి పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు. హరూన్‌కు పాక్ దౌత్య సిబ్బంది అయిన ముజమ్మల్‌తో మంచి సంబంధాలున్నాయని అధికారులు చెప్పారు. వారు నిత్యం మాట్లాడుకుంటున్నట్లు గుర్తించారు. హరూన్‌కు పాకిస్థాన్‌లో బంధుత్వాలు ఉండటంతో ముజమ్మల్ వీసాలు ఇప్పించినట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, హరూన్ పాక్ వీసాలు ఇప్పిస్తానంటూ కొంతమంది నుంచి డబ్బులు వసూలు చేసి వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గుర్తించారు. ఆ సొమ్ములో కొంత కమీషన్ తీసుకొని... ముజమ్మల్ చెప్పిన వ్యక్తులకు మిగిలిన మొత్తం ఇచ్చేవాడు. అతడు పాక్ దౌత్య కార్యాలయంలో పనిచేస్తున్నట్లు తెలిసినా... హరూన్ సహకరించాడని ఏటీఎస్ బందం తెలిపింది. దీంతో సున్నితమైన సమాచారం చేరవేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆదంపూర్, వారణాసిలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఏటీఎస్ బందం తుఫేల్ అనే మరో వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు దేశ వ్యతిరేక వాట్సాప్ గ్రూప్‌లో చేరినట్లు గుర్తించారు. దీనిని పాకిస్థాన్‌లోని సంస్థలు నిర్వహిస్తున్నాయి. దీంతో పాటు అతడు సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు అందించినట్లు గుర్తించారు. 'తుఫేల్ పాకిస్థాన్‌లోని వ్యక్తులు, సంస్థలతో సంబంధాలు నెరుపుతున్నాడు. పాక్‌లో నిషేధానికి గురైన తెహ్రీక్ ఎ లబ్బేక్ సంస్థ వ్యవస్థాపకుడు మౌలానా షాద్ రిజ్వీ వీడియోలను తరచూ షేర్ చేస్తున్నట్లు గుర్తించారు. గజ్వా ఎ హింద్‌కు సంబంధించిన కంటెంట్‌ను అతడు ప్రమోట్ చేస్తున్నాడు. భారత్‌లో షరియా చట్టం తీసుకురావడం వంటి అంశాలను ప్రచారం చేస్తున్నాడు. వారణాసిలోని రాజ్‌ఘాట్, నమోఘాట్, జ్ఞానవాపీ మసీదు, వారణాసి రైల్వే స్టేషన్, జామా మసీద్, ఎర్రకోట, నిజాముద్దీన్ ఫొటోలను పాక్ వ్యక్తులకు షేర్ చేశాడు' అని ఏటీఎస్ వెల్లడించింది. అతడికి పాకిస్థాన్‌లో దాదాపు 600 మందితో సంబంధాలు ఉన్నాయి. ఫైసలాబాద్‌లోని నఫీస అనే మహిళతో కూడా అతడు మాట్లాడుతున్నాడు. ఆమె భర్త పాక్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఈ రెండు కేసులపై వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈశాన్య భారతంలోని వైవిధ్యమే అతి పెద్ద బలం

''రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్''లో ప్రధాని



**న్యూఢిల్లీ :** ఒకప్పుడు ఈశాన్య ప్రాంతమంటే బాంబులు, తుపాకులు, రాస్తారోకోలకు పర్యాయపదంగా ఉండేదని, ఇప్పుడు అపూర్వమైన ప్రగతిని చూస్తున్నదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ అభివృద్ధిని మరింత వేగం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ''రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్''లో ప్రధాని ప్రసంగిస్తూ ఈశాన్య భారతంలోని వైవిధ్యమే అతి పెద్ద బలమని, ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు పెట్టుబడులు, నాయకత్వానికి సన్నద్ధతను ప్రకటిస్తున్నాయని అన్నారు. ఇందనం, సెమీ కండక్టర్‌లు అనే రెండు వ్యూహాత్మక రంగాలకు ఈశాన్య రాష్ట్రాలు కీలక గమ్యంగా ఎదుగుతున్నాయని చెప్పారు. అస్సోంలో భారతదేశ సెమీ కండక్టర్ ఈకో సిస్టమ్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈశాన్య భారత్ ఆధారిత సెమీ కండక్టర్ ప్లాంట్‌లో మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా చిప్‌ను త్వరలోనే తీసుకువస్తామని చెప్పారు. ఒకప్పుడు ఈశాన్య భారతమంటేనే తుపాకులు, బాంబులు, రోడ్లకు ఆటంకాలకు నెలవుగా నిలవడం యువత అవకాశాలపై ప్రభావం చూపిందని అన్నారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదం, తిరుగుబాటుకు వ్యతిరేకంగా ఏ మాత్రం ఉపేక్షించని విధానం అవలంభిస్తోందని చెప్పారు. శాంతి ఒప్పందాల దిశగా ప్రభుత్వ నిరంతర కృషి ఫలితంగా 10 వేల మంది ఆయుధాలను వీడి, గత 10–11 సంవత్సరాలలో శాంతిని అక్కున చేర్చుకున్నారని మోదీ అన్నారు. ఈ మార్పు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలకు ఈ ప్రాంతంలో తలుపులు తెరిచిందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలలో కేంద్ర మంత్రులు 700లకుపైగా సార్లు పర్యటనలు చేశారని, ఈ భూమిని అర్థం చేసుకోవడంలో వారి నిబద్ధతను అది తెలియజేస్తుందని, ఇక్కడి ప్రజల ఆకాంక్షలు చూశారని, దానిని అభివృద్ధి విధానాలుగా రూపకల్పన చేస్తున్నారని మోదీ పేర్కొన్నారు.

**ముఖేశ్ అంబానీ, గౌతమ్ అదానీ హాజరు**

రెండు రోజుల పాటు జరిగే పెట్టుబడుల సమ్మిట్‌కు ఈశాన్య ప్రాంత ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, అధికారులు, రాయబారులు హాజరవుతున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పారిశ్రామిక వేత్తలు ముఖేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు.


## గ్యాంగ్‌రేప్ నిందితులకు బెయిల్...

### కార్ల ర్యాలీతో హల్‌చల్

**బెంగళూరు:** కర్నాటకలోని హవేరీలో గతేడాది ఓ మహిళపై ఏడుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర దుమారం రేపింది. ఈ కేసుకు సంబంధించిన నిందితులు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, జైలు నుంచి బయటకు వచ్చిన నిందితులు రోడ్లపై విక్టరీ పరేడ్ మాదిరి ర్యాలీగా వెళ్లి హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఇది తీవ్ర వివాదాస్పదమైంది. హవేరిలోని అక్కి అలూర్ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులకు వారి స్నేహితులే స్వాగత ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. కార్లు, బైక్‌ల మీద స్పీడ్‌గా వెళ్తూ... బిగ్గరగా అరుస్తూ వారు వేడుకలు చేసుకున్నారు. ఈ వీడియో చూసిన పలువురు నెటిజన్లు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.కాగా, 2024 జనవరి నాటి కేసు ఇది. తనపై కొందరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనగల్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో తన స్నేహితుడితో ఉండగా నిందితులు తమ గదిలోకి దౌర్జన్యంగా చొరబడినట్లు తెలిపారు. అనంతరం తనను సమీపంలోని అడవిలోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఏడుగురు ప్రధాన నిందితులు సహా మొత్తం 19 మందిని అరెస్టు చేశారు. బాధితురాలు తొలుత నిందితులను గుర్తించినప్పటికీ... కోర్టు విచారణ సమయంలో వారిని గుర్తుపట్టడటంలో ఇబ్బందిపడ్డారు. దీంతో నిందితుల్లోని 12 మంది పది నెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రధాన నిందితులైన ఏడుగురికి మాత్రం ఇటీవలే బెయిల్ లభించింది. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది.


## పాక్‌కు నిధులిచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ సిద్ధం

### వ్యతిరేకించనున్న భారత్




### ఇప్పటికే 2.3 బిలియన్ డాలర్ల నిధులు ఇచ్చిన ఐఎంఎఫ్

**న్యూఢిల్లీ :** వచ్చే నెలలో పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు పట్ల భారత దేశం వ్యతిరేకించనుంది. గతంలో ఇలాంటి నిధులతో ఇస్లామాబాద్ ఆయుధాలను, మందుగుండును కొనుగోలు చేసిందని, అందుకే ఐఎంఎఫ్ నిధుల విడుదల విషయంలో కూడా వ్యతిరేకించామని భారతదేశ ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. పేదరిక నిర్మూలన, అభివృద్ధి లక్ష్యాల కోసం బహుళ పక్ష సంస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు ఇస్తుంటాయని, కానీ పాకిస్థాన్ గతాన్ని పరిశీలించినట్లయితే ఆ నిధులను సైనిక అవసరాలకు వినియోగించినట్లు స్పష్టమవుతోందని తెలిపాయి. వచ్చే నెలలో పాకిస్థాన్‌కు కంట్రీ పార్ట్‌నర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ కింద 20 బిలియన్ డాలర్ల అప్పు ఇచ్చే అంశంపై సమీక్షించే అవకాశం ఉంది. ఈ మేరకు జనవరి మాసంలో ప్రపంచబ్యాంకు అంగీకరించింది. నగదు కరువుతో కొట్టుమిట్లాడుతున్న పాకిస్థాన్‌కు శుద్ధ ఇందనం, వాతావరణ మార్పు తదితర రంగాలకు 2026 నుంచి పదేళ్ళ పాటు నిధులు ఇవ్వనుంది. త్వరలో పాకిస్థాన్‌కు ప్రపంచ బ్యాంకులు నిధులు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించారు. గత మాసంలో పాకిస్థాన్‌కు 2.3 బిలియన్ డాలర్ల సహాయం అందించటానికి వ్యతిరేకంగా ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలీనా జియార్జైవ్, ఐఎంఎఫ్ బోర్డ్ సభ్య దేశాల మంత్రులుతో భారతదేశం లాబీయింగ్ చేసింది. ఉగ్రవాదులుగా ప్రకటించబడిన వ్యక్తుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ సీనియర్ సైనికాధికారులు హాజరవడాన్ని ఆధారంగా చూపుతూ ఇస్లామాబాద్ గత రెండు దశాబ్దాలుగా నిధులను ఆయుధ సేకరణకు వినియోగిస్తున్నదని న్యూ ఢిల్లీ వాదించింది. ఇప్పటికే ఐఎంఎఫ్ ఛీఫ్‌తోపాటు, ఐఎంఎఫ్ బోర్డులోని కొందరు మంత్రులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారని, అమెరికా వంటి శక్తివంతమైన దేశాల ఎదుట కూడా భారత దౌత్య అధికారులు బలంగా వాదనలు వినిపించారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, పాకిస్థాన్‌కు నిధులు ఇవ్వడాన్ని నిలిపివేయనప్పటికీ, ఆ దేశంపై 11 కఠినమైన షరతులను ఐఎంఎఫ్ విధించింది. నిధులను మంజూరు చేయడంపై ఐఎంఎఫ్ చార్టర్ ప్రకారం వ్యతిరేక ఓటుకు అవకాశం లేకపోవడంతో భారతదేశం ఓటింగ్‌కు గైర్హాజరైంది. ఏ దేశామైనా అభివృద్ధి అవసరాల కోసం నిధులు పొందడానికి భారతదేశం వ్యతిరేకం కాదని, అయితే, భారతదేశం, పాకిస్థాన్‌లకు మధ్య సరిహద్దు ఉద్రిక్తతలతో యుద్ధం వంటి పరిస్థితుల్లో ఐఎంఎఫ్ నిధులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అందుబాటులో ఉన్న సమాచార ప్రకారం పాకిస్థాన్ సగటున సాధారణ బడ్జెట్‌లో 18 శాతం రక్షణ వ్యవహారాలు, సేవలపై ఖర్చు చేస్తుంది. మామూలుగా ఘర్షణలు ఎదుర్కొనే దేశాలే సగటున బడ్జెట్‌లో 10–14 శాతమే రక్షణ రంగానికి వ్యయం చేస్తుంటాయి. 1980 నుంచి 2023 వరకు పాకిస్థాన్ ఆయుధ దిగుమతులు ఐఎంఎఫ్ నిధులు విడుదలయ్యే సంవత్సరాలలోనే నాటకీయంగా 20 శాతం పెరిగాయి.



## పాక్ ఆర్మీ ఉగ్ర కార్యకలాపాలు: జైశంకర్

**న్యూఢిల్లీ:** భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విదేశాల్లో పాకిస్థాన్ చర్యలను ఎండగడుతున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన మీడియాకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. తన గడ్డపై జరుగుతోన్న ఉగ్రవాద కార్యకలాపాల గురించి పాకిస్థాన్‌కు తెలియదనే భావనను మంత్రి తీవ్రంగా ఖండించారు. పాక్, ఆ దేశ సైన్యం ఉగ్రవాద కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయన్నారు. 'ఐక్యరాజ్య సమితి ఆంక్షల జాబితాలోని కరడుకట్టిన ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారు. పట్టపగలే ఆ దేశంలోని పెద్దపెద్ద నగరాల నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటారో తెలుసు. వారు ఏ చర్యలకు ఒడిగడుతున్నారో తెలుసు. వారి మధ్యలో ఉన్న సంబంధాలు తెలుసు' అని జైశంకర్ ఘాటుగా స్పందించారు. పహల్గాం ఉగ్రదాడిని ఉద్దేశించి మాట్లాడుతూ 'పాకిస్థాన్ తన ప్రమేయం లేదని నటించకూడదు. పాక్ ప్రభుత్వం ఉగ్రసంస్థలకు సహకారం అందిస్తోంది. పాక్ ఆర్మీ సరిహద్దు ఉగ్రవాదంలో పీకల్లోతు కూరుకుపోయింది' అని ఆయన ధ్వజమెత్తారు. ఉగ్రవాదం, జమ్మూకశ్మీర్ అంశం భారత్‌కు వేర్వేరు అంశాలని తేల్చిచెప్పారు. పాక్ నేతలు, ముఖ్యంగా ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మత ఛాందసవాదంపై జైశంకర్ విమర్శలు చేశారు.

## ఎస్-400 ముందస్తు డెలివరీ కోసం దోవల్ యత్నం



**న్యూఢిల్లీ:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వచ్చేవారం రష్యా వెళ్లనున్నారు. మే 27 నుంచి 29 వరకు భద్రతా వ్యవహారాల ఉన్నతస్థాయి ప్రతినిధుల 13వ అంతర్జాతీయ సమావేశం జరగనుంది. మాస్కోలో జరిగే ఈ సమావేశంలో దోవల్ పాల్గొంటారు. ఇదే పర్యటనలో ఆయన రష్యా వద్ద పెండింగ్‌లో ఉన్న ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ముందస్తు డెలివరీ అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. 'ఆపరేషన్ సిందూర్'తో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దోవల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్400 కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. వైమానిక, క్షిపణి దాడులకు దిగితే నిలువరించే అత్యంత శక్తిమంతమైన ఆయుధ వ్యవస్థ ఎస్400. శత్రువుల యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో ఇది నేలకూల్చగలదు. ప్రత్యర్థి జామింగ్ విధానాలను కూడా తట్టుకోగలదు. వీటిని రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివద్ధి చేసింది. మొత్తం ఐదు ఎస్400 క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు 2018లో భారత్‌రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. దీని విలువ దాదాపు రూ.35 వేల కోట్లు. ఇప్పటివరకు మూడు వ్యవస్థలు భారత్‌కు చేరగా... మిగతా వాటిని 2026 ఆగస్టు నాటికి అందించే అవకాశాలున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అంత కంటే ముందుగానే వీటిని డెలివరీ చేసేలా దోవల్ మాస్కోతో చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రక్షణ వ్యవస్థలను భారత వైమానిక దళం వినియోగిస్తోంది.

## 33మంది మావోయిస్టుల లొంగుబాటు

**బీజాపూర్/దంతెవాడ:** చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో శుక్రవారం 33మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. ఇందులో 24మందిపై రూ.91 లక్షల రివార్డు ఉందని, వీరంతా సుక్మా జిల్లా బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాల ముందు లొంగిపోయారని పోలీసులు తెలిపారు. తొమ్మిది మంది మహిళలతో సహా ఇరవై నాలుగుమంది మావోయిస్టులు బీజాపూర్‌లోని సీనియర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ అధికారుల ముందు తమంతట తాముగా లొంగిపోయినట్లు బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. భద్రతా శిబిరాల చుట్టూ ఉన్న మారుమూల గ్రామాల్లో అభివద్ధి పనులను సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'నియాద్ నెల్లనార్' పథకం వారిని ఆకట్టుకున్నట్లు చెప్పారని ఎస్పీ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో అభివద్ధి పనులు జరగడం, గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటవడం కూడా మావోయిస్టుల లొంగుబాటుకు ముఖ్య కారణమని యాదవ్ చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లు భద్రతా సిబ్బందిపై దాడులు, ఐఈడి పేలుళ్ల తదితర ఘటనల్లో పాల్గొన్నారని ఆయన చెప్పారు. వీరిలో ప్లెగా బెటాలియన్ నెం. 1997 నుండి చురుగ్గా ఉన్న మావోయిస్టులలో ఇద్దరున్నారని... వీరిపై రూ .10 లక్షల రివార్డు ఉందని వివరించారు. మరో ఇద్దరిపై రూ.8లక్షలు, రూ.5లక్షల చొప్పున ఇద్దరిపై రివార్డు ఉన్నట్లు చెప్పారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు సుక్మా జిల్లాలో 227 మంది నక్సలైట్లు హింసను వీడినట్లయిందన్నారు. ఇక జిల్లాలో ప్రత్యేక సంఘటనలలో 119 మంది మావోయిస్టులు హతమవగా, 237 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.




## జెపి ఇన్‌ఫ్రాటెక్‌పై ఈడీ దాడులు

**న్యూఢిల్లీ:** వేల కోట్ల రూపాయల మోసం కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్, ఇతరులపై ఈడీ దాడులు చేసింది. సదరు సంస్థలు, వ్యక్తుల ఇళ్లపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఈడీ వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ మేరకు అధికారిక వర్గాలు నిర్ధారించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద దిల్లీ, ముంబైలో దాడులు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. గహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల సొమ్ములు సుమారు రూ.12 వేల కోట్ల మేరకు మోసం, నిధుల మళ్లింపునకు సంబంధించిన కేసులో జేపీ ఇన్‌ఫ్రాటెక్, జేపీ అసోసియేట్స్ లిమిటెడ్, ఇతరులపై ఈ సోదాలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. గౌర్సన్స్, గుల్షన్, మహాగున్, సురక్ష రియాలిటీ వంటి, జేపీ ఇన్ ఫ్రా అనుబంధ సంస్థలపై కూడా దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అయితే, దాడుల నేపథ్యంలో సంబంధిత కంపెనీలు ఇప్పటివరకూ ఏమీ స్పందించలేదు.

## పోక్సో కేసులో దోషిగా నిర్ధారించినా
# ఏ శిక్షా విధించని సుప్రీంకోర్టు!

**న్యూఢిల్లీ:** పోక్సో కేసులో దోషిగా నిర్ధారణ అయినప్పటికీ ఆ వ్యక్తికి తన తుది తీర్పులో ఏ శిక్షా విధించలేదు. ఆ కేసులోని ప్రత్యేక పరిస్థితే అందుకు కారణం. కేసు పూర్వాపరాలలోకి వెళితే... బాలికతో లైంగిక సంబంధం కొనసాగించినందుకు గతంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అతడు కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు 2023 అక్టోబరు 18న సంచలన తీర్పు వెలువరించింది. బాలిక ... పిటిషనర్‌తో ఇష్టపూర్వకంగానే లైంగిక సంబంధాన్ని కొనసాగించినట్లు రుజువైనందున అతడిని నిర్దోషిగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. 'కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందం కోసం చూసుకుంటే... సమాజం దష్టిలో బాలికలు పరాజితులుగా మిగిలిపోతారు. కిశోరప్రాయ బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలి' అని ఆ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అదే సమయంలో నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దాంతో హైకోర్టు తీర్పును 2024 ఆగస్టు 20న సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ కేసులో నిందితుడికి ట్రయల్ కోర్టు విధించిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్లు స్పష్టంచేసింది. అయితే అదే సమయంలో బాధిత బాలిక మైనర్‌గా ఉన్నప్పుడు తనతో లైంగిక సంబంధం నెరిపిన వ్యక్తినే ఇప్పుడు పెళ్లి చేసుకొని ఒక బిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. బాధితురాలు, దోషి ఇద్దరూ ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటైనందున పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ వేసి, బాధితురాలితో చర్చించాలని సూచించింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా శిక్షపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది.

CHANGE OF NAME
I, YADLAPALLI SAHTEESH (old name), S/o.Shankar Rao, age : 45years, R/o: Thirumalayapalem, Khammam Dist, Telangana State, India. here by declare that I have changed my name YADLAPALLI SATHEESH (new name) for all purpose.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైతు ర్యాలీ, సభల దరఖాస్తుపై చర్యలు తీసుకోండి :హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్‌లో ఈ నెల 27న రైతు ర్యాలీ, బహి రంగ సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ తెలంగాణ రైతు సంఘం దాఖలు చేసిన దరఖాస్తును పరిశీలించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకో వాలని వరంగల్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. శాంతియుత ర్యాలీ, సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వడం ఇవ్వాలనే తమ అప్లికేషన్‌పై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివా స్‌రావు శుక్రవారం విచారించారు. మే 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వరంగల్‌లోని కార్మిక మైదానం నుంచి సాయి కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీ, ఇందులో 800 మంది రైతులు పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అజంజాహి మిల్లు గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తాం.అనుమతి కోసం పోలీసులకు పలు సార్లు దరఖాస్తు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.. అని పిటిషన్‌లో పేర్కొ న్నారు. కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఉంటేనే ర్యాలీకి అను మతి ఉంటుందని ప్రభుత్వం చెప్పింది. స్పందించిన హైకోర్టు, పిటిషనర్ కలె క్టర్ నుంచి ఎన్‌ఓసీ తీసుకుని తిరిగి పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలంది.

## బిఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదు

కవిత లేఖపై మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** బిఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్‌కు ఆయన కుమార్తె, ఎంఎల్‌సి కవిత రాసిన లేఖపై మంత్రి స్పందించారు. కెసిఆర్ కుటుం బంలో విభేధాలు ఉన్నాయంటే ఎవరైనా నమ్ముతారా అని పేర్కొన్నారు. కవిత లేఖ ఓ జోక్ అని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో శుక్ర వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మాజీ ఎంపి, ప్రస్తుత ఎంఎల్‌సి రాసే లేఖ ఓ పద్ధతిగా ఉందా? ఆ లేఖను సృష్టించాల్సిన అవసరం మాకేంటి? బిఆర్‌ఎస్‌లో చీలిక ఏమీ లేదు. ఇదంతా ఓ డ్రామా. దానిలో భాగమే ఈ లేఖ. తండ్రికి లేఖ రాయాల్సిన అవసరమేంటి? ఆమె నేరుగా చెప్పొచ్చు కదా! కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? వారు గొడవపడరు. ఒక వేళ అలా జరిగితే అది ఆస్తుల గురించే అవుతుంది' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## కవిత లేఖ అంశం బిఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారం

బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి, మాజీ ముఖ్యమంత్రి కెసి ఆర్ తనయి కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ఇప్పుడు తెలంగాణ రాజకీ యాల్లో సంచలనంగా మారిన విషయం తెల్సిందే. కవిత లేఖ పార్టీ అంత ర్గత వ్యవహారమని, తాము తేల్చుకుంటామని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ అన్నారు. కవిత పేరుతో లేఖ, రేవంత్ సృష్టించినది కావొచ్చు? అనే సందేహాన్ని కూడా దాసోజు వ్యక్తం చేశారు. 'ఒకవేళ కవితనే రాస్తే, తప్పేంటి? పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, కవిత తన సూచ నలు చేశారన్నారు. నిజంగా కవిత లేఖ రాస్తే, దాన్ని భూతద్దంలో చూడా ల్సిన పని లేదన్నారు. బిజెపిని కెసిఆర్ లక్ష్యంగా విమర్శలు చేయలేదనటం కవిత సొంత అభిప్రాయమన్నారు. బిజెపి, మోదీని కెసిఆర్ మాదిరి ఎవరూ ప్రశ్నించలేదన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన పార్టీలోని గ్రూపులను చక్కదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. నేషనల్ హెరాల్డ్ కేసును కప్పిపుచ్చుకు నేందుకే రేవంత్ రెడ్డి డ్రామాలాడుతున్నారని ఆరోపించారు.

## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ హైదరాబాద్ నగరంపై లేదు

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ హైదరాబాద్ నగర అందాలపై లేదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలన్నారు. హిమాయత్ నగర్ శుక్రవారం పర్యటిం చిన ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదన్నారు. పాతబస్తీలోని అనేక ప్రాంతాలు ఉన్నాయన్న విష యాన్ని సిఎం మర్చిపోయారని ఎద్దేవా చేశారు.

## కవిత లేఖ.. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఎత్తుగడ

బిజెపి ఎంపి డికె.అరుణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్‌కు కవిత కలవట్లేదా ? అని బిజెపి ఎంపి డి.కె. అరుణ ప్రశ్నించారు. అసలు తండ్రికి లేఖ రాయాల్సిన అవ సరం కవితకు ఎందుకు వచ్చిందన్నారు. కెసిఆర్‌కు తన కూతురు ఎంఎల్ ఎసి కవిత రజతోత్సవ సభపై లేఖ రాయడంపై బిజెపి ఎంపి స్పందించారు. ఎప్పుడంటే అప్పుడే తండ్రిని కలిసే అవకాశం ఉంటుందన్నారు. కవిత అసలు లేఖ రాయడానికి గల ఉద్దేశం ఏంటి? అని ఆమె ప్రశ్నించారు. మరోవైపు కెటిఆర్ చెల్లెలు మధ్య, కుటుంబంలో ఏదైనా డిఫరెన్సెస్ ఉందా? అసలు ఇది కవిత రాసిన లేఖనా? కాదా? నిన్నటి నుంచి లేఖ చక్క ర్లు కొడుతున్న ఇప్పటివరకు దీనిపై వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇది కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కలిసి చేసిన ఎత్తుగడ కూడా కావొచ్చు అన్నారు. తెలంగాణలో బిజెపి పార్టీని బలహీనం చేయాలని, రెండు పార్టీలు భావిస్తు న్నాయని ఆరోపించారు. బిజెపి పార్టీని అడ్డుకోవాలనే ఈ లేఖ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. లేఖ కెసిఆర్ వరకు చేరిందా? మధ్యలోనే బయటకు వచ్చిందా ? అనేది కూడా తెలియాలని డి.కె. అరుణ అన్నారు.

## ఎఫ్‌సిఐ కన్సల్టేటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా డికె.అరుణ

మహబూబ్ నగర్ ఎంపి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె. అరుణకు కేంద్రం కీలక బాధ్యతలు అప్ప గించింది. ఎఫ్‌సిఐ కన్సల్టేటివ్ కమిటీ తెలం గాణ చైర్ పర్సన్‌గా డి.కె. అరుణను నియమించింది. ఈ మేరకు పార్ల మెంట్ వ్యవహారాల శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను సమర్థవం తంగా అమలు చేయడం, ధాన్యం సేకరణలో సమస్యపై అధ్యయనం చేయ నుంది. తనకు ఈ బాధ్యతలు అప్ప గించిన కేంద్ర ప్రభుత్వానికి డి.కె. అరుణ ధన్యవాదాలు తెలిపారు. 'రైతులు, పేద ప్రజల సంక్షేమమే నా లక్ష్యం. ఈ బాధ్యత్య ద్వారా రాష్ట్రంలో ఆహార భద్రతను బలోపేతం చేయ డానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తా' అని అరుణ అన్నారు.

## కాంగ్రెస్‌లోకి కవిత

ఈ డ్రామాల వెనుక సిఎం రేవంత్ రెడ్డి

బిజెపి ఎంపి రఘునందన్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఎల్‌ఎసి కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబో తోందని మెదక్ ఎంపి రఘునందన్ రావు ఆరోపించారు. ఈ డ్రామాల వెనుక సిఎం రేపంత్ రెడ్డి ఉన్నట్లు కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత లేఖ రాసిన రోజే కాంగ్రెస్‌కు సంబంధించిన పత్రిక, టివిలలో వార్త వచ్చిందన్నారు. మరోవైపు కవితను బయటకు పంపించడం కోసం బావా, బామ్మర్దులు ఒక్కటి అయ్యారని ఆరోపించారు. ఈ సంకేతం వాళ్ల మీటింగ్ ద్వారా అందరికీ అర్థమయిందన్నారు. కవిత మరో షర్మిల కాబోతున్నదని రఘునందన్ రావు జోస్యం చెప్పారు. ఇప్పుడు కవితతో పార్టీ పెట్టించి, తర్వాత కాంగ్రెస్‌కు దగ్గరయ్యే ప్రయత్నం జరగబోతోందన్నారు. ఎవరేం చేసినా వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో బిజెపి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రశంసలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈ ఎస్‌సిఐ) ఆధ్వర్యంలో పిఎంకెవివై 4.0 కార్యక్రమం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి చెందిన 960 మంది నిరుద్యోగ యువతకు నిర్వహించిన నైపు ణ్యాభివృద్ధి కార్యక్రమాలను న్యూ ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఈ కార్యక్రమాలు నాణ్యమైన శిక్షణ, ప్రభావంతమైన అమలుతో పాటు యువత సాధికారతకు చేసిన సద్వినియోగానికి గుర్తింపు పొందాయి. ఈ విజయాన్ని దృష్టిలో పెట్టుకొని, మంత్రిత్వ వాఖ భవిష్యత్ దశల్లో మరింత ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించి, మరిన్ని అవకాశం ఉందని ఈఎస్‌సిఐ డైరక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు తెలిపారు.




## ఎపి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలంగాణ మంత్రి ఉత్తమ్‌తో భేటీ

బియ్యం అక్రమ రవాణా కట్టడికి ఉభయ తెలుగు రాష్ట్రాలు చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేషన్ బియ్యం అక్రమ రవాణా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సిఐ)కి బియ్యం సరఫరాలో ఇరు రాష్ట్రాలు సమన్వ యంతో ముందుకు సాగనున్నామని ఉభయ తెలుగు రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్ తెలిపారు. హైద రాబాద్‌లోని సివిల్ సప్లైయి భవన్‌లో గురువారం తెలంగాణ రాష్ట్ర పౌరసరఫ రాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మంత్రులు బియ్యం సేకరణ, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆస్తుల పంపిణీతో పాటు పలు కీలక అంశాలపై చర్చించారు. అదేవిధంగా తెలంగాణలో అక్రమ బియ్యం రవాణాను అరికట్టేందుకు ఇరు రాష్ట్రాల పూర్తిగా సమన్వయంత పని చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా తెలంగా ణలో సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాల నుంచి అక్రమంగా ధాన్యం రవాణా కాకుండా కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఇందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఇరు రాష్ట్రాల మంత్రులు నిర్ణయించారు. అదేవిధంగా వివిధ దేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతులు చేస్తున్న నేపథ్యంలో ఓడ రేవులకు సంబంధించి కూడ సమ న్వయం చేసుకోనున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, సివిల్ సప్లైస్ కమిషనర్ డి.ఎస్. చౌహాన్, ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని ప్రశంసలతో ముంచెత్తారు

మహిళల భద్రత, సాధికారతకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ

తెలంగాణ అభివృద్ధి, ఆత్మీయత, ఆత్మగౌరవానికి ప్రతీక

అంతర్జాతీయ సుందరీమణులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్ ఫెస్టి వల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'హెడ్‌టుహెడ్ చాలెంజ్' ఫినాలే సందర్భంగా, వివిధ ఖండాల నుంచి వచ్చిన అందాల కిరీట ధారులు తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యంగా హైద రాబాద్‌ను అభినందనలతో ముంచెత్తారు. ఈ పోటీ సందర్భంగా జడ్జీలు అడిగిన ప్రశ్నలకు తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, మహిళల సాధి కారత, భద్రతకు సంబంధించి కాంటెస్టెంట్లు చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షిం చాయి.

**మహిళల భద్రతపై అభినందనలు..**

తెలంగాణ రాష్ట్రం మహిళల భద్రతను హక్కుగా గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటుందన్న విష యాన్ని పలువురు స్పష్టం చేశారు. భద్రత అనేది ఒక హక్కు, దానిని అందించడంలో తెలంగాణ ముమ్ముందు ఉందన్నారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రిపూట కూడా భయపడ కుండా స్వేచ్ఛగా తిరగగలగడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెప్పారు. ఇది ఒక సురక్షిత నగ రానికి ప్రతీక అని అభివర్ణించారు. పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సంద ర్శించి, అక్కడ షీ టీమ్స్, హాక్ ఐ, 24గం.ల పర్యవేక్షణ వంటి సాంకేతిక భద్రతా వ్యవస్థ లను పరిశీలించి మహిళల రక్షణ కోసం తెలం గాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి విశేషంగా ఆకర్షించాయని అన్నారు.

**తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారు?**

తెలంగాణ సాంకేతికత, వైద్య రంగాల్లో అభి వృద్ధి చెందడమే కాకుండా, మహిళల హక్కులు, విద్య, సాధికారతకు కూడా అత్యున్నత ప్రాధా న్యతనిచ్చే రాష్ట్రంగా పలువురు వివరించారు. ఇది ప్రపంచానికి శక్తివంతమైన సందేశాన్ని అందిస్తున్నదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మీయత, ఆదరణ, ఆతిథ్య భావం ప్రత్యేకంగా నిలిచిందని అన్నారు. రాష్ట్ర సంస కృతి, సంప్రదాయాలు స్ఫూర్తిదాయకంగా అని పించాయని, 'బ్యూటీ విత్ పర్పస్' భావన ఇక్కడ జీవనశైలిలో కనిపించిందని చెప్పారు. తెలంగాణ అనుబంధాల తాటిపై నిలిచిన భూమి, స్నేహబంధాలకు నిలయం, సంస్కృ తికి ప్రతీకగా భావిస్తున్నామని చెప్పారు. 72వ మిస్‌వరల్డ్ కాంటెస్టెంట్ల కళ్లలో తెలంగాణ ఒక అభివృద్ధి చెందిన, మహిళలకు భద్రత కలిగిన, ఆత్మీయత నిండిన ప్రగతిశీల రాష్ట్రంగా నిలి చింది.

వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు తెలంగాణ కీర్తి, అతిథ్య, పురోగతిని అంతర్జాతీయంగా తెలియజేస్తున్నడంలో సందేహం లేదు.

## ఇక్రిశాట్‌ను సందర్శించిన రైతు కమిషన్ బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోజురోజు మారుతున్న పరిస్థి తులకు అనుకూలంగా ఇక్రి శాట్ పరిశోధనలు చేయడం, సాంప్రదాయ పంటలను అభి వృద్ధికి ఇక్రిశాట్ సేవలు ఎంతో దోహదపడుతున్నా యని తెలంగాణ రాష్ట్ర వ్యవ సాయ, రైతు సంక్షేమ కమి షన్ ఛైర్మన్ ఎం.కోందరెడ్డి ప్రశంసించారు. ఛైర్మన్ కోదం డరెడ్డి నేతృత్వంలో రైతు కమి షన్ సభ్యులు రాంరెడ్డి, గోపా ల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఆధి కారులు హరి వెంకట ప్రసాద్, సురేష్ తోకూడిన బృందం గురువారం ఇక్రిశా ట్‌ను సందర్శించారు. రైతుక మిషన్ బృందానికి ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా. హిమాన్షు పతక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. స్టాన్ఫోర్డ్ బ్లేడ్, ప్రిన్సిపల్ సైంటిస్టులు డా.హరికిషన్ సుడిని,డా. జానిలా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంతర్జా తీయ వ్యవసాయ పరిశోధన కేంద్రమైన ఇక్రిశాట్ లో మెట్ట పంటల అభివృద్ధి, విత్తన పరి శోధన, మట్టి ఆరోగ్యం, నీటి వినియోగం అంశాలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసున్నారు.

ఈ సందర్భంగా ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు, కమిషన్ బృందం చాలా అంశాలపై చర్చిం చారు. రైతు కమిషన్ అభిప్రా యాలను , ప్రభుత్వ పాలసీ లను ఇక్రిసాట్ శాస్త్రవేత్తలకు ప్రతినిధులు వివరించారు. అదేవిధంగా ఇక్రిశాట్‌లో కొన సాగుతున్నకార్యక్రమాలు, పరిశోధనలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు . తాను గతంలో ఎంఎల్‌ఏ ఉన్న సమయంలో ఒకసారి, మళ్లీ ఇప్పుడు ఇక్రిశాట్ సంద ర్శిస్తున్నానని కోదండరెడ్డి తెలి పారు.

## అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

అగ్ని ప్రమాదాల నివారణ శాఖ డిజి. నాగిరెడ్డి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అగ్ని ప్రమా దాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. అగ్ని ప్రమా దాల నివారణకు ప్రభుత్వ శాఖలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని నాగిరెడ్డి కోరారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం పన్వార్ హాల్‌లో శుక్రవారం అగ్ని ప్రమా దాల నివారణపై సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం సభ్య సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, అలాంటి పురాతన భవనాల్లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్యల ఆయా శాఖల ద్వారా కావాల్సిన సూచ నలు ఇవ్వాలని కోరారు.

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ శిథిలావస్థలో భవనాలను సర్వే చేయనున్నట్లు తెలిపారు. డిజి సూచన మేరకు వ్యాపార సముదా యాలు, వ్యాపార భావనాలలో ఫైర్ సేఫ్టీ విషయంలో పకడ్బంది చర్యలు తీసుకుం టామని తెలిపారు.

**స్మోక్ డిటెక్టర్‌తో పాటు అలారం ఉండాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అను దీప్ దురిశెట్టి మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన సంద ర్భంలో ఫైర్, పోలీస్ శాఖ మాత్రమే సమాచారం వెళుతున్నదని, ఆ సమాచారం రెవెన్యూ సంబంధిత శాఖ లకు సమాచారం ఇవ్వాలని జిల్లా యంత్రాంగం తరపున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స అందించడం బెడ్స్, డాక్టర్లను సిద్ధం చేయడం లాంటి చర్యలు సకాలంలో తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, వెంకన్న, డిస్కమ్ సి.ఇ, హైడ్రా, ఫైర్ అధికారులు, ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రిసిటీ అధికారులు తమ సూచనలు ఇచ్చారు.

## అనుమతిలేనప్పుడు అల్లుఅర్జున్ థియేటర్‌కు ఎలా వచ్చాడు?



హైదరాబాద్ సిపికి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'పుష్ప2' సినిమా స్పెషల్ షోకు సంధ్యా థియేటర్‌లో పోలీసులు అనుమతి ఇవ్వనప్పుడు అల్లు అర్జున్ థియేట ర్‌కు ఎలా వచ్చాడని జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలంగాణ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనపై పోలీసులు ఇచ్చిన నివేదికలో సరైన వివరాలు లేవని, పోలీస్ స్టేషన్ కు సమీపంలో డిజెలు, ఇంత హంగామా జరుగుతుంటే పోలీ సులు ఏం చేస్తున్నారని కమిషన్ నిలదీసింది. ఈ క్రమంలోనే కమిషన్ హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌కు శుక్రవారం నోటీ సులు జారీ చేసింది. పూర్తి నివేధికను తమకు అందించాలని కమిషన్ నోటీసులో ఆదేశిం చింది. హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద 2024 డిసెంబర్ 4న జరిగిన తొక్కిసలాట ఘట నలో రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. 'పుష్ప 2: ది రూల్' ప్రీమియర్ సంద ర్భంగా భారీగా వచ్చిన అభిమానుల రద్దీ కార ణంగా జరిగింది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, థియేటర్ యజమాని, మేనేజర్, సెక్యూరిటీ గార్డును అరెస్ట్ చేశారు. సంధ్య థియే టర్ లో పుష్పా సినిమా విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన పూర్తి నివేదికను అడజేయాలని జనవరిలో పోలీసు లను హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే.

అయితే పోలీసులు సమర్పించిన నివేధిక అసబ ద్ధంగా ఉండడంతో కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు హైదరాబాద్ సి పి సి వి ఆనంద్ కు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంధ్య థియేటర్ ఘటన లో నిర్లక్ష్యం వహించా రని, విపత్తు నివారణకు ఎటువంటి చెర్యలు చేప ట్టలేదని, నివేదిక సంతృప్తికరంగా లేదని కమి షన్ వ్యాఖ్యానించింది. హైదరాబాద్ సి పి ని నివేదిక సమర్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. అనుమతి నిరా కరించినా అల్లు అర్జున్ రోడ్ షో ఎలా నిర్వహిం చాడు. ముందస్తు హెచ్చరిక చేయకపోవడానికి కారణాలేంటని కమిషన్ ప్రశ్నించింది.



## కొత్త క్రిమినల్ చట్టాలపై డిజిపి సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తగా వచ్చిన క్రిమినల్ చట్టాలపై తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ శుక్రవారం తన కార్యాలయంలో పోలీసు అధికారు లతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో అధికారులు అడిగిన పలు సందేహాలకు డిజిపి బదులిచ్చారు. పోలీసు శాఖలోని అన్ని విభాగాల పనితీరును ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. తెలంగాణ పోలీసులు 2025 మే 22 నాటికి బిఎన్‌ఎస్ కొత్త చట్టాల కింద 1,37,644 కేసులను నమోదు చేశారని తెలిపారు. అలాగే 1251 జీరో ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయ బడ్డాయన్నారు. 60,90రోజుల్లోపు ఛార్జ్ షీట్లు దాఖలు చేసే ప్రక్రియను నిరం తరం పర్యవేక్షించాలని, కఠినంగా ఉండేలా చూడాలని ఆయన అధికారులం దరినీ కోరారు. సమావేశంలో సిఐడి డిజి శిఖాగోయల్, అదనపు డిజిపి మహేష్ ఎం.భగవత్, ఐపిఎస్ అధికారులు వివి శ్రీనివాసరావు, డా.అనిల్ కుమార్, ఎస్.చంద్ర శేఖర్ రెడ్డి, ఎం.రమేష్, రెమా రాజేశ్వరి పాల్గొన్నారు.

## 'ఉగ్ర' కేసులో సిరాజ్,సమీర్‌లను విచారిస్తున్న పోలీసులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లకు కుట్ర పన్ని విశాఖపట్నం జైలులో ఉన్న ఇస్లామిక్ స్టేట్స్ ఆఫ్ ఇరాన్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) ఉగ్రవాదులు సిరాజ్, సమీర్‌లను కోర్టు ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం విజయనగరం పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. సిరాజ్, సమీర్‌లను ఏడు రోజుల పాటు విచారించనున్నారు. వీరిద్దరి బ్యాంక్ ఖాతాలపై కూడా పూర్తి కూపి లాగే అవ కాశాలు ఉన్నాయి. దీంతో పాటు వీరికి బ్యాంక్ ఖాతాల్లోకి నిధులు ఎవరు పంపిచారు అనే అంశంపై కూడా ఆరా తీయనున్నారు. దుభా య్‌లో వీరిద్దరు ఉన్న సమయంలో ఎవరెవరితో సంబంధాలు ఏర్పరచుకున్నారు తదితర అంశా లపై పోలీసులు దృష్టి పెట్టారు. సిరాజ్ తండ్రి ఎఎస్ఐ, అతని తమ్ముడు కానిస్టేబుల్ విష యంలో కూడా సిరాజ్‌ను విచారించను న్నారు.సిరాజ్, సమీర్‌లను వేరు వేరుగా విచా రించి వారిచ్చిన సమాచారాన్ని రుడీ చేసుకునేం దుకు పోలీసులు ప్రణాళికలు తయారు చేశారు. హైదరాబాద్ పోలీసులు కూడా విజయనగరం పోలీసుల విచారణపై దృష్టి సారించారు. విచా రణ సమయంలో తెలంగాణ పోలీసులు కూడా ఉండే అవకాశాలు ఉన్నాయి. నిందితులు వెల్ల డించే అంశాలపై తదుపరి దర్యాప్తు చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు.

## శ్రవణ్‌రావును విచారిస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖండ సంస్థను మోసం చేశారని సిసిఎస్‌లో శ్రవణ్ రావుపై నమోదైన కేసులో శుక్రవారం విచారణ చెపట్టారు. అఖండ సంస్థ చేసిన ఫిర్యాదులో పేర్కొన్న రూ.6.58 కోట్లపై శ్రవణ్ రావును ప్రశ్నించ డంతో పాటు బ్యాంకు లావాదేవీలను సిసిఎస్ టీం పరిశీలిస్తున్నారు. చీటింగ్ కేసులో శుక్రవారం ఒక్క రోజు మాత్రమే విచారించేందుకు నాంపల్లి కోర్టు అనుమతిచ్చింది. చంచల్ గూడ జైలులో రిమాండ్లో ఉన్న శ్రవణ్ రావును సిసి ఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఎకోర్ ఇండస్ట్రీ నుంచి ముడి ఇనుమును కొనుగోలు చేస్తే టన్నుకు భారీగా లాభం ఉంటుందంటూ అఖండ ఎంటర్ ప్రైసెస్ సంస్థ నుంచి రూ. రూ.6.58 కోట్లు తీసుకుని మోసా నికి పాల్పడ్డరని అఖండ సంస్థ ఫిర్యాదులో పేర్కొంది. డబ్బులు తీసుకున్నాక అమెరికాకు పారిపోయాడంటూ తెలిపింది. ఫిర్యాదుపై శ్రవణ్రావును ఈనెల 13న అరెస్ట్ చేశారు. జ్యుడిషియల్ రిమాండ్కు తరలించారు. ఈ కేసులో శ్రవణ్ రావుతో పాటు ఆయన భార్య స్వాతి రావును కూడా ఏ4 నిందితురా లిగా చేర్చారు. సాయంత్రం 5:30 గంటల వరకు శ్రవణ్ రావును విచారణ జరిపిన అనతంరం స్టేట్మెంట్ రికార్డు

## ఒసి సర్టిఫికెట్‌కు రూ.8 లక్షలు డిమాండ్

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జిహెచ్‌ఎంసి అధికారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు జిహెచ్ ఎంసి అధికారి రూ.8 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి నుంచి సదరు అధికారి రూ.4 లక్షలు నగదు తీసుకుంటుండగా ఎసిబి రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి జైలుకు తరలించారు. సికింద్రాబాద్ జిహెచ్ ఎంసి కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్న సంఘటనపై ఎసిబి డిజి విజయ్‌కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విఠల్‌రావు జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లాన ర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివసించే ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణంలో భాగంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఎఒ) కోసం విఠల్‌రా వును ఆశ్రయించాడు. అయితే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.8 లక్షలు విఠల్ రావు డిమాండ్ చేశాడు. మొదటి విడ తలో రూ.4 లక్షలు ఇవ్వాలని, సర్టిఫికెట్ ఇచ్చే రోజున మరో రూ.4 లక్షలు ఇవ్వా లని కోరాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే బాధితుడు శుక్ర వారం రోజున జిహెచ్‌ఎంసి కార్యాల యంలో విఠల్‌రావుకు రూ.4 లక్షల నగదు ఇస్తుండగా ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ తన సిబ్బందితో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తరువాత విఠల్‌రావు కార్యాలయంలతో పాటు అతని ఇంట్లో ఎసిబి అధికారులు సోదాలు నిర్వ హించారు. అనంతరం విఠల్‌రావును ఎసిబి మెజిస్ట్రేట్ ముందు హాజరుప ర్చగా 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించడంతో నిందితుడిని చంచల్ గూడ జైలుకు తరలించారు.

## ఒటిటి ఫ్యామిలీ డ్రామాలాగా కవిత లేఖ

కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లెటర్ టూ డాడీ అని కవిత రాసినలేఖ ఒక ఒటిటి ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. దాని టైటిల్ కాంగ్రెస్ వదిలిన బాణమని ఆయన ఆరోపించారు. కవిత లేఖపై బండి సంజయ్ ఎక్స్‌లో స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు విఫలం అయ్యాయన్నారు. అందుకే ఆ రెండు పార్టీ కలిసి బిజెపిని బద్నాం చేసే కుట్రలకు తెరలేపారన్నారు. కుటుంబపాలనకు బిజెపి వ్యతిరేక మని, అది గాంధీల కుటుంబం అయిన కల్వకుంట్ల కుటుంబమైనా సరే, వారి కుటుంబ సంక్షోభాలను గొడవలను ప్రజల భావోద్వేగాలుగా మలుస్తాయని ఆరోపించారు. బిజెపి ఎవరిని జైలుకు పంపదని, చట్టం ముందు దోషులని తేలితే వారు జైలుకు వెళుతారన్నారు. తెలంగాణలో బిజెపి గ్రాఫ్ పెరుగుతుం దన్నారు.

## ఘనంగా మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పిటిసివం గూరి లక్ష్మయ్యలు పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోని ఆయుష్ ఆరోగ్యాలతో జీవించాలని అదేవిధంగా భవిష్యత్తులో ఇంకా అనేక పదవులు చేపట్టాలని వారి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సలీం,గురిజ వెంకన్న, బ్రహ్మానంద రెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు గ్రామ పాలనాధికారుల స్క్రీనింగ్ పరీక్ష

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఈనెల 25న నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న గ్రామ పాలనాధికారుల స్క్రీనింగ్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మొత్తం 276 మంది ఈ స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకానున్నారని ఆమె వెల్లడించారు ఈ పరీక్షల నిర్వహణకు ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా సూచనలను పాటించాలన్నారు.అభ్యర్థులు ఉదయం 09:00 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకుంటే 10:00 గంటల తరువాత పరీక్ష కేంద్రంలో ప్రవేశం అనుమతించబడదు అన్నారు. పరీక్ష 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:30 వరకు జరుగుతుంది అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించబడదని పెర్కొన్నారు.

తాగునీటి సీసా మాత్రమే అనుమతించబడుతుంది.

## సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై వేటు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై ఎట్టకేలకు వేటు పడింది. గత కొన్నేళ్లుగా ఆయనపై అవినీతి, అరోఫణలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లా కేంద్రంలో విస్తృతంగా ప్రైవేట్ ఆసుపత్రులలో తనిఖీలు చేశారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యాల, అర్హతలేని వైద్యుల అసలు బండారాలు వెలుగులోకి వచ్చాయి. ఇదిలా ఉండగా పట్టణంలోని శ్రీసాయి గణేష్ అస్పిటల్‌లో వచ్చిరాని వైద్యులు వచ్చిరాని వైద్యం చేసి ఓ మహిళ మృతికి కారణమయ్యారు. అలాగే ఓజోన్ అస్పిటల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా ఓ మహిళకు అబార్షన్ చేస్తుండగా వికటించి గర్భిణి మృతి చెందింది. దీంతో పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అవినీతి, అక్రమాలపై రోగులు బలి అవుతున్నారంటూ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పెద్ద ఎత్తున వరుస వార్త కథనాలు వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పందిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంపై విచారణ చేపట్టింది. ఈ విచారణ పూర్తి కాకముందే ఆయనను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ హైద్రాబాద్‌కు బదిలీ చేస్తూ శుక్రవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో హైద్రాబాద్‌లోని ఎల్‌బి నగర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పని చేస్తున్న పి.చంద్రశేఖర్‌ను నియమించింది.

## పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సహాయ,సహకారాలను అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ



**ప్రజాపక్షం/గుండాల:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గుండాల తహశీల్దార్ ఆఫీస్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బుర్జుబాయి గ్రామంలో 16 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ప్రారంభించారు. వాటిలో నాలుగింటికి బిస్మెంట్ బిల్లు కూడా అందించినట్లు తెలిపారు. మండలంలో వరి ధాన్యం కొనుగోళ్ళు ఒకటి, రెండుచోట్ల మిగతా వన్ని పూర్తి అయ్యాయన్నారు. జూన్ 2న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఈయన వెంట డిప్యూటీ తహశీల్దార్ నీలిమ, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## భద్రత కరువైన బడులు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ప్రభుత్వ పాఠశాలలంటేనే ఎవరికి బాధ్యత లేని విధంగా వ్యవహరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఎవరు బడులకు వెళ్లారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలోనూ రాత్రి పగలు భద్రత కరువై అసాంఘీక కార్యక్రమాలు ఆటలు తదితర వంటివి చేపట్టడానికి అవకాశం గా మారింది. ప్రభుత్వము విద్యాభివృద్ధి కోసం కోట్ల రూపాయలు ఖర్చులు చేస్తున్న పాఠశాల భద్రత కోసం వాచ్‌మెన్ కూడా ఏర్పాటు చేయాలని దుస్థితిలో ప్రభుత్వాలు కొనసాగుతున్నారు. ఫర్నిచర్ పాఠశాలను చెట్లను కొట్టడం మద్యం సీసాలు పారవేయడం తదితర జంతువులు సంతరించడం ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం స్థానికుల పైన ఉన్న రెండు అలాగనే నిర్లక్ష్యం వివరించడం వల్ల భద్రత లేని దుస్థితిని ఏర్పడింది. ఉండవెల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలలు 12 ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 2024 2025 సంవత్సరంలో 2160 మంది విద్యార్థులు విద్యాభ్యాసం అభ్యసించినట్లు అధికారులు వెల్లడించారు. పాఠశాలలో ప్రహరీ గోడలు లేకపోవడంతో పశువులు గొర్రెలు సంచారిస్తూ బడుల్లోనే మందు సేవించడం తదితర వంటి కార్యక్రమం నిర్వహించడం అన్నవైతేగా వస్తుంది. వాచ్‌మెన్లు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో అపరిశుభ్రతకు దారితీస్తుంది. పాత గోడలు శిథిలావస్థకు చేరిన పాఠశాలలు పడిపోవడానికి కారణం ప్రధానం. పాఠశాలలో దుర్వాసన అపరిశుభ్రత చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే ప్రగటూరు బైరాపురం బస్వాపురం పాఠశాలలో ప్రహరీ గోడలు లేవు. కంచుపాడు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరకడం వంటి చోటు చేసుకున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

# తాగు, సాగు నీటి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ మండల 7వమహాసభను సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక లిటిల్ ఏంజిల్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహాసభలో పాల్గొని ప్రసంగించారు. గత పాలకుల నిర్లక్ష్య మూలంగా , బి వెల్లెంల ప్రాజెక్టు ,ఎస్ ఎల్ బిసి సోరంగం , ధర్మారెడ్డి పిల్లాయి కాలువ పూర్తికి నోచుకోలేక పోయాయని ఆయన విమర్శించారు. బి వెల్లెంల ప్రాజెక్టు కాలువల పూర్తికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్తో శాంతి చర్చలు జరుపుతూ , దేశ పౌరులైన నక్సలేట్లతో చర్చలు జరుపకుండా ఎన్కౌంటర్‌ల పేరుతో హత్య చేయండం తగదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక , రాజకీయ , ఆర్థిక కోణంతో శాంతి చర్చలు జరపాలని డిమండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణల విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ , అంబానీలకు కట్టబెట్టడం జర్గుతుందని ఆయన పేర్కోన్నారు. సామాన్యుల వాడే ప్రతి వస్తువు పైన జిఎస్టి పేరుతో ప్రజలను దోపిడి చేస్తూ పరిపాలన చేయడం సిగ్గుచేటు అని ఆయన విమర్శించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నార్కట్‌పల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అక్కెనపల్లి నుండి ఆకారం వరకు ఆసిఫ్ నహర్ కాల్వ పూర్తికి నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, బికేఎం యు నియోజకవర్గ అధ్యక్షులు వెంపటి శ్రీనివాస్ , మండల సహాయ కార్యదర్శి వంగాల నాగయ్య, అలకుంట్ల నరసింహ, సిలువేరు వెంకట్‌రాములు, ఏరుగు యోగేంద్ర రెడ్డి , గోపాల్‌రెడ్డి, బోడ మల్లేష్, తోడుసు సైదులు, సంగిశెట్టి రానమ్మ, పెండ్యాల పద్మ, మంటిపల్లి సైదమ్మ, వస్కూల లక్ష్మి తదితరులు పాల్గోన్నారు.

## భూసేకరణను పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్. శుక్రవారం ధరూర్ మండలంలోని చింతరేవుల గ్రామాన్ని సందర్శించి జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించిన భూ సేకరణ వివరాలు, లే అవుట్ మ్యాప్, పెగ్ మార్కింగ్ చేసిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ , జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణ సర్వే పనులకు విధుల కొరత లేకపోవడంతో, ఏ విధమైన ఆలస్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఎంత మేర భూమి పై సర్వే జరుగుతోంది, ఎన్ని ఎకరాలు పూర్తయ్యాయి అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని అన్నారు. సర్వే, పెగ్ మార్కింగ్ పనులను ఒకేసారి జరపుతూ, రైతులను చైతన్యపరచి వారి సహకారంతో భూ సేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే ల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, నీటి పారుదల శాఖ ఎస్.ఈ. రహీముద్దీన్, ఆర్డీవో శ్రీనివాస రావు, ధరూర్ తహసీల్దార్ భూపాల్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## అన్ని ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/భువనగిరి:** మావోయిస్టు నాయకులు కేశవరావు ఎన్కౌంటర్‌తో పాటు జరిగిన అన్ని ఎన్కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామచంద్రయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి యాదయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎశాల అశోక్ అన్నారు. ఎన్కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై అత్యా నేరము నమోదు చేయాలనీ, సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, ఆపరేషన్ నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక భువనగిరి ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అనారోగ్యంతో ఉండగా ఒరిస్సా రాష్ట్రంలో పట్టుకొని చత్తీస్గడ్ దండకారణంలోని అంబుజమాడు అడవులలో హత్య చేసి ఎన్కౌంటర్ కట్టుకథలు అల్లుతున్నారన్నారు. కామ్రేడ్ కేశవరావు అలియస్ బసవరాజుది నిజమైన ఎన్కౌంటర్‌గా నమ్మించెందుకు అమాయకులైన మరో 24 మంది ఆదివాసులను హత్య చేసి భారీ ఎన్కౌంటర్‌గా చిత్రీకరిస్తూ ప్రజలను నమ్మబల్కుతున్నారన్నారు. దేశంలోని పౌర సమాజమంతా ఒకవైపు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తుంటే మరోపక్క సరిహద్దులోని ప్రజలను పర్యాటక ప్రజల ప్రాణాలను ఉగ్రవాదులకు బలిస్తూ సరిహద్దులోని సైన్యాన్ని మధ్య భారత దేశంలో మోహరించి ఆ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టనీకి స్థానిక ఆదివాసి ప్రజలను అక్కడి నుండి తరిమి వేస్తున్నరాని చెప్పారు. ఈ కార్యక్రమంలో థథమండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ అధ్యక్షులు కాశపాక మహేష్, ప్రధాన కార్యదర్శి రాసాల నరసింహ్మ, తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షులు మచ్చ ఉపేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యులు రాసాల బాలస్వామి, చిక్కుల కర్ణాకర్, నరాల బాలకృష్ణ, చొప్పరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాల సారథి సిపిఐ

సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రజా పోరాటాల సారథి సిపిఐ అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రాజీవ్‌నగర్ 22వ వార్డు కమిటీ సమావేశంలో వాడపల్లి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహాసభల ద్వారా సిపిఐ పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న ఆదివారం కామ్రేడ్ ధర్మబిక్షం భవన్ సిపిఐ ఆఫీస్ నందు పట్టణ 4వ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రాజీవ్‌నగర్‌లోని 22వార్డు కమిటిని 16 మంది సభ్యులతో నూతన కమిటిని ఎన్నుకున్నారు. రెండవసారి కార్యదర్శిగా పెంద్ర కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, పెంద్ర కృష్ణ, వాడపల్లి గోపి, వెంకన్న, నవీన్, బూర మురళి, పెంద్రాల వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రోత్సాహం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ:**ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం పట్ల జిల్లా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలే కాకుండా, కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు సాగు చేయడం, ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, వ్యవసాయ అధికారులతో రానున్న వానకాలం వ్యవసాయ సాగు సంసిద్ధతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్ళించాలని, ముఖ్యంగా కంది, కూరగాయలు, పండ్ల తోటలు, అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటలవైపు వారిని మళ్లించాలని తెలిపారు. ఈసదస్సులోపద్మా రెడ్డి అంజిరెడ్డి, వెంకటేష్, రైతు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి ,శ్రీనివాసరావు, తదితరులు నూతన పద్ధతిలో పండిస్తున్న ఉద్యాన, కూరగాయల సాగు, పామాయిల్ తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయం, లాభాలు, దిగుబడులు వివరించారు.

**రోగులను ప్రైవేటుకు రెఫర్ చేస్తే కఠిన చర్యలు మిర్యాలగూడ శిరీష హాస్పిటల్‌పై మెజిస్టేరియల్ విచారణకు ఆదేశం. జిల్లా కలెక్టర్**

గత డిసెంబర్‌లో కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చిన దామరచర్ల మండలం, జైత్రం తండాకు చెందిన అడావత్ రాజేశ్వరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం సరిగా లేనప్పటికీ సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడంలో నిర్లక్ష్యం వహించి రాజేశ్వరి మృతికి కారణమైన మిర్యాలగూడ శిరీష ఆస్పత్రి పై మెజిస్ట్రీరియల్ విచారణతో పాటు, శాఖా పరమైన విచారణకు ఆదేశిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఈ కేసు విచారణకు రాగా వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి సంఘటనలు జిల్లాలో పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ , డిసిహెచ్ సిడిపిఓలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో మార్పు తేవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బాలు నాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం నుంచి మంజూరు అయిన 271మంది లబ్ధిదారులకు రూ.1,07,63,250 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులు అర్హులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తోందని అన్నారు.సీఎం సహాయ నిధి లాంటి పథకాలు ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు భరోసా ఇస్తున్నాయని పేర్కొన్నారు.దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారునికిఈ పథకాల ద్వారా లాభాలు చేరేలా నిత్యం కృషి చేసి,ప్రజల సంతోషమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ విద్య ద్వారా భవిష్యత్**

ఉత్తమ విద్య ద్వారానే విద్యార్థుల కు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కఠినమైన అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థుల కు సులభతరంగా బోధించే విధముగా మెళకువలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రామావత్ నాగేశ్వర్ రావు,శిక్షణ మండల స్థాయి రిసోర్స్ పర్సన్స్ వి.రమేష్, శశిధర్, వెంకట్‌రెడ్డి, సతీష్, దేవులయ్య, ఏ.అంజయ్య, రవి కుమార్, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిమ్ సేవలను యువత సద్వినియోగం

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/బొమ్మలరామారం:** మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న జిమ్ ఫిట్నెస్ సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు. శుక్రవారం బొమ్మలరామారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఫిట్నెస్ జిమ్‌లు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం యువతకు గొప్ప అవకాశం అని ఇలాంటి ఫిట్నెస్ జిమ్‌లు యువత శరీర దారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయని వారిలో ఉన్న వ్యాయామ కళా నైపుణ్యాన్ని బయటికి తీస్తాయని ఆయన అన్నారు. ఫిట్నెస్ జిమ్‌ల ద్వారా యువత పెడదారిన పడకుండా కూడా ఉపయోగపడతాయని యువత ఆరోగ్యం, ఆహ్లాదకరంగా ఉంటుందని ఆయన అన్నారు. మంచి ఉద్దేశంతో ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు ఎలబోయిన హరిశంకర్ ఏలబోయిన సాయిలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎలైట్ ఫిట్నెస్ జిమ్‌ను ప్రారంభించడానికి వచ్చిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఎలైట్ ఫిట్నెస్ జిమ్ కుటుంబ సభ్యులు ఎలబోయిన బిక్షపతి రాములమ్మ, ఎలబోయిన జంగయ్య లావణ్య, ఎలబోయిన నరేష్‌లు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే 'పిడి'యాక్ట్ తప్పదు

జిల్లా ఎస్పి కె.నర్సింహ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారులపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కె.నర్సింహ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విత్తనాల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీల లేబుళ్లను తనిఖీ చేసి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విడిగా విత్తనాలు కొనుగోలు చేయడం ప్రమాదకరమని చెప్పారు. మధ్యవర్తులను నమ్మవద్దని, గుర్తింపు పొందిన దుకాణదారుల నుండి విత్తనాలు కొనుగోలు సదరు దుకాణదారుల నుండి కొనుగోలు చేసిన విత్తనాల బిల్లును పొందలన్నారు. తక్కువ ధరలకు విత్తనాలు వస్తున్నాయని ఎవరైనా ఆశ చూపి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తే రైతులు మోసపోవద్దని అన్నారు. విత్తన దుకాణాలపై తనిఖీలు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల గురించి అనుమానిత బ్రోకర్లు, తమ డీలర్ల గురించి సమాచారం తెలిసిన వారు వ్యవసాయశాఖ అధికారులకు, తమ దృష్టికి తేవాలన్నారు.

## గ్రామ పాలన అధికారి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి:** గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. భువనగిరి పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వెనక ఉన్న వెన్నెల కళాశాలలో ఏర్పాట్లు చేసిన్నట్లు పరీక్ష నెల 25న (ఆదివారం) రోజున నిర్వహించనున్న పరీక్షకు 151 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష వ్రాసే వారు పరీక్ష కేంద్రాలకు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాపక్షం/వీపనగండ్ల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుందని మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ , ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని గ్రామాలలో డా. రాజశేఖర్, ఎంపిడిఒ శ్రీనివాసరావుతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా కలుషిత నీటి ద్వారా ప్రబలే వ్యాధులను అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దోమల ద్వారా ప్రబలే వ్యాధులు, డెంగ్యూ, మలేరియా , చికిం గున్య, పైలేరియా , 5 మెదడువాపు వ్యాధులు అరికట్టాలన్నారు. కలుషిత నీటి ద్వారా ప్రబలే వ్యాధులు పసిరికలు, వాంతులు, విరేచనాలు, టైపాయిడ్ మొదలగు అంటూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## వృత్యంతర శిక్షణా కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండలస్థాయి ఉపాధ్యాయ వృత్యంత శిక్షణాకేంద్రానికి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షర్ఫోద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయులద్వారా ఫీడ్‌బ్యాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులలో ఈశిక్షణ ద్వారా మౌలిక భాషా గణిత నైపుణ్యాలు సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రఘునందన్‌శర్మ, సబ్జెక్టురిసోర్సుపర్సన్స్ శివకుమార్, ప్రభాకర్, నజిమా, పర్వీన్, సుబ్బయ్య, రవీందర్‌గౌడ్, నాగేశ్వరరావు, వెంకటేష్, పార్వతి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి

### డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ డిమాండు చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మైనార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలంతా ఏకమై వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా గత నెలలో జరగాల్సిన సభను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈనెల 25వ తేదీన సాయంత్రం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా గత జరిగే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణకు వ్యతిరేకంగా జరిగే సభలో ముఖ్య అతిథులుగా ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షులు ఖాలెద్‌సైపుల్లా, ఎంఐఎం అధినేత, ఎంపీ ఆసదుద్దీన్ ఓవైసీ, కర్ణాటక కు చెందిన సీఎం ఇబ్రహీం ఇతర మతపెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అజ్మత్ అలీ, ఫక్రుద్దీన్ ఖురేషి, ఖాజాపాషా, అంజద్, పీర్ సాదిక్, ఫహీం, తదితరులు ఉన్నారు.

## ఐఎఫ్‌సిలో జడ్చర్ల విద్యార్థికి 25వ ర్యాంకు



ప్రజాపక్షం/జడ్చర్ల : బాదేపల్లి పట్టణానికి చెందిన గోప్లాపూర్ యాదయ్య కుమారుడు, మాదిగ ఉద్యోగ సమాఖ్య సభ్యుడు అయిన గోప్లాపూర్ ప్రశాంత్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (యుపిఎస్‌సి) జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ ఫారెస్టు సర్వీసెస్ (ఐఎఫ్‌సి) 2025 పరీక్షలో 25వ ర్యాంకు సాధించాడు. దేశవ్యాప్తంగా మొత్తం 143 మంది కొలువులకు ఎం పిక కాగా వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 10 నుండి 15 మంది వరకు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఇఎఫ్) తరపున హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం/ మద్దూర్ : కోయిలకొండ మండలం దమ్మాయపల్లి గ్రామానికి చెందిన రామచంద్రయ్య వయసు 42 సంవత్సరాలు మద్దూరులో వెంకటేశ్వ ర డయాగ్నస్టిక్ సెంటర్ నడుపుతూ జీవిస్తూ ఉండేవాడు. అయితే ఇంతకుముందు కోస్గిలో డయాగ్నస్టిక్స్ సెంటర్ పెట్టిన నష్టం వచ్చింది. ప్రస్తుతం మద్దూర్‌లో కూడా డయాగ్నస్టిక్ సెంటర్‌లో కూడా నష్టం రావడం వలన తా ను చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపంతో మద్దూరులో తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని యొక్క తమ్ముడు వరద స త్యం యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టు మార్టం గరించి నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడమైనది. మృతునికి భార్యా, ఇద్దరూ మగ పిల్లలు ఉన్నారు.

## బాల్య వివాహాలు సైబర్‌నేరాలపై అవగాహన



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలకేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి మూడు డివిజన్ 12మండలాలకు సంబంధించి ఐదురోజులపాటు ఆంగ్ల ఉపాధ్యాయులకు వృత్తంతర శిక్షణముగింపు సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సోచట్టం, బాల్య వివాహాలు, సైబర్‌క్రైమ్, ఉమెన్‌ట్రాఫికింగ్ వివిధరకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబుద్దులు నేర్పాలని ఆయన ఉపాధ్యాయులని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. మండలవిద్యాధికారి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు స్కూలుప్రారంభంనుండే విద్యార్థులకు ఆంగ్లంపై మంచి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

## లా కాలేజీ విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్‌డిఎం లా కాలేజీ విద్యార్థులను శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించారు. ఇటీవల విడుదలైన మొదటి సంవత్సరం, మూడవ సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన 22 మంది విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే కలెక్టర్ కార్యాలయంలో వారిని శాలువాలు, మెడల్‌లతో సన్మానించి అభినందించారు. పాలమూరు యూనివర్శిటీ పరిధిలో వచ్చే ఈ లా కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

## పరిసరాల్లో దోమలు ప్రబలకుండా ప్రతి శుక్రవారం 'డ్రై' డే

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ పరిసరాల్లో దోమలు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం వనపర్తి పట్టణంలోని నాగవరం 5, 10వ వార్డులో మున్సిపల్ , వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించిన డ్రై డే .. ఫ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. వర్షపు నీరు కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పడేసిన సీసా మూతలలో నిలిచిన నీటిలో డెంగ్యూ దోమలు గుడ్లు పెట్టి పెరుగుతాయని అందువల్ల ఇళ్లపై కప్పు, పరిసరాల్లో ఎక్కడా నిలువ నీరు ఉండకుండా పాటు శుక్రవారం ప్రజలు వారి ఇళ్లలో నీరు పారబోసి విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్ , ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, డా. పరిమళ , ఆశ వర్కర్లు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ధాన్యం కొనుగోలులో గణనీయమైన వృద్ధి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : ధాన్యం కొనుగోలులో గణనీయమైనవృద్ధి దిశగా ముందుకుపోతున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి, చిన్నముద్దునూరు గ్రామంలోగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ గౌడౌన్ వద్ద గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, తెలకపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షణచేసి తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు జరపడం ట్యాగ్ చేసిన మిల్లులకు తరలిస్తున్న తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వసతులను, ప్రమాణాలను పరిశీలించిన కలెక్టర్ రైతులతో నేరుగామాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో గణనీయమైన వృద్ధి దిశగా ముందుకుపోతున్నట్లు చెప్పారు. అధికవర్షాలను దృష్టిలో పెట్టుకొని గడిచినవారంరోజుల్లో కొనుగోలుకేంద్రాల ద్వారా ధాన్యాన్ని తరలించడానికి లారీలను అదనంగా సమకూర్చుకొని, కొనుగోలు కేంద్రాల ధాన్యం తరలించడానికి అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాలోని మొత్తం 222 ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో వరిధాన్యం సేకరిస్తున్నట్లు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటూ జిల్లాలో ఈవారంలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తిచేస్తామని కలెక్టర్ వివరించారు. కలెక్టర్‌వెంట తెలకపల్లి తహసీల్దార్ జాకీర్‌అలీ, కొనుగోలుకేంద్ర నిర్వాహకులు ఉన్నారు.

### ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణం పరిశీలన

నాగర్‌కర్నూల్ మండల కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం దగ్గరలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ఎంపిడిఒ, మున్సిపల్ కమీషనర్లతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపథకం, అర్హులైన నిరుపేద కుటుంబాలకు పక్కా ఇండ్లనిర్మాణంకోసం ప్రభుత్వం తీసుకున్న సూచనలు నిబంధనలప్రకారం సర్వే, వెరిఫికేషన్‌చేసి అర్హులైనవారిని గుర్తించి చెక్‌లిస్టు ప్రకారం సరిచూసుకోవాలన్నారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకంకింద మంజూరైన ఇళ్లనిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మండలకేంద్రంలో నిర్మితమవుతున్న ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను సందర్శించి, నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వసతులను మెరుగుపర్చాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని గ్రంథాలయ భవనాన్ని తనిఖీచేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కోటేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ నరేష్, లైబ్రేరియన్ పరమేశ్వరి పాల్గొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ స్కూల్‌స్థల పరిశీలన

నాగర్‌కర్నూల్ మండలకేంద్రంలోని తూడుకుర్తి గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సర్వేనెంబర్ 816లోని ప్రభుత్వ భూములను సంబంధించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ , ఎంపిడిఓ, రెవెన్యూ ఇతర సంబంధితశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈక్రమంలో అత్యున్నత ప్రమాణాలతోయంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలో ఒక కీలకముందడుగని, గ్రామీణప్రాంతాల్లో వి ద్యా నాణ్యతను మెరుగుపర్చేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు , భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెరుగైన వసతుల కల్పనకు అవసరమైన అదనపు భూములను కూడాగుర్తించాలని సంబంధితశాఖ అధికారులను దృష్టిలో పెట్టుకొని మెరుగైన వసతులకల్పనకు అవసరమైన అదనపు భూములనుకూడా గుర్తించాలని తెలిపారు.

అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్‌చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, బిసి, ఎస్సి,మైనార్టీ , ట్రైబల్ కార్పొరేషన్ అధికారులతో రాజీవ్‌యువవికాసం పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాజీవ్‌యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని, రాష్ట్రప్రభుత్వం యువత అభివృద్ధి కోసం అమలుచేస్తున్న రాజీవ్‌యువవికాసం పథకం, జిల్లాలో రాజీవ్‌యువవికాసం పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రక్రియ పూర్తి అయినందున రాజీవ్‌యువవికాసం పథకం మం జూరుపత్రాలను జూన్ 2న లబ్దిదారులకు అందజేయడానికి సంబంధిత అధికారులు సమగ్రచర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## డ్రగ్స్, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మిని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ కమిటీ పాఠశాలలు, కళాశాలు, మెడికల్ కాలేజీలలో ఎవరైనా డ్రగ్స్, మత పదార్థాల వినియోగం, రవాణా ఉంటే వారిని గుర్తించాలని. పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కాలేజీలలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గంజాయి సాగు చేయకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నారో నిఘా ఉంచాలని అటవీ శాఖ మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, పాన్‌షాప్ ల పై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పి జానకి, అదనపు ఎస్‌పి. రాములు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన మార్కులు సాధించేలా విద్యా బోధన



ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి : వనపర్తి జిల్లాలో ప్రతి విద్యార్థి పదవ తరగతిలో మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యా బోధన జరగాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి సబ్జెక్టులో ప్రావీణ్యత మెరుగు పర్చుకునేందుకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలకు లెక్కలు సులువుగా అర్థమయ్యే విధంగా ఏ విధంగా బోధించాలి అనే అంశంపై లెక్కల మాస్టర్లకు మరో ఉపాధ్యాయుడు భోదిస్తుండగా కలెక్టర్ సైతం తరగతి గదిలో కూర్చోని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థిని సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలన్నారు. వనపర్తి జిల్లాలో పదవ తరగతిలో మెథమటిక్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారని అందువల్ల మ్యాథమెటిక్ ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యా అధికారి మహ్మద్ ఘనీ, ఉపాధ్యాయులు న్నారు.

## గ్రామ పాలన అధికారుల పరీక్ష పకడ్బందీగా నిర్వహణ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మే 25న చైతన్య హై స్కూల్ (బస్‌స్టాండ్ ప్రక్కన)లో నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు ఆదేశించారు. గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణపై డిప్యూటీ నోడల్ ఆఫీసర్, లైజన్ ఆఫీసర్, సీనియర్ మెస్సెంజర్, చీఫ్ సూపరింటెండెంట్ , ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ గ్రామ పాలన అధికారుల పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపాలన అధికారుల పరీక్ష మే 25న ఆదివారం ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చైతన్య హైస్కూల్, మహబూబ్‌నగర్ నందు జరుగుతుందని, 152 మంది అభ్యర్థులు గ్రామ పాలన అధికారుల పరీక్షను చైతన్య హై స్కూల్, బస్టాండు పక్కన, బాబు జగ్జీవన్ రామ్ నగర్, మహబూబ్‌నగర్‌లో రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు అభ్యర్థులను పరీక్ష హాల్‌కి అనుమతిస్తారని, ఉదయం 10 గంటల తర్వాత అభ్యర్థులకు పరీక్ష హాల్లోకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించబడరని తెలిపారు. అభ్యర్థులు ఇటీవలి పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫోటో గుర్తింపు కోసం పని చేయుచున్న కార్యాలయ అధికారి జారీ చేసిన ఐడెంటిటీ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలి. హాల్ టికెట్ అభ్యర్థి ఫోటో పై సంబంధిత కార్యాలయ అధికారితో సంతకం చేయించుకోవాలని, అభ్యర్థులు మొబైల్, సెల్యులర్ ఫోన్లు టాబ్లెట్లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు వంటి ఎలక్ట్రానిక్ లేదా ఇతర గాడ్జెట్‌లు, మనికట్టు గడియారాలు వాచ్ కాలిక్యూలేటర్లు , వాలెట్లు పర్సులు, నోట్స్‌చార్ట్లు, వదులుగా ఉన్న సీట్లు లేదా రికార్డింగ్ పరికరాలను శరీరానికి లేదా జేబులో కట్టుకుని ఉంచుకునేవి పరీక్ష కేంద్రంలోకి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష హాల్లోకి నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు, హాల్ టికెట్, ఆధార్ కార్డ్ మాత్రమే తీసుకెళ్లాలని తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు ప్రకటిస్తూ అర్బన్ తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఓ నవీన్, మహబూబ్‌నగర్ పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.కె. కృష్ణ, మహబూబ్‌నగర్ రూరల్ తాహసిల్దార్ సుందర్ రాజు, డిప్యూటీ నోడల్ ఆఫీసర్ , ప్రిన్సిపాల్ చైతన్య హై స్కూల్ అనిరుద్ నటరాజన్, చైతన్య హై స్కూల్ చీఫ్ సూపరింటెండెంట్ మహమ్మద్ అహ్మద్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి


### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




ప్రజాపక్షం/ నారాయణపేట్ : శుక్రవారం విసి హాల్లో డిసిసి సమావేశానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వినర్‌గా లీడ్ బ్యాంక్ మేనేజర్ వ్యవహరించారు. ఈ సమావేశంలో వార్షిక ప్రణాళికా సంబంధించిన 2024–25 మార్చి '25 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 2514.18 కోట్లతో వృద్ధి. ఇది వార్షిక ప్రణాళికలో 76.93 శాతం, మే సెగ్మెంట్ సంబంధించి 153.92 కోట్లతో 61.04 శాతం ప్రగతి, ప్రదాన్యత రంగానికి 2070 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందని ఎల్‌డిఎం పేర్కొన్నారు. ఈ సమావేశలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎమ్మెస్ ఎంఇ రంగాలకు త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి నారాయణపేట జిల్లా అభివృద్ధికి తోడ్పడలని బ్యాంకులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్బిఐ నుండి ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ నుండి డిడిఎం షణ్ముఖ చారి, ఎస్‌పిఐ ఏజీఎం రామూర్తి, టిజిబి రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, యుబిఐ నుండి శ్రీనివాస మూర్తి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు , జిల్లా అధికారులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించి తగు నిర్ణయలు తీసుకున్నారని ఎల్‌డిఎం విజయ్ కుమార్ తెలిపారు. వార్షిక ఋణ ప్రణాళికా 202526 గాను 4204.49 కోట్ల ఋణ లక్ష్యంతో ఎసిపి 2025–26 పుస్తక ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జరిగింది. రాజీవ్ యువ వికాసం ఫ్లాగ్షిప్ ప్రోగ్రాం ఉన్నందున బ్యాంక్ వాళ్ళు సహకరించలని కోరిన కలెక్టర్ సానుకూలంగా స్పందించిన అధికారులు.

## రైతులు ముందస్తుగానే మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి

ప్రజాపక్షం/బిజినేపల్లి : విత్తనాల మొలకశాతాన్ని ముందస్తుగానే పరీక్షించుకోవాలని డాక్టర్ టి.అర్చన అన్నారు. రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలోభాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలుచేసిన తర్వాత నేరుగా వ్యవసాయ పొలాల్లో నాటకుండా ముందస్తు జాగ్రత్తగా విత్తనాలనుకొని విత్తనాలు రాత్రి సమయంలో నానబెట్టి మొలకశాతాన్ని పరీక్షించుకోవాలని రైతన్నలకు సూచించారు. ఇటీవల కొత్తకొత్త కంపెనీల మొలకెత్తని నకిలివిత్తనాలు మార్కెట్లోకితె చ్చి అమాయక రైతన్నలకి అ మ్మిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అమాయక రైతులను ఆకర్షించడానికి నకిలీ విత్తనాలను తక్కువధరకు అమ్ముతూ త్వరగా పంటచేతికి వ స్తాయని దిగుబడితోపాటు నాణ్యతకూడా వస్తుంద ని చెప్పి మోసం చేస్తున్నారని రైతులకు తెలిపారు. రైతులు లైసెన్స్ డీలర్లదగ్గరమాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని తెలియజేశారు. పంటమార్పిడితో అనేక ప్రయోజనాలతోపాటు నేల సారవంతాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం మాజీ ఎంపిటిసి సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ తమ నేలలకు ఎలాంటి రకాల పంటలుసాగు చేయాలో శాస్త్రవేత్తలు తెలియజేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సకాలంలో తమకు సలహాలు సూచనలు అందించాలని కోరారు. అనంతరం బిఎస్‌సి కళాశాల విద్యార్థులు విత్తనశుద్ధి రసాయన ఎరువులమోతాదుపై రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, వెటర్నరీ అసిస్టెంట్‌డాక్టర్ అశోక్, ఏఓరాజు, ఏఈవో హీనాఫిర్‌దాస్, పిఎసిఎస్‌డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మాజీసర్పంచ్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, కళాశాల విద్యార్థులు, ఆదర్శరైతులు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డ్ గోదాంలో ధాన్యం నిలువ



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల పరిధిలోని గ్రామాలలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మండల కేంద్రానికి సమీపంలోని మార్కెట్ యార్డ్ గోదాంలో నిలువ చేస్తున్నట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. గత కొన్ని రోజులుగా అధికారులు నిర్దేశించిన రైస్ మిల్లర్లకు గోదాంలకు మండలంలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత ఉండటంతో కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్దని నిలువ చేసి ఉంచారు. అంతేకాక ధాన్యపు బస్తాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కూడా సరిగ్గా నిర్వాహకులు చేపట్టలేకపోయారు. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల కేంద్రానికి సమీపంలోని మార్కెట్ యార్డ్ గోదాంను జిల్లా పౌర సరఫరాల సంస్థ డిఎం జగన్మోహన్‌తో కలిసి పరిశీలించారు. గోదాం ఖాళీగా ఉండటంతో మండలంలో కొనుగోలు చేసే వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాంలోకి తరలించి నిల్వ ఉంచాలని పౌర సరఫరాల అధికారి జగన్మోహన్‌కు వివరించారు. శుక్రవారం ఉదయం లోగా గోదాంను తెరిపించి శుభ్రం చేయించాలని, ధాన్యం దించడానికి వచ్చే కూలీలకు ఉండటానికి కావాల్సిన వసతి గదిని కూడా శుభ్రం చేయించాలని తహసీల్దార్ వరలక్ష్మి సూచించడంతో పనులను పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్ఐ కురుమూర్తి, ఏపిఎం బుచ్చన్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రాము, బుక్ కీపర్ రవి ఉన్నారు.


## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు

ప్రజాపక్షం/పాన్‌గల్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ల క్ష్యంతోనే రైతులకు కష్టాలు తప్పడం లేదని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పెబ్బేటి వీరసాగర్ అన్నారు. రైతులు ఆరు కాలం కష్టించి పంటలను పండిస్తే ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిరక్ష్యం కారణంగా కేంద్రాల వద్ద రైతులకు కొనుగోలు చేయక పోవడంతో నిరీక్షణ తప్పడం లేదన్నారు. రెండు నెలలు అయిన ధాన్యంను కొనుగోలు చెయకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు రైతుల కష్టాలు తెలియడం లేదా అని ప్రజా రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు.

## సైబర్ నేరాలకు గురైతే '1930' టోల్ ఫ్రీ నెంబర్ గుర్తుకు రావాలి

### హెడ్ కానిస్టేబుల్ నారాయణ

ప్రజాపక్షం/ నారాయణపేట్ : జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాగళ్ళ పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాగే వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ సావర్కర్ చౌరస్తాలో నారాయణపేట పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని వాట్సాప్, ఫేస్బుక్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, తక్కువ ధరకే ఆన్లైన్లో వస్తువులు దొరుకుతున్నాయని చాలామంది తెలియకుండా డబ్బులు పంపించడం జరుగుతుంది. అన్లైన్ రుణ యాప్స్ నుండి డౌన్లోడ్ చేసుకుని లోన్స్ తీసుకోవడం వలన వాళ్లు పెట్టే బాధలకు భరించలేక చాలా మంది చనిపోవడం జరుగుతుందని, చైన్ మార్కెటింగ్‌కి దూరంగా ఉండాలని, సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ ఉండరాదని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండి తోటి వారికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాలు నుండి మోసపోతే వెంటనే 1930,100 డయల్‌కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు, వాహనదారులు రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు, ట్రాఫిక్ పోలీసులు, మొదలగు వారు పాల్గొన్నారు.



# ఫోకస్ సైన్స్

## శక్తివంతమైన నూతన వాహనం



చంద్రయాన్ 5 మిషన్ కోసం జిఎస్ఎల్వి ఎంకె III లేదా దీని కోసమే ప్రత్యేకంగా నిర్మించబోయే అత్యంత శక్తివంతమైన ప్రయోగ వాహనాన్ని వాడే అవకాశం ఉంది. అప్పుడే అధిక బరువు కలిగిన పరికరాలను మోసుకెళ్లడం సాధ్యమవుతుంది. చంద్రుడిపై ల్యాండింగ్, నమూనాలు సేకరణ, తిరిగి పంపడం వంటి ప్రక్రియల కోసం ల్యాండర్, రోవర్‌తోపాటు రిటర్న్ క్యాప్సుల్‌ను కూడా ప్రత్యేకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. చంద్రుని దూర ప్రాంతాలతో భూమి మధ్య అనుసంధానాన్ని మెరుగుపరిచే అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలను ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందిస్తారు. పరికరాల మార్పిడి, సమాచార పంపిణీ వంటి అంశాలపై నాసా సహకారాన్ని ఇస్రో తీసుకుంటుంది. ఈ కారణంగానే చంద్రయాన్ 5న 'ఇస్రో నాసా' సంయుక్త మిషన్‌గా పేర్కొంటున్నారు. అయితే, నాసాతోపాటు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ)తో కూడా ఇస్రో భాగస్వామ్యాన్ని కొనసాగించనుంది. డీప్ స్పేస్ నెట్‌వర్క్ కమ్యూనికేషన్‌లో సహకారం.. పరికరాల అభివృద్ధిలో భాగస్వామ్యం వంటి అంశాల్లో ఇఎస్ఎ సహకారం తీసుకుంటుంది. జపాన్‌కు చెందిన జెఎఎక్స్ఎ నుంచి డ్రిల్లింగ్ టెక్నాలజీ, రిటర్న్ మిషన్ టెక్నాలజీ, రొస్కోమోస్ (రష్యా)తో శాంపిల్ రిటర్న్ క్యాప్సుల్ తయారీ వంటి విభాగాల్లో ఇస్రో కలిసి పని చేస్తుంది.

# ఆసక్తి రేపుతున్న 'చంద్రయాన్- 5'

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశ పౌరుల ఆశయాలకు అద్దం పట్టే విధంగా చంద్ర మిషన్లలో అద్భుత విజయాలు సాధిస్తూ వస్తోంది. చంద్రయాన్1 నుండి చంద్రయాన్3 వరకు జరిగిన ప్రయోగాలు భారత అంతరిక్ష రంగాన్ని మానవాళి ముందు మరింత భద్రమైన స్థానానికి చేర్చాయి. ప్రస్తుతం ఇస్రో చంద్రయాన్4, 5 వంటి తదుపరి మిషన్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ క్రమంలో చంద్రయాన్ 5 అనే మిషన్ భారత అంతరిక్ష యాత్రలో అత్యంత ఆశాజనకమైన, కీలకమైన ఘట్టంగా పేర్కొంటున్నారు. చంద్రయాన్ 1 (2008) అనేది చంద్రుడిపై నీటి ఆనవాళ్లను గుర్తించిన మొదటి భారతీయ మిషన్. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' సహకారంతో 'మూన్.. మినరాలజీ.. మ్యాపర్' (ఎం3) ప్రయోగాన్ని నిర్వహించింది. 2019లో చేపట్టిన చంద్రయాన్ 2 ఆర్బిటర్ విజయవంతంగా పనిచేస్తున్నా, ల్యాండర్ విఫలమైంది. ఈ ఉపగ్రహం చంద్రుడి పైభాగాన్ని నిఘా చేస్తూ విలువైన సమాచారం అందిస్తోంది. 2023లో ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 విజయవంతమైన సాఫ్ట్ ల్యాండింగ్‌తో చరిత్ర సృష్టించింది. ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ చంద్రుడిపై అనేక పరిశోధనలు చేపట్టాయి. ఈ ప్రణాళికలతో చంద్రయాన్5పై అంచనాలు అధికంగా పెరిగాయి. ఈ మిషన్ ద్వారా చంద్రుడిపై మట్టి, రాళ్ల నమూనాలను సేకరించి భూమికి తీసుకురావాలనే లక్ష్యం ఇస్రో ముందుంచినట్లు తెలుస్తోంది. అదే జరిగితే, ఇది భారతదేశపు తొలి 'శాంపిల్ రిటర్న్ మిషన్' అవుతుంది. చంద్రుడి ఉపరితలంలోని లోతైన పొరల్లో ఉండే ఖనిజాలు, నీటి నిల్వలను గుర్తించడం ఈ మిషన్ లక్ష్యం. అదే విధంగా చంద్రుడిపై భూకంపాలు, భౌగోళిక చలనాలు ఎలా వుంటాయో తెలుసుకోవడం కూడా కీలకమే. ఇస్రో ప్రణాళికలో గగన్‌యాన్ (మానవ అంతరిక్ష యాత్ర) మిషన్ ఉన్నందున, చంద్రుడిపై మానవులు వెళ్లేందుకు అవసరమైన సమాచారాన్ని చంద్రయాన్ 5 అందిస్తుందని అంచనా. చంద్రుడిపై ఉన్న కఠినమైన వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి, భవి ష్య మానవ వాసస్థలాల భద్రతను అంచనా వేయడం. ఈ మిషన్ కోసం కొన్ని శాస్త్రీయ పరికరాలను సిద్ధం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యమైనది 'లూనార్ డ్రిల్ మెషిన్' ఇతి చంద్రుడి లోతుల్లో నుండి మట్టిని సేకరించే బోర్లింగ్ పరికరం. ఉష్ణోగ్రత మార్పుల అధ్యయనం కోసం 'థర్మల్ ఇమేజర్'ను తయారు చేస్తారు. చంద్రుడి రసాయనిక సమ్మేళనాలను గుర్తించేందుకు ఎక్స్‌రే, ఐఆర్ స్పెక్ట్రమీ మీటర్లను అభివృద్ధి చేయనున్నారు. భూకంపాల మాదిరిగా చంద్రునిపై ఏమైనా ప్రకంపనలు ఉంటే గుర్తించేందుకు వీలుగా స్మిస్మోగ్రాఫ్ పరికరాన్ని సిద్ధం చేస్తారు. సేకరించిన నమూనాలను భూమికి తీసుకురావడానికి ప్రత్యేకంగా రూపొందించి 'రిటర్న్ క్యాప్సుల్' ఉంటుంది. చంద్రమండలానికి మనిషిని పంపే ప్రయత్నం చేస్తున్న ఇస్రోకు, చంద్రయాన్ 5 ఫలితాలు కీలకమని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే ఈ మిషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



## లక్ష్యాలు.. సవాళ్లు

చంద్రుడిపై మొదటి భారతీయ నమూనా తిరిగి రప్పించాలన్నది ఇస్రో లక్ష్యం. ఇది భవిష్య మానవ మిషన్లకు దారి చూపే పరిజ్ఞానంగా ఉపయోగపడాలని కోరుకుంటున్నది. అంతేగాక, ప్రపంచంలోని ఇతర చంద్రయాన్ మిషన్లకు పోటీగా నిలబడాలన్నది ఇస్రో ధ్యేయం. అయితే, లక్ష్యాలకు తగినట్టుగానే సవాళ్లు కూడా అనేకం ఉన్నాయి. చంద్రుడి పైనుంచి నమూనాలు సేకరించడం అంత తేలిక కాదు. భద్రంగా తిరిగి భూమికి తీసుకురావడంలో సాంకేతిక ప్రతిబంధకాలు ఉత్పన్నమవుతాయి. కమ్యూనికేషన్ లోపాలు తలెత్తవచ్చు. ల్యాండింగ్‌లో ఖచ్చితత అత్యవసరం. అదే విధంగా బడ్జెట్ పరిమితులు తప్పకపోవచ్చు. ఈ మిషన్‌కు అనుకున్నంత బడ్జెట్ ఉంటుందా? అనేది ప్రశ్న. ఇలాంటి సవాళ్లను అధిగమించి, ఇస్రో తన లక్ష్యాలను చేరుకోవాలని ఆశిద్దాం.



## ప్రయోగం ఎప్పుడు?

చంద్రయాన్ 5 ప్రయోగం ఎప్పుడనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఇస్రో ఇప్పుడు చంద్రయాన్ 4కు ఇస్రో సమాయత్తమవుతున్నది. ఇది ఈఏడాది చివరిలో లేదా 2026 ప్రారంభంలో జరిగే అవకాశం ఉంది. అనంతరం చంద్రయాన్ 5 ఉంటుంది. అంటే ఈ మిషన్‌ను 2027 లేదా 2028లో నిర్వహిస్తారు. ముందస్తు పరిశోధనలు, నమూనాల తయారీ, అంతర్జాతీయ సహకారాన్ని దృష్టిలో ఉంచుకుంటే దీని ప్రయోగానికి కనీసం 2-3 సంవత్సరాల సమయం అవసరం. ఇస్రోకు దాదాపుగా ఈ అనుభవం ఉంది కాబట్టి, చంద్రయాన్ 5కి రంగం సిద్ధం చేసుకుంటున్నది.

# అగ్నిపర్వత గాజు 'అబ్సిడియన్'



చాలా మంది అబ్సిడియన్‌ను వజ్రంగా లేదా వైఢూర్యంగా భ్రమపడతారు. కానీ, ఇది నిజానికి అగ్నిపర్వతం గాజు. సహజసిద్ధంగా తయారైన వొల్కానిక్ గ్లాస్. మాగ్మా వేగంగా చల్లబడినప్పుడు ఇది నలుపు, బూడిద రంగు, ఎర్రటి నలుపు, కొన్నిసార్లు గ్రీన్ షేడ్స్ తదితర రంగుల్లో ఉంటుంది. పాలిష్ చేసినట్టు నిగనిగలాడుతూ, అద్దంలా మెరుస్తుంది. దీనికి పదును చాలా ఎక్కువ. గాజు మాదిరిగానే చర్మం లోతుల్లోకి కోసుకుపోతుంది. ఏర్పడుతుంది. పురాతన కాలంలో ఆయుధాలు, కోసే పనికిరిగే సాధనాలు తయారీలో అబ్సిడియన్‌ను ఉపయోగించేవారు. పదును ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆధునిక శస్త్రచికిత్సలో నిపుణులు కొన్ని సర్జికల్ బ్లేడ్‌లలో దీనిని ఉపయోగిస్తున్నారు. అదే విధంగా ఆభరణాల తయారీలో, జియాలజికల్ అధ్యయనాలలో కూడా అబ్సిడియన్ ఉపయోగపడుతున్నది.

# కృత్రిమ రక్తం సాధ్యమే.. కానీ...



జంతుజాలం జీవించడానికి అత్యంత కీలకమైన రక్తాన్ని కృత్రిమంగా సృష్టించాలనే ఆలోచన ఈనాటిది కాదు. దీనిపై కొన్ని దశాబ్దాలుగా ప్రయోగాలు జరుగుతున్నాయి. తాజా పరిశీలనలు కృత్రి రక్తం సిద్ధం చేయడం సాధ్యమేనని అంటున్నాయి. అయితే, ఇది పూర్తిగా సహజ రక్తాన్ని ప్రత్యామ్నాయంగా మార్చే స్థాయికి ఇంకా రాలేదు. అయినప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో లేదా రక్తదానం అందుబాటులో లేనప్పుడు ఉపయోగించే కృత్రిమ రక్తానికి సంబంధించి పరిశోధనలు పురోగతిలో ఉన్నాయి. ఆక్సిజన్‌ను శరీరంలోని కణాలకు రవాణా చేయడం. శరీరంలోని కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించడం, రక్తం లేని పరిస్థితుల్లో తాత్కాలిక పరిష్కారం అందించడం అనేవి కృత్రిమ రక్తం లక్ష్యాలు. కృత్రిమ రక్తాల్లో రెండు ప్రధాన నమూనాలు ఉన్నాయి. మొదటిని హిమోగ్లోబిన్ ఆధారిత ఆక్సిజన్ క్యారియర్స్ (హెచ్‌బిఒసి). ఈ విధానంలో, శరీరంలో ఉండే హిమోగ్లోబిన్‌ను తీసుకొని సాంకేతికంగా మారుస్తారు. ఈ రక్తాన్ని వెంటనే ఉపయోగించవచ్చు. రక్త సమూహంతో ఎలాంటి సంబంధం లేదు. అం, ఏ నమూనా రక్తానికైనా ప్రత్యామ్నాయంగా దీనిని వాడువచ్చు. అయితే, కొంతమేర టాక్సిక్ కావడం, ఎఫెక్టివ్ కాలం తక్కువగా ఉండటం అనే సమస్యలు ఎదుర్కొంటున్నది. కాగా, కృతిమ రక్తంలో రెండవది పర్‌ఫ్లూరోకార్బన్ ఆధారిత ఎమ్యూల్షన్స్ (పిఎఫ్‌సి). ఇది ఆక్సిజన్‌ను కరగదలచే ద్రవ రూపంలో ఉండే రసాయనాలు.చిన్న పరిమాణంలో ఎక్కువ ఆక్సిజన్ మోసుకెళ్లగలగడం దీని ప్రత్యేకత. కాగా, శరీరానికి కొంతవరకూ అనుకూలత లోపించవచ్చు. మొత్తం మీద కొన్ని కృత్రిమ రక్త ఉత్పత్తులు క్లినికల్ ట్రయల్స్‌లో ఉన్నాయి. సైనిక అవసరాలు, అత్యవసర కిట్లు, రక్తం డొనర్ లభ్యత లేని చోట్ల ఈ కృత్రిమ రక్త ప్రయోగాలు చేస్తున్నారు.

## 'ఆపరేషన్ కగార్' నిలిపివేసి శాంతి చర్చలకు పిలవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులను శాంతిచర్చలకు పిలవాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకూ ప్రజల్లో వామపక్ష భావాజాలంపై వస్తున్న ఆదరణతో ఎప్పటికైనా మతతత్వ పార్టీ బిజెపికి ముప్పనే కుట్రతోనే మావోయిస్టులతో చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు చేసి ఎన్‌కౌంటర్లకు పూనుకుంటున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే మావోయిస్టులపై మిలిటరీ దాడులు ఆపి మూడు దఫాలుగా వారు కోరుతునక్నట్లుగా శాంతి చర్చలకు పిలవాలని ఆయ న పేర్కొన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడపాలనే కుట్రతోనే కేంద్రలోని బిజెపి ప్రభుత్వం ఆధునిక ఆయుధాలతో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు అగ్రనాయకులను టార్గెట్ చేసి హతమార్చడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మావోయిస్టులు లొంగిపోతే రివార్డులు ప్రకటిస్తామని చెప్పుతున్న కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు ఆయుధాలను ప్రక్కన పెట్టి శాంతి చర్చలకు తాము సిద్ధమేనని చెప్పారంటే వారు లొంగిపోయినట్లు కాదా అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టుల పంథా దేశంలో శాంతి భద్రత ల సమస్య ఏమాత్రం కాదని, దాన్ని సామాజిక ఆర్థిక అంశంగా పరిగణించాలని, మావోయిస్టులు ప్రకటించిన విధంగా శాంతి చర్చలు జరిపేందుకు కేంద్రం ఆహ్వానించాలని విజయసారథి డిమాండ్ చేశారు. వామపక్ష భావాజాలాన్ని అణిచివేయాలని చూస్తే బిజెపి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్


ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్




ప్రజాపక్షం/ఆదిలాబాద్ : కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ పాల్గొని మాట్లాడారు. భారత స్వాతంత్రానికి ముందు, తర్వాత పోరాడి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను యదావిధిగా కొనసాగిస్తూ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. 2016లో సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనంగా రూ.32 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సర్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటిసి అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షకార్యదర్శులు మున్సిపల్ యూనియన్ మంతెన కాంతారావు, మెరుగు చిరంజీవి, కోశాధికారి సురేష్, జిల్లా నాయకులు అశోక్, లక్ష్మి, శాంత, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ కార్యదర్శి ఎండి ఖాసీం, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సలీం, కోశాధికారి జమీల్, నాయకుడు మోసిన్‌లు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కూనంనేని ● రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజా సంక్షేమం, గ్రామాలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీల్లో రూ.2.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరి దరకి చేర్చడమే తమ లక్ష్యమన్నారు. సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాటుపడుతన్నటు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో, బస్తీల్లో పక్కా రహదార్లు, డ్రైనేజీలు నిర్మిణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వివిధ పథకాలు గ్రాంట్లు ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు సంబంధించి నిధుల మంజూరీ కోసం ప్రతిపానలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం లబ్దిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, పేదలకు న్యాయం జరిగేలా అధికారులు ముందువరుసలో నిలవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ భాస్కర్‌రెడ్డి, పిఆర్ డిఇ రామకృష్ణ, ఇరిగేషన్ డిఇ రాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు కనగాల అనంత రాములు, సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, వీరమోహన్రావు, గిరి, రాంబాబు,వెంకట్రావు, జకరయ్య, అప్పారావు, రింజిత్, మధు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్ ధ్వజం



ప్రజాపక్షం/హనుమ-కొండ: సకల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విద్యారంగాన్ని కాపాడలేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం బాలసముద్రంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని దు య్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం2020 పేరుతో విద్యా కార్పొరేటీకరణ, విద్యాకేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని, విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభు త్వం స్వాగతం పలుకుతోందని, పాలకులు ప్రపంచ బ్యాంక్ సలహాలపై ఆధారపడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అనే పద్ధతిలో విద్యావ్యాపారానికి పచ్చ జెండా ఊపయాని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభు త్వం తీసుకున్న నిర్ణయం వల్ల 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని, కళాశాలలను మూసివేయ డం కన్నా కళాశాలలను అభివృద్ధి చేసి నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, గురుకుల కళాశాలలో సరైన వసతు లు కల్పించి నాణ్యమైన ఆ హార భోజనాన్ని అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని అన్నారు.ఈ విలేకరుల సమావేశం లో ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శి ఉట్కూరి ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్, రా ష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, దిడ్డి పార్థసారథి, చైతన్య, సాగర్‌తదితరులు పాల్గొన్నారు.

## 26,27 తేదీలలో హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభలు



మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి వెల్లడి

ప్రజాపక్షం/ హసన్ పర్తి : దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత పోరాట చరిత్ర కలిగిన శ్రమజీవుల కార్మిక, రైతు కూలీల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలిపారు. ఈనెల 26,27 తేదీలలో హనుమకొండ జిల్లా సిపిఐ రెండవ మహాసభలు హసన్ పర్తి మండల కేంద్రంలో జరగబోతున్నాయని, 26 వ తేదీన జరిగే ప్రజా ప్రదర్శన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున హసన్‌పర్తి మండలం పెగడపల్లి గ్రామంలో రాకేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. గుత్తా కోటీశ్వరులకు రైట్ ఆఫ్‌లోన్స్ పేరుతో 16 లక్షల 35 వేల కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టినటువంటి పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర లభిస్తుందని దానికి కేవలం 119 లక్షల కోట్లు మాత్రమే ఖర్చవుతుందని, దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన లేనియెడల రైతు ఆత్మహత్యల పాలై ఆహార కొరత ముప్పు కలుగుతుందని తెలిపారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి మాట్లాడుతూ హసన్ పర్తి శాసన సభ నియోజకవర్గంగా ప్రకటించాలని, హసన్ పర్తిలో వంద పడకల ప్రాంతీయ వైద్యశాల ను ఏర్పాటు చేయాలని డిగ్రీ కళాశాలను పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి, వంగపాడు గ్రామ శాఖ కార్యదర్శి దోమ రాకేష్, సహాయ కార్యదర్శులు దోమ మధున, మంద జ్యోతి, దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాలే ఊపిరిగా సిపిఐ ప్రస్థానం

సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు




ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మండలం 18వ మహాసభ చిన్నకందుకూర్ గ్రా మంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభ కు అధ్యక్ష వర్గంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి ఆరే పుష్ప వ్య వహరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా గత వంద సంవత్సరాల నుండి సిపిఐ ప్రయాణిస్తుందని అన్నారు. ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల ఏజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవారికి భూమి కావాలని శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదుదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విధంగా ఉన్నాయని, పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి అన్నారు. కేం ద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని ఈ పేరుతో చంపడం సరైనది కాదానీ మావోయిస్టులను చర్చలు ఆహ్వానించి సానుకూలంగా పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణ మే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, సిపిఐ జిల్లా రైతు సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటే ష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, ప్రజా నాట్యమండలి గాయకురాలు హింజ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అభివృద్ధి చేసి ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దుతాం :
కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** డివిజన్ ఉన్న ప్రతి కాలనీలను అభివృద్ధి చేసి ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దుతామని బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ నుంచి గాయత్రి నగర్ ఫేస్‌ఇ ఆర్చ్ వరకుమంజూరు అయిన సిసి రోడ్ల పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలను దశల వారిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఇ రాజ్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కెఎ.పాల్‌కు ఊరట

## పీస్ సభకు హైకోర్టు అనుమతి

**హైదరాబాద్ :** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో జరగనున్న గ్లోబల్ పీస్ ఫెస్టివల్‌కు హైకోర్టు అనుమతిచ్చింది. ప్రపంచశాంతి సభను నిర్వహించే గోస్పెల్ సొసైటీకి పలు షరతులు విధించింది. వెయ్యి మందికి జనం మించకూడదని, నాలుగు మైకులను మాత్రమే వాడాలని, 45 డెసిబుల్స్ సౌండ్ మించకూడదని, డీజే, ఇతర శబ్దాలు రాకూడదని, ప్రార్థనలు చేయడం తప్ప ఇతర ప్రేరేపిత ప్రసంగాలు చేయకూడదని, శనివారం 24వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించాలని,. సభ శాంతియుతంగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టాలని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ గోస్పెల్ హైకోర్టులో హౌస్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు విచారించారు.

## సంధ్య హోటల్స్ నిర్మాణాలు కూల్చొద్దు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 124, 125లోని సంధ్య హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని మినీ మాల్, ఇతర నిర్మాణాలను కూల్చరాదని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి ఆదేశాలు జారీ చేసే వరకు యథాతథస్థితిని కొనసాగించాలని హైడ్రాను ఆదేశించింది. విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చారు. చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా, ఉద్దేశపూర్వకంగా హైడ్రా కూల్చివేత చేపట్టిందంటూ సంధ్యా హోటల్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గతంలో కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా కూల్చివేత చర్యలు చేపట్టిందని పిటిషనర్ వాదన. మే 6న సంధ్యా హోటళ్లకు చెందిన యూఎన్‌ఓఎస్, మ్యాంగో నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిందన్నారు.

## సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి

క్రాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎపిలోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు స్థానికత కల్పించడమే తమ లక్ష్యమని క్రాంతి కీన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు క్రాంతి, ప్రధానకార్యదర్శి లావణ్య, కార్యదర్శి కల్యాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులోని దిల్‌కుషా హౌస్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థుల పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. వచ్చే ఏడాదిలోపు రాష్ట్రంలో సైనిక స్కూల్‌ను ఏర్పాటు చేసేవిధంగా కృషిచేస్తానని హామీనిచ్చారని తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 50 మంది క్రాంతి కీన్ ఫౌండేషన్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెఎంసి రాష్ట్ర అధ్యక్షుడిగా నాగార్జున





**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అసంఘటితరంగ కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బిజెఎంసి) రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున అన్నారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిజెఎంసి జాతీయ అధ్యక్షులు అర్నాబ్ చటర్జీ నుంచి నియామక పత్రాన్ని నాగార్జున . ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికవర్గానికి అందజేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బిజెఎంసి జాతీయ కార్యదర్శి ప్రశాంత్ కుమార్, జాతీయ యువ అధ్యక్షులు దీపక్ శర్మ, ఎపి రాష్ట్ర అధ్యక్షులు ఖలీఫతుల్లా, ప్రధానకార్యదర్శి ఖాజా అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విద్యార్థుల్లో ప్రతిభ, నైపుణ్యాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన సమ్మర్ క్యాంప్ – 2025 విజయవంతంగా ముగిసినట్టు హిమాయత్‌నగర్ బ్రాంచి ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిబిరంలో ఆత్మరక్షణ, ఫిట్‌నెస్, ఆరోగ్యం అంశాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు.

## పేదలందరికీ ఇల్లు ఇవ్వాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటి అధ్యక్షుడు తిప్పిశెట్టి సుదర్శన్, ఉపాధ్యక్షులు వట్టెల లింగం యాదవ్, మాజీ సర్పంచ్ పోలేపోగు రాజు, రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వరూప్‌కుమార్, రేషన్ డీలర్ శ్రీనివాస్, కర్ణకోట యాదజీ, పల్లె యాదయ్య, సూరం శ్రీనులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

కిరాయికి వచ్చి నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలను తప్పు పట్టిన హైకోర్టు

కోర్టు అనుమతులతో కూల్చివేతలు చేపట్టిన హైడ్రా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 41లో రోడ్డుతో పాటు, నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా శుక్రవారం తొలగించింది. 30 అడుగుల రహదారిలో ఆక్రమణలు తొలగించి, 2 ఎకరాల పార్కుకు దారి చూపింది. దాదాపు రూ.200ల కోట్ల ఆస్తిని కాపాడి, ప్రజా వినియోగంలోకి హైడ్రా తెచ్చింది. జూబ్లీహిల్స్ సొసైటీ ప్రతినిధులు, అక్కడి నివాస ప్రాంతాలకు చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ క్షేత్రస్థాయిలో ఇదివరకే పరిశీలించారు. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టినట్టు నిర్ధారణ కావడంతో వాటి తొలగింపునకు హైడ్రా నోటీసులు గతంలోనే ఇచ్చింది. కోర్టునుంచి అనుమతులు లభించడంతో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది.

**కిరాయికి వచ్చి కబ్జాలు చేసిన వైనం..** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 41లో అవసరాల శ్రీనివాస్ రుక్మాంగదరావుకు 1000 గజాల స్థలం ఉంది. ఇందు లో 200ల గజాల వరకూ ఇల్లు కట్టారు. ఈ ఇల్లు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి చేరువలో ఉంది. క్రోతుపల్లి శ్రీనివాస్‌కు దీనిని అద్దెకు ఇచ్చారు. ఈ ఇంటికి పక్కనే 30 అడుగుల మేర రోడ్డు ఉంది. ఈ రోడ్డు మార్గంలో వెళ్తే 2 ఎకరాల పార్కుకు చేరుకోవచ్చు. కానీ ఆ దారిని కిరాయిదారుడు మూసేశాడు. దీంతో ఆ పార్కుకు దారి లేకుండా పోయింది. 30 అడుగుల మేర ఉన్న రహదారిలోనే బాక్స్ నాలా ఉంది. నాలాతో పాటు, రోడ్డును సగం వరకూ ఆక్రమించేశారు. ఇంటి ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న రోడ్డును కూడా ఆక్రమించి హాస్టల్ నిర్మించాడు. ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కారు మరమ్మతుల షెడ్డును ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చాడు. మొత్తం 907 గజాల మేర ఆక్రమణలకు పాల్పడ్డాడు. వాటిని అద్దెకు ఇచ్చి నెలకు రూ. 10 లక్షల వరకూ వసూలు చేస్తున్నాడు. ఇవన్ని ఇంటి ఓనర్‌కు సంబంధం లేకుండా జరిగిపోయాయని హైడ్రా అధికారులు తెలిపారు.

ఫిర్యాదు అందడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చింది. ఆ నోటీసులపై కిరాయిదారుడు హైకోర్టును ఆశ్రయించారు. రోడ్డును, నాలాను ఆక్రమించి ఎలా నిర్మాణాలు చేపడతారంటూ కిరాయిదారుడును కోర్టు ప్రశ్నించింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన కిరాయిదారుడు చేస్తున్న వాదనలను హైకోర్టు తప్పు పట్టింది. ఈ విషయంలో ఏమైనా అభ్యంతరాలున్నాయా అని ఇంటిఓనర్‌ను కోర్టు అడిగింది. తనకెలాంటి అభ్యంతరాలు లేవని చెప్పడంతో ఆక్రమణల తొ లగింపునకు హైకోర్టు అనుమతులు మంజూరు చేసింది. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అక్కడ నిర్మించిన హాస్ట ల్ భవనాన్ని, కారు మెకానిక్ షెడ్డును తొలగించింది.

**పార్కుకు దారి చూపిన హైడ్రా..** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 41, ఎటు చూసినా వ్యాపార సముదాయాలు, ట్రాఫిక్ రద్దీతో నిల్చోడానికి కూడా స్థలం లేని ప్రాంతం. అలాంటి చోట 2 ఎకరాల మేర పార్కు ఉంటే ఎంత ప్రయోజనమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రోడ్డును ఆక్రమించి కిరాయిదారుడు నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించడంతో ఇప్పుడా పార్కుకు దారి లభించింది. ఇప్పుడా 2 ఎకరాల పార్కు ను జిహెచ్‌ఎంసి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆ పార్కు అందుబాటులోకి వస్తే అక్కడ ఎంతో మందికి ప్రాణవాయువు అందుతుంది. పార్కుకు దారి లభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నేటి నుంచి తగ్గిన మెట్రో ఛార్జీలు అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెంచిన మెట్రో రైలు ఛార్జీలు హైదరాబాద్ మెట్రో రైల్ ఎల్‌అండ్‌టి యాజమాన్యం సవరించిన విషయం తెలిసిందే. ఛార్జీలను 10 శాతం తగ్గిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ తగ్గిన మెట్రో ఛార్జీలు నేటి నుంచి (మే 24) నుంచి వర్తించనున్నాయని ప్రకటన విడుదల చేసింది. ఈనెల 15న మెట్రో ఛార్జీలు పెంచుతూ హైదరాబాద్ మెట్రో రైల్ యాజమాన్యం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ పెంచిన ఛార్జీలు ఈ నెల 17 నుంచి అమల్లోకి వచ్చాయి. గతంలో ఉన్న టికెట్ ధరకు కనిష్ఠంగా రూ.10 నుంచి రూ.12, గరిష్ఠ టికెట్ ధర రూ.60 నుంచి రూ.75గా సవరించారు. ఈ ఛార్జీలను కిలోమీటర్ల వారీగా పెంచారు. మెట్రో ఛార్జీలు పెంచిన దగ్గరి నుంచి ప్రయాణికులు, విపక్షాల నుంచి ధరలను తగ్గించాలని డిమాండ్‌లు వచ్చాయి. దీంతో ఈనెల 20న పెంచిన ఛార్జీలను 10 శాతం తగ్గిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం కొత్త ధరలు ప్రకటించిన యాజమాన్యం నేటి నుంచి అమలు చేయనుంది. హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజల్ని రక్షించడానికి మెట్రో ఓ వరంగా మారింది. మెట్రో పుణ్యమా అని జనం ట్రాఫిక్ చింత లేకుండా ఎక్కువ దూరాన్ని తక్కువ సమయంలో ప్రయాణిస్తున్నారు. సాధారణ బస్ ఛార్జీలతో పోల్చుకుంటే మెట్రో ఛార్జీలు కొంచెం అధికంగా ఉంటాయి. ఇదే ప్రయాణికులకు కొంచెం ఇబ్బందిగా ఉండేది. ఛార్జీల విషయంలో కూడా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని మెట్రో యజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.



**తగ్గిన ఛార్జీల వివరాలు...** తగ్గిన మెట్రో ఛార్జీల ప్రకారం కనీస ధర 11 రూపాయలుగా కాగా, గరిష్ట ధర 69 రూపాయలుగా ఉంది. రెండు కిలోమీటర్ల వరకు మెట్రో ఛార్జీని 12 రూపాయల నుంచి 11 రూపాయలకు తగ్గించారు. 2 నుంచి 3 కిలోమీటర్ల వరకు ఛార్జీని 18 రూపాయల నుంచి 17 రూపాయలకి, 4 నుంచి 6 కిలో మీటర్ల వరకు ఛార్జీని 30 నుంచి 28 రూపాయలకు, 6 నుంచి 9 కిలోమీటర్ల వరకు ఛార్జీని 40 నుంచి 37 రూపాయలకు వరకు తగ్గించారు. 9 నుంచి 12 కిలోమీటర్ల వరకు ఛార్జీ 50 నుంచి 47 రూపాయలకు, 12 నుంచి 15 కిలోమీటర్ల వరకు ఛార్జీ 55 నుంచి 51 రూపాయలకు, 15 నుంచి 18 కిలోమీటర్ల ఛార్జీ 60 నుంచి 56 రూపాయలకు, 18 నుంచి 21 కిలోమీటర్ల ఛార్జీ 66 నుంచి 61 రూపాయలకు, 21 నుంచి 24 కిలోమీటర్ల ఛార్జీని 70 నుంచి 65 రూపాయలకు, 24 కిలోమీటర్లకు పైగా ఉండే ప్రయాణ ఛార్జీ 75 రూపాయల నుంచి 69 రూపాయలకు తగ్గించారు. తగ్గిన ఛార్జీలతో మెట్రో ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది.

## పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిర్మూలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసే థీమ్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (స్కిట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు ప్లాస్టిక్ వాడకం గురించి, దాని దుష్ప్రభావాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు పరిష్కారాలను ప్రదర్శించారు. ఈ స్కిట్‌లో విద్యార్థులు వివిధ పాత్రలు ప్రదర్శించి, ప్లాస్టిక్ కాలుష్యం మన ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. ద్యార్థులు తమ థీమ్‌ను ఉపయోగించి, ప్లాస్టిక్‌తో పులిసిన సముద్రాలు, నదులు, జంతువుల ఆహారంలో ప్లాస్టిక్ భాగాలు చేరడం వంటి అంశాలను చూపించారు. విద్యార్థులు ప్లాస్టిక్‌ను తగ్గించే మార్గాలు, పునర్వినియోగం, పద్ధతులను ప్రదర్శించారు. స్కిట్ ప్రోగ్రామ్ ద్వారా, విద్యార్థులు ప్రేక్షకులకు ప్లాస్టిక్ కాలుష్యం ముఖ్యంగా, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కలిపించారు. చెట్ల రక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజం లాంటి కార్యక్రమాలు ద్వార కాలుష్యాన్ని నియంత్రించటానికి యువత ముందుండాలని జిల్లా సైన్స్ అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త ప్రధాన పర్యావరణ శాస్త్రవేత్త(జెసిఇఎస్) డాక్టర్ ఎం. సత్యనారాయణ రావు జిల్లా సైన్స్ అధికారి జి.ప్రభాకర్, ప్రాజెక్టు అధికారి బి. నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



## కాలనీ వాసులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కాలనీవాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని ఆంధ్రకేసరి నగర్, కమల నగర్ కాలనీ వాసులకు, కాలనీ చెందిన ఒక ప్రైవేటు వ్యక్తి తన సొంత స్థలంలో కాలనీలు నివాసం ఉంటున్నారని వారి నుంచి ఖాళీ చేయాలని ఆర్‌డిఓ కార్యాలయంలో స్టేటస్ కో ఇవ్వడంతో కాలనీ ప్రజలు తీవ్ర మనస్థాపానికి గురై కాలనీ వాసులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రకేసరి నగర్, కమల నగర్ కాలనీ వాసులు వారి సమస్యలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కాలనీల్లో నివాసం ఉంటున్నారని, ఇండ్లు కట్టుకుని నిర్మాణం చేసుకోని ఇండ్లపై బ్యాంకులోన్లు తీసుకుని నివసిస్తున్నారని ఆర్‌డిఓకు ఎంఎల్ఏ ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను వివరించారు. దీనిపై మరో సారి పరిశీలన చేయాలని, స్టేటస్‌కోను తిరస్కరించి కాలనీ వాసులకు భరోసా కల్పించాలని సూచించారు. కాలనీ ప్రజలు ఆందోళనకు గురికావద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి నగర్, కమల నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# పేదలకు సొంతింటి కల తీర్చాలన్నదే లక్ష్యం



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇందిరమ్మ రాజ్యంలో సొంతింటి కల తీర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా మొదటి విడతలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు శంకుస్థాపన చేయడంతోపాటు లబ్దిదారులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు సొంతింటి కల నేరవేర్చాలంటే ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి అండగా నిలిచేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బన్సీలాల్, పంచాయతీ రాజ్ ఎఇ గోపాల్, పంచాయతీ కార్యదర్శి తేజశ్వనీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు కావలి శ్రీశైలం, కోట్ల శ్రీశైలం, గ్రామ కమిటి అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, నేతలు నారం పెంటారెడ్డి, బెంది మోహన్‌రెడ్డి, గున్న శివలింగం, చాకలి చంద్రయ్య, ఆర్ల యాదయ్య, బుడ్డ నర్సింలు, కమ్మదనం నవీన్, లింగారెడ్డిగూడ అశోక్, బండి మాణిక్యం, మహిళా అధ్యక్షురాలు వడ్ల సుమిత్రలు పాల్గొన్నారు.



### క్షయవ్యాధి పేషెంట్లకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో టిబి అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ కిట్లను జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ పాపారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపారావు మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రాస్తులకు తెలంగాణ ప్రభుత్వం మందులు ఇస్తుందని, ఎవరు భయపడాల్సిన పని లేదన్నారు. రోగులకు పోషక ఆహారం కోరకు ప్రతినెల వెయ్యి రూపాయాల చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులు వాడితే ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ, ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరిండెంట్ డాక్టర్ విష్ణు, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, మార్కెట్ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, టిబి సూపర్ వైజర్లు రవికుమార్, షఫీ, సంధ్య, ఆరోగ్య సిబ్బంది అన్వర్, లింగం, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లేని లబ్ధిదారుల ఎంపిక




అధికారులపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం

**ప్రజాపక్షం/యాచారం :** ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక సరిగ్గా జరుగలేదని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేధికలో ఇందిరమ్మ లబ్దిదారులకు ప్రోసిడింగ్‌లు అందజేశారు ఆ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇండ్లు లేని అర్హులైన వారిని గుర్తించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు సమన్వయంగా ఉండి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. మండలంలో ఇష్టారాజ్యంగా లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మళ్ళీ గ్రామాల్లో సర్వే చేసి అర్హులైన వారందరిని గుర్తించాలన్నారు. అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనవారందరికీ అందేవిధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మండలానికి 500 ఇండ్లు కేటాహిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు ఇండ్లు వచ్చినవారు కట్టుకుంటున్నారా లేదా పర్యవేక్షణ చేయాలన్నారు. అర్హులైన వారందరికి న్యాయం చేయడానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తామన్నారు. యాచారం మండలంలో అధికారుల పని తీరు బాగా లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శైలజ, ఎంపిఓ ఉమారాణి, మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మా, గులాం అక్బర్, వరికుప్పల సుధాకర్, దెంది రాంరెడ్డి, అమృత సాగర్,మూడెడ్ల వెంకట్‌రెడ్డి, నాయిని సుధర్శన్‌రెడ్డి, ఎరుకలి బాల్‌రాజ్, మోటే శ్రీశైలం, నడ్డి విజయ్‌కుమార్‌తో పాటు నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడినప్పడే రైతు ఆర్థికంగా రాణింపు

వ్యవసాయ శాస్త్రవేత్తలు శిరీష, సతీష్

**ప్రజాపక్షం/షాబాద్ :** నేల తల్లి ఆరోగ్యాని కాపాడినప్పుడే రైతు ఆర్థికంగా రాణిస్తారని డాక్టర్ వ్యవసాయ శాస్త్రవే శిరీష, సతీష్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్, ఏట్ల ఎర్రవల్లి రైతు వేదిక కార్యాలయంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే పంటలను శాస్త్రీయంగా వ్యవసాయ అధికారుల ఆదేశాలను పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. పత్తి, వరి కందులు, జొన్నలు పండించిన ధాన్యం మంచి నాణ్యత కల్గి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, విశ్వవిద్యాలయ రిసెర్చ్ స్కాలర్ శాస్త్రవేత్త అవనిజ, శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఎఇఒలు రాజేశ్వరి, కిరాణ్మయి, విద్యార్థులు పవన్ కుమార్, శివ, రైతులు మాణిక్య రెడ్డి, శశికాంత్ రెడ్డి, నరసింహ్మా రెడ్డి పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నిర్ణీతకాలంలో రోడ్డు పనులను పూర్తి చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని సీతారాంనగర్, బలరాంనగర్ ప్రాంతాల్లో రూ. 38 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. సమస్య తీవ్రత దృష్ట్యా ప్రత్యేక నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఎఇ నవీన్, రమేష్, శ్యామల, బాబాన్‌సింగ్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి నుండి అఫ్జల్‌గంజ్, పటాన్‌చెరుకు బస్సులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి నుండి అఫ్జల్ గంజ్ 20 రౌండ్ ట్రిప్పులు తిరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కుషాయిగూడ ఆర్‌టిసి డిపో మేనేజర్ మహేష్ తెలిపారు. అఫ్జల్‌గంజ్ నుండి వయా నాచారం మీదుగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు 252 రూట్లో 20 రౌండ్ టిప్పులను ఉదయం 3.30 గంటల నుండి ప్రతి 30 నిమిషాలకు ఒకటి చొప్పున,చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ (17హెచ్)ఇసీఐఎల్ తార్నాక మీదుగా 4 ట్రిప్పులను 3.30,4,40,6.00,9 గంటలకు ఏర్పాట్లు చేయడమైనదని ఆయన తెలిపారు.చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి నేరేడ్‌మెట్ ,బాలానగర్,బోయిన్‌పల్లి మీదుగా పటాన్‌చెరుకు(రూట్ నంబర్ 24ఎన్/219) 4.10,5.20,6.30 గంటలకు మూడు ట్రిప్పులను ఉదయం ఏర్పాటు చేసామని,రైళ్ల రాకపోకలకు అనుగుణంగా అదనపు ట్రిప్పులు కూడా చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు పలు ప్రాంతాలనుండి నడుపుచున్నామని తెలిపారు.

## కంపు కొడుతున్న పలు కాలనీలు

**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ శివనగర్ కాలనీలో ఉమా మహేశ్వర స్వామి దేవాలయం ఉండడంతో ప్రజలు నిత్యం దర్శించుకోవడానికి వెళుతూ ఉంటారు. రోడ్లపైనే మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతుంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారులపై మురుగు నిలుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దోమల బెడద క్రమేపి పెరుగుతుంది. దీంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు. వెంటనే డ్రైనేజీని మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.






## పీర్జాదిగూడలో సంబరాలు

### హైడ్రా పనితీరుపై ప్రశంసలు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఫీర్జాదిగూడలో పండగ వాతావరణం కనిపించింది. కబ్జాల చెర నుంచి దాదాపు 2 ఎకరాల మేర ఉన్న గ్రేవ్ యార్డును కాపాడుకున్నామని క్రిస్టియన్ ముస్లిం మైనార్టీలు పండగ చేసుకున్నారు. టెంటులు వేసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి ఆనందం పంచుకున్నారు. టపాసులు పేల్చి సంతోషం వ్యక్తం చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వాన్ని అభినందించారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డికి, హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌కి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా 24 గంటల్లోనే తమ సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, ఫిర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని కంచ పర్వతాపూర్ గ్రామం శ్మశాన వాటికలో వెలిసిన అక్రమ లే ఔట్‌ను, కట్టడాలను హైడ్రా గురువారం తొలగించిన విషయం విదితమే. శ్మశానవాటికను కాపాడాలని ఏళ్లుగా పోరాడుతున్నామని, మా పోరాటం ఒక పక్క సాగుతుండగానే, మరోవైపు అక్కడ కట్టడాలు వెలుస్తూనే ఉన్నాయని, ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన హైడ్రాను ఆశ్రయించామని తెలిపారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించారని, శ్మశానవాటిక స్థలంలో వెలసిన కట్టడాలను ఆ మరుసటి రోజే తొలగించారని, ఇది కదా ప్రజాపాలన అంటూ హైడ్రాను అభినందించారు. 7 ఏళ్లుగా ధర్నాలు చేశామని, అధికారులు చుట్టూ తిరిగామని శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో 24 గంటల్లో పరిష్కారం అయ్యిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారులందరికీ అభినందనలు తెలిపారు.



## విద్యాప్రమాణాలను మెరుగుపరచాలి

### విద్యాధికారి విజయకుమారి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరుచాలని జిల్లా విద్యాధికారి విజయాకుమారి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండల శిక్షణ కేంద్రం జిల్లా పరిషత్ తూంకుంట పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్ కమలాకర్, రిసోర్స్ పర్సన్స్ ఎర్ర రాజు, శశికుమార్, పుష్పలత, శ్వేత, హరిశంకర్, శివనాగరాజు, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా గ్రామ పాలన అధికారి పరీక్ష



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా లో నిర్వహించే గ్రామపాలన అధికారి పరీక్షలను హాజరయ్యే ఉద్యోగులకు సిసిఎల్ఎ మార్గదర్శకాలను అనుసరించాల్సిన ముఖ్యమైన సూచనలను జారీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఈ సందర్భంగా మాట్లాడుతూ హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేయాలి, ప్రతి అభ్యర్థి తన హాల్‌టికెట్‌ను ముందుగా సరి చూసుకొని అందులో ఉన్న వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా పరిశీలించాలని అన్నారు. పరీక్ష కేంద్ర చిరునామాను ముందుగా గుర్తించాలని తెలిపారు. నిషేధిత ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావద్దని డిజిటల్ వాచీలు, పెన్‌డ్రైవ్ లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాలులో నిసేధించబడ్డాయి. ఇటువంటి వస్తువులు తీసుకురావద్దని అభ్యర్థులకు సూచించారు. అభ్యర్థులు బ్లూ లేదా కలర్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకురావాలి, పరీక్ష గదిలో అభ్యర్థులు నిశ్శబ్దంగా ఉండాలి. పర్యవేక్షకుల సూచనలకు పూర్తిగా సహకరించాలని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10గంటలవరకు చేరుకోవాలని నిమిషం ఆలస్యం అయితే అభ్యర్థులను అనుమతించబడదని అన్నారు. ఎంప్లాయ్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని అన్నారు. అభ్యర్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎక్కడున్నా చంపేస్తామంటున్నారు..

### పోలీసులే కిడ్నాప్ చేసి స్టేషన్‌లో సంతకాలు పెట్టించారు.. ఫిర్యాదు చేసిన బాధితులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసులే తమను బలవంతంగా వాహనంలో తీసు కెళ్లి.. దొంగ డాక్యుమెంట్లపై సంతకాలు చేయించి..చెప్పినట్లు వినకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని హైదరాబాద్‌కు చెందిన పాలాది కళావతి కుటుంబ సభ్యులు శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పాలాది చంద్రమౌలీశ్వర్ ( చనిపోయారు) మహబూబ్‌నగర్ జిల్లాలోని పాల్కొండ గ్రామ శివారులో సర్వే నంబర్ 272/1లో 7ఎకరాల 30 గుంటల భూమిని 1988లో తన కుమారుల కోసం కొనుగోలు చేశారు. ఆయన చనిపోయిన తర్వాత భార్య పాలాది కళావతి, కుమారులు శ్రీనివాస్, రాంబాబు 2023లో జడ్చర్లకు చెందిన శివలింగం అనే వ్యక్తికి విక్రయించేటట్లు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం 2024 మే 8న వారికి ఆ భూమిలో 51 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఆ అగ్రిమెంట్లో రాఘవేందర్ రాజు పేరును శివలింగం చేర్చారు. కాగా రాఘవేందర్ రాజు ఎవరో వారికి అప్పటికీ తెలియదు. ఆ తర్వాత ఒప్పందం ప్రకారం 50 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 30 లక్షలు మాత్రమే ఇచ్చి.. మొత్తం ఇచ్చినట్లు ఫొటోలు, వీడియోలు తీసి, వారికి ఆ 7 ఎకరాల 30 గుంటల్లో మిగిలిన 3 ఎకరాల భూమిని సైతం తమకే ఇవ్వాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, సామ శివలింగ అతని మరో పార్టనర్ సురేష్ లు కూడా ఆ 3 ఎకరాల భూమిని ఎవ్వరికైనా విక్రయించుకోండని చెప్పి, వారి ఇష్ట ప్రకారమే గత ఏడాది సెప్టెంబర్ 3న సరెండర్ అండ్ భరోసా ప్రతాన్ని రాసి ఇచ్చారని మానవహక్కుల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 2న ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్‌కు వచ్చి బలవంతంగా కారులో మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు సిఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్లతో పాటు చలువగాలి రామవేందర్ రాజులు తన కుమారుడ్ని చిత్రహింసలు పెట్టారని తల్లి కళావతి కన్నీటి పర్యంతమైంది.

## హాస్టళ్లను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు

### నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలు పాటించని హాస్టళ్లపై ఫుడ్ సేఫ్టీతో పాటుగా ఇతర శాఖలతో ఏర్పడిన టాస్క్ ఫోర్స్ బృందాలు శుక్రవారం అమీర్‌పేట్, అశోక్ నగర్, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాల్లో పలు హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ మహిళలు, పురుషులు, విద్యార్థుల అవసరాలను తీర్చడానికి అనేక ప్రైవేట్ హాస్టళ్లు ఆహార భద్రత, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్యం, అగ్ని ప్రమాద నివారణ మొదలైన నిబంధనలను ఉల్లంఘిస్తూ హాస్టళ్లను నిర్వహిస్తున్న విషయం గుర్తించారు. హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, నియమ నిబంధనలను ఉల్లంఘించి, పెద్ద హోర్డింగ్‌లను ప్రదర్శించడం, అపరిశుభ్రంగా తయారు చేస్తున్న నాణ్యతలేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థులను పెట్టడం, సరిపోను సరైన మరుగుదొడ్లు వంటి ప్రాథమిక అవసరాలను విస్మరించారు. వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. నిర్వాహకులతో పాటుగా, భవన యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు ఇప్పటికీ అపరిశుభ్రమైన పరిస్థితులు నిర్వహించడంలో బాధ్యతారహితంగా ఉన్నాయి. ఇది ప్రజలకు ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అలాంటి ఉల్లంఘనలను అరికట్టడానికి, జిహెచ్ఎంసి అంతటా చట్టాలను ఉల్లంఘించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న హాస్టళ్లపై (ఉదాహరణకు అమీర్‌పేట్, ఖైరతాబాద్ జోన్, అశోక్ నగర్, దిల్‌సుఖ్ నగర్ ఎల్.బి.నగర్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించడానికి జిహెచ్ఎంసి అధికారులతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు అశోక్ నగర్, దిల్‌సుఖ్ నగర్, అమీర్‌పేట్ ప్రాంతాలలో సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి, 30 హాస్టళ్లకు నోటీసులు జారీచేసి, 5 హాస్టల్ కిచెన్‌లను మూసివేశారు. జిహెచ్ఎంసి 1955 యాక్ట్ నిబంధనల ప్రకారం రూ.2,45,500 జరిమానా విధించారు.

## ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఉద్యాన పంటలపై మూడుచింతలపల్లి మండలంలోని రైతులకు శిక్షణ శిబిరాన్ని రైతువేదికలో శాస్త్రవేత్తలు నిర్వహించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సిఒఇ) జీడిమెట్ల ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన జిల్లా అధికారి శ్రీధర్ ఉద్యాన శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటల్లో వచ్చే పురుగులు మరియు వ్యాధుల నివారణలపై డాక్టర్ అనిత రైతులకు వివరించారు. కూరగాయల పంటలపై మంచి వ్యవసాయ పద్ధతులపై డాక్టర్ సురేష్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఫెర్టిగేషన్ నిర్వహణ పద్ధతులను సుబ్బారావు వివరించారు. కూర గాయల సాగు విధానాలపై డాక్టర్ నిరోషా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంసిపల్లి ఎఒ రవికుమార్, మూడుచింతల పల్లి, ఆద్రాస్‌పల్లి, అనంతారం, ఉద్దెమర్రి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## 25న గ్రామ పాలన అధికారి నియామక పరీక్ష

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఈ నెల 25 న కూకట్‌పల్లిలోని మహిళా డిగ్రీ కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పా ట్లు చేసామని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నా రు. జిల్లాలోని 52 మంది అర్హత ఉండి ఐచ్చికంగా ఆప్షన్ ఇచ్చిన విఆర్‌ఓలకు ఈ పరీక్ష కు హాజరవుతున్నార న్నారు. పరీక్ష ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తార్న విషయం గమనించి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకొనే ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఏదైనా సందేహాలుంటే టోల్‌ఫ్రీ నంబరు 733720990 ద్వారా ఫోన్ చేయవచ్చన్నారు.



## కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

### కార్యకర్తలకు పిలుపిచ్చిన మంత్రి దుద్దిళ్ల

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాహుల్ గాంధీ ప్రధానిగా చేస్తూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో లక్ష్యంగా యువజన కాంగ్రెస్ చిత్తశుద్ధితో సంఘటితంగా, ప్రణాళికాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపిచ్చారు. దీనికోసం కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకొని వెళుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చేరవేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముకలాంటిదన్నారు. మేడ్చల్ జిల్లాలోని కీసర బాల వికాస కేంద్రంలో తెలంగాణా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన "వైట్ టీ షర్ట్ "శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్ధేశించి మాట్లాడుతూ గత దశాబ్దానికి పైబడి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ సాగిస్తున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల ముందుంచాలన్నారు. రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైట్ టీ షర్ట్ ఉద్యమం చాలా గొప్పదన్నారు. కరుణ, అహింస, సమానత్వం, అందరి పురోగతి లాంటి ఐదు మార్గదర్శకాలకు వైట్ టీ షర్ట్ చిహ్నంగా నిలుస్తుందన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి,టిపిసిపి ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సయ్యద్ ఖలీద్, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్‌రావు, నితీష్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** నేడు (శనివారం) తూంకుంట ఫీడర్‌లో ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శామీర్‌పేట ఎఇ రాఘవేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి తూంకుంట ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి 12.30 గంటల వరకు తూంకుంట గ్రామం, డోమస్ విల్లాస్, మందాయిపల్లి రోడ్డు, నార్త్‌పార్క్, బిట్స్ పిలాని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 11కెవి గాయత్రీ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు ద్వారాకపురి కాలనీ, ఆర్‌టిసి కాలనీ, సాయినగర్, యాంజాల్ రోడ్డు, ఎంఎంరెడ్డి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, స్పోర్ట్స్ స్కూల్, ఎన్‌సిఎల్ కాలనీ తూంకుంట యందు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పూడూర్:** పరిగి నియోజకవర్గంలోని చన్‌గోమల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూడూర్ మండల ఎన్కేపల్లి గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య ఐదు సంవత్సరాల నుండి సోరియాసిస్ అనే వ్యాధితో బాధపడు తూ ఆ బాధను భరించలేక బుధవారం రాత్రి భోజనం చేసిన తరువాత వంట గదిలో చీరతో దూలానికి ఉరి వేసుకొని మృతి చెందాడు అని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.






## పేదరిక నిర్మూలనకు మహిళలకు చేయూత

### దివ్యదేవరాజన్

**ప్రజాపక్షం/కొడంగల్ :** గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన అంతం కావాలంటే మహిళలు స్వయం ప్రతిపత్తితో ఎదగాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యదర్శి దివ్యదేవరాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో తెలంగాణ సమ్మిళిత జీవనోపాధెల కార్యక్రమం, మహిళా సంఘాల పాత్రపై సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ కొడంగల్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా కడ ప్రత్యేక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సేర్ప్‌ల సహకారంతో అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించాలని వారిని పేదరికం నుండి బయటకు తీసుకురావడానికి కావలసిన సహాయ సహకారాలు అందించాలన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలను అధికారులు సైతం మద్దతు తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇందులో ఎలాంటి పైరవీలకు అవకతవకలకు తావులేకుండా నిజమైన పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమం గురించి మహిళలకు, ప్రజలకు క్లుప్తం గా వివరించి అందులో ఎంపిక చేయబడే అత్యంత నిరుపేద కుటుంబాలకు ఆయా శాఖ ల నుంచి సంపూర్ణ సహకారాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. అందుకు అధికారులు కూడా సంపూర్ణ మద్దతు ఇస్తామని కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని అంగడి రాయిచూర్ గ్రామంలో మహిళ శక్తి సంఘాల ఆధ్వర్యంలో కుట్టు కేంద్రాలను పరిశీలించారు. త్వరలో ప్రారంభం కానున్న పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్ స్టిచింగ్ ఎలా ఉందో పరిశీలించి వారితో స్వయంగా మాట్లాడి వారు పొందుతున్న ఉపాధిపై ఆరా తీశారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అడిషినల్ కలెక్టర్ సుదీర్, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జానకి, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస్, సేర్ప్ సివోవో రజిత, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలతో పాటు ఆయా శాఖల అధికారులు, స్థానిక అధికారులు తదితరులున్నారు.

## అటవీ భూమి ఆక్రమణపై ఫ్లైయింగ్ స్క్వాడ్ పరిశీలన



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/కొడంగల్ :** అటవీ భూమి అన్యాక్రాంతానికి యత్నం అనే వార్తా శీర్షిక ఈ నెల 21న ప్రచురితమైన కథనానికి శుక్రవారం అటవీ శాఖ ఫ్లైయింగ్ స్కాడ్ అధికారులు స్పందించి క్షేత్ర పరిశీలన చేశారు. బోంరాస్‌పేట మండలం తిర్మాలపూర్ శివారులోని అటవీ భూమి అన్యాక్రాంతంతో పాటు రోడ్డు ఏర్పాటు వంటి పనులను రేంజ్ ఆఫీసర్ సవిత తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. సదరు వ్యక్తి పూజారి నర్సింహులుపై కేసు నమోదు చేయడంతో పాటు రోడ్డు తోలగింపు, నష్టపోయిన చెట్ల స్థలంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేసే పనులు చేపట్టి జరిమాన విధిస్తామని చెప్పారు. ఇలాంటి చర్యలకు ఎవ్వరు పాల్పడిన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా గత మూడు రోజులుగా అటవీ శాఖ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులను తోలగించారు. నరికి వేసిన చెట్లను గుర్తించారు. అక్రమణకు గురి అయిన భూమి విస్తీర్ణాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే ఫారెస్ట్ అధికారుల పట్ల గ్రామస్థులు, స్థానిక రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనలో కేసు నమోదు, జరిమా నా విధించడంలో అధికారులు బాధితుడి పక్షాన తర్జన పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామం నుంచి అటవీ ప్రాంతంలోకి వేళ్లేందుకు రైతుల పొలాల నుంచి వేసిన మట్టి రోడ్డును కూడా రైతులు స్వయంగా తొలగించారు. సమస్యకు దూరంగా ఉండాలని జాగ్రత్తలు పడుతున్నట్లు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజాపక్షం వెలికితీసిన వార్తపై కొడంగల్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వీనిపై అధికారులలో చలనం వచ్చి అక్రమణదారుడిపై అటవీ శాఖ ఫ్లైయింగ్ స్కాడ్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

## యువతకు ఉత్తమ భవిష్యత్తు అందించడమే ధ్యేయం


### నిరుద్యోగులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉత్తమ భవిష్యత్తును అందించడమే తన ధ్యేయమని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడారు. అంతకు ముందు నిరుద్యోగ యువతకు ఉత్తమ భవిష్యత్తును అందించాలనే ధ్యేయంతో ఎంఎల్ఏ బిఎంఆర్ ఆధ్వర్యాన ఈ నెల 29న నిర్వహించే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. మెగా జాబ్ మేళాను నేతలు అందరు జయప్రదం చేయాలని కోరారు. తాండూరు పట్టణంలోని వినాయక కన్వేషన్ హల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈజిఎంఎం వారి ఆధ్వర్యంలో దాదాపు 50కంపనీలు పాల్గొంటున్నాయని పదివేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు వివరించారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, బిటెక్ చదివిన నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గోని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి నిరుద్యోగులు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాను గతంలో కూడా పరిగిలో 3వేల మంది నిరుద్యోగ యువతకు బిఎంఆర్ కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 100రోజులు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించానని గుర్తు చేశారు. గత రెండు నెలల క్రితం తాండూరులో ఫాక్స్ కాన్ కంపేనీ వారితో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగం ఇచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మా పార్టీ నాయకులు, అన్ని వ్యాపార, కుల సంఘాల నాయకులు గ్రామాలలో జాబ్ మేళా యువతి, యువకులకు వివరించాలని తెలిపారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, పట్లోళ నర్సిములు, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, మండల పార్టీల అధ్యక్షులు గోపాల్, నాగప్ప,కళాలల్ నర్సిములు, నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు ఉత్తమ్‌చంద్, అజయ్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గోన్నారు.

## బీద కుటుంబానికి అండగా బివిజి ఫౌండేషన్ చేయూత



**ప్రజాపక్షం/తాండూరు:** బీద కుటుంబాలను ఆదుకోవడమే బివిజి ఫౌండేషన్ ధ్యేయమని పౌండేషన్ చైర్‌పర్సన్ సునీత సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణ పరిధి మల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అశోక్ కుమారు డు రాకేష్ వివాహ శుభకార్యానికి హాజరైన బివిజి పౌండేషన్ చైర్‌పర్సన్ సునీతా సంపత్‌కుమార్ తమవంతు సహాయంగా పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, తాండూరు పట్టణ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వడ్డే శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ యువనాయకులు శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## క్రీడ

### మలుపు తిప్పిన తెలుగోడు..
# గెలిచే మ్యాచ్‌లో ఓడిన ఆర్‌సిబి





ఐపిఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో విజయాన్ని నమోదు చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో లక్నో వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆరెంజ్ ఆర్మీ 42 పరుగుల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. బౌలింగ్‌లో తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ మలింగా నిప్పులు చెరిగి సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ ఓటమితో ఆర్‌సీబీ టాప్2లో నిలిచే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 94 నాటౌట్), అభిషేక్ శర్మ(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34) రాణించారు. ఆర్‌సీబీ బౌలర్లలో రోమారియో షెఫర్డ్2/14) రెండు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, లుంగి ఎంగిడి, సుయాష్ శర్మ, కృనాల్ పాండ్యా తలో వికెట్ తీసారు.అనంతరం ఆర్‌సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఫిల్ సాల్ట్(32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 62), విరాట్ కోహ్లి(25 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 43)టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ప్యాట్ కమిన్స్(3/28) మూడు వికెట్లు తీయగా.. ఇషాన్ మలింగా(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. జయదేవ్ ఉనాద్కత్, హర్ష్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, హర్షల్ పటేల్ తలో వికెట్ తీసారు.

**మలుపు తిప్పిన నితీష్, ఇషాన్**

14 ఓవర్లలోనే 163 పరుగులు చేయడంతో ఆర్‌సీబీ విజయం లాంఛనమేనని అంతా అనుకున్నారు. కానీ 15వ ఓవర్ వేసిన నితీష్ కుమార్ రెడ్డి 4 పరుగులే ఇచ్చి ఆర్‌సీబీ బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చాడు. దాంతో ఇషాన్ మలింగా వేసిన మరుసటి ఓవర్‌లో ఆర్‌సీబీ రెండు వికెట్లు కోల్పోయింది. రజత్ పటీదార్ అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటవ్వగా.. డేంజరస్ రొమారియో షెఫర్డ్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దాంతో ఆర్‌సీబీ మరింత ఒత్తిడికి గురైంది. ఛేధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడంతో భారీ షాట్లకు ప్రయత్నించి వరుసగా పెవిలియన్ చేరారు. జితేశ్ శర్మ(24)ను ఉనాద్కత్ ఔట్ చేయగా.. టిమ్ డెవిడ్‌ను ఇషాన్ మలింగా, భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్యాలను కమిన్స్ ఔట్ చేశాడు. యశ్ దయాల్‌ను హర్షల్ పటేల్ పెవిలియన్ చేర్చి ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## ఇంగ్లండ్ మ్యాచ్‌లకు బుమ్రా దూరం!

ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) శనివారం ప్రకటించనుంది. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడిన ఆటగాళ్లలో చాలా మంది ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికవ్వనున్నారు. స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత్‌ఏ తరఫున ఇంగ్లండ పర్యటనకు వెళ్తున్న కుర్రాళ్లలో కూడా కొంతమందికి సీనియర్ టీమ్‌లో చోటు దక్కనుంది.

**మూడు టెస్ట్‌లకే బుమ్రా..**

భారత పేస్ విభాగాన్ని జస్‌ప్రీత్ బుమ్రా నడిపించనున్నాడు. అయితే టీమ్ సెలెక్షన్‌కు ముందు బుమ్రా.. బీసీసీఐకి బ్యాడ న్యూస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో తాను ఐదు టెస్ట్‌లు ఆడలేనని బుమ్రా బీసీసీఐకి సమాచారం ఇచ్చాడని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. మూడు టెస్ట్‌ల కంటే ఎక్కువ ఆడలేనని, అందుకు తన శరీరం సహకరించదని బుమ్రా.. సెలెక్టర్లకు స్పష్టం చేసినట్లు తెలిపింది. ఆస్ట్రేలియా పర్యటనలో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడి వెన్ను గాయానికి గురయ్యాడు. ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గాయపడిన అతను సుదీర్ఘ కాలం జట్టుకు దూరమయ్యాడు. మళ్లీ ఐపీఎల్ 2025తోనే రీఎంట్రీ ఇచ్చాడు.

**కెప్టెన్‌గా సత్తా చాటినా..**

వెన్ను నొప్పి నేపథ్యంలోనే జస్‌ప్రీత్ బుమ్రాను టీమిండియా లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పటికే బుమ్రా పలు సార్లు వెన్ను గాయానికి గురయ్యాడు. బుమ్రా గత మూడేళ్లుగా టెస్ట్‌ల్లో రోహిత్ శర్మకు డిప్యూటిగా వ్యవహరించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో హిట్ మ్యాన్ గైర్హాజరీలో జట్టును నడిపించి అద్భుత విజయాన్ని కూడా అందించాడు. బౌలింగ్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చాడు.

**కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్..?**

టీమిండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఇప్పటికే పలు నివేదికలు వెలువడ్డాయి. అయితే శుభ్‌మన్ గిల్ ఇప్పటికే టెస్ట్ ఫార్మాట్‌లో లీడర్‌షిప్ గ్రూప్‌లో లేడు. కానీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం జింబాబ్వే పర్యటనలో తొలిసారి టీ20 ఫార్మాట్‌లో టీమిండియాను నడిపించాడు. శ్రీలంక పర్యటనతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రోహిత్ శర్మకు డిప్యూటీగా వ్యవహరించాడు. టెస్ట్‌ల్లో గిల్ కెప్టెన్‌గా ఎంపికైతే రిషభ్ పంత్‌కు వైస్ కెప్టెన్సీ దక్కే అవకాశాలు ఉన్నాయి. 2018 నుంచి రిషభ్ పంత్ టెస్ట్‌ల్లో రెగ్యులర్‌గా ఆడుతున్నాడు.





## రీల్



### ఒటిటి పార్ట్‌నర్‌ను లాక్ చేసుకున్న 'వార్ 2'?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ అలాగే బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ కలయికలో తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రమే వార్ 2. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన ఈ సాలిడ్ ప్రాజెక్ట్ నుంచి మేకర్స్ రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్ కి మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. అయితే ఈ చిత్రాన్ని థియేటర్స్ లో రిలీజ్ తర్వాత ఓటిటిలో ఎలాగో విడుదలకి తీసుకురావాలి. మరి ఈ చిత్రం స్ట్రీమింగ్ హక్కులపై ఇపుడు వరకు ఎలాంటి అప్డేట్ లేదు. మరి లేటెస్ట్ గా దీనిపై దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రాన్ని దిగ్గజ స్ట్రీమింగ్ యాప్ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్టుగా ఇపుడు హింట్ ఇచ్చారు. ఎన్టీఆర్, హృతిక్ పై పోస్ట్ చేసి ది వార్ ఈజ్ అఫీషియల్ అంటూ వార్ 2 ఓటిటి హక్కులు తామే తీసుకున్నట్టుగా చెప్పకనే చెప్పేసారు. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది.

### 'అవతార్ 2'కి మళ్ళీ సిద్ధమా?



వరల్డ్ వైడ్‌గా భారీ వసూళ్లు సొంతం చేసుకున్న చిత్రాల్లో హాలీవుడ్ సెన్సేషనల్ ఫ్రాంచైజ్ అవతార్ కూడా ఒకటి. దర్శకుడు జేమ్స్ కేమరూన్ తెరకెక్కించిన ఈ విజువల్ వండర్స్ వరల్డ్ వైడ్ గా బిగ్గెస్ట్ గ్రాసర్ గా నిలిచాయి. అయితే గత కొన్నేళ్ళ కితమే అవతార్ 1 కి సక్సెసర్ అవతార్ పార్ట్ 2 అవతార్ ది వే ఆఫ్ వాటర్ వచ్చి సంచలనం సెట్ చేసింది. మరి ఈ చిత్రాన్ని ఫైనల్ గా మేకర్స్ మళ్ళీ రీరిలీజ్ కి తీసుకొస్తున్నట్టుగా అనౌన్స్ చేశారు. ఒక్క వారం మాత్రమే లిమిటెడ్ ఎంగేజ్మెంట్ గా థియేటర్స్ లో రీరిలీజ్ కి డేట్ ని ఇచ్చేసారు. దీనితో ఈ సినిమా ఈ రానున్న అక్టోబర్ 3 నుంచి థియేటర్స్ లో సందడి చేయనుంది అని కన్ఫర్మ్ చేశారు. మరి ఇది మాత్రం మళ్ళీ చూడాలి అనుకునేవారికి బిగ్ ట్రీట్ ఇచ్చే అప్డేట్ అని చెప్పవచ్చు. అయితే ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉంటుందా లేక ఓవర్సీస్ మార్కెట్ లోనేనా అనేది రివీల్ కావాల్సి ఉంది.




### శేఖర్ కమ్ముల 'కుబేర'కి షాకింగ్ రన్ టైం?

ఈ జూన్ నెలలో రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ చిత్రాల్లో కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్ గా కింగ్ నాగార్జున సాలిడ పాత్రలో మ్యాజికల్ దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం కుబేర కూడా ఒకటి. అయితే తెలుగు సహా తమిళ్ లో కూడా మంచి బజ్ ని సొంతం చేసుకున్న ఈ చిత్రంపై మరో ఇంట్రెస్టింగ్ టాక్ బయటకి వచ్చింది. దీనితో కుబేర సినిమాకి షాకింగ్ రన్ టైం లాక్ అయ్యినట్టుగా తెలుస్తుంది. మేకర్స్ ఈ చిత్రాన్ని దగ్గరదగ్గరగా మూడు గంటల నిడివికి కట్ చేశారట. ఈ సినిమా 2 గంటల 50 నిమిషాల మేర రన్ టైం తో రాబోతున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. మరి దీనిపై మరింత క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా ఆసియన్ సునీల్ అలాగే శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పి వారు ఈ చిత్రాన్ని నిర్మాణం వహించగా ఈ జూన్ 20న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి రాబోతుంది.

# నిబద్ధత,క్రమశిక్షణతో పోరాడిన రఘుపాల్

### సంతాప సభలో పలువురు వామపక్ష, శాంతి ఉద్యమ నాయకులు నివాళి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) ఉద్యమంలో, కమ్యూనిస్టు మార్క్సిస్ట్ పార్టీ ఉద్యమంలో జి. రఘుపాల్ నిబద్ధతతో, క్రమశిక్షణతో పోరాటాలు నిర్వహించారని పలువురు వామపక్ష, శాంతి ఉద్యమ నాయకులు అన్నారు. రఘుపాల్ సంతాప సభ హైదరాబాద్ హిమాయత్‌నగర్ లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, ఐప్సో జాతీయ నేత, పీస్ అవార్డు గ్రహీత కె.యాదవరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, అరుణోదయ విమలక్క, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ ప్రసంగించారు. తొలుత అజీజ్‌పాషా మాట్లాడుతూ సిపిఐ(ఎం) పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా రఘుపాల్ 15 ఏళ్ల పాటు సమర్థవంతగా బాధ్యతలను నిర్వహిస్తునే శాంతి సంఘం ఉద్యమంలో ఉద్యమ వ్యాప్తికి ఏనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన దూరదృష్ట కలిగిన వ్యక్తి అని నిబద్ధత గల కమ్యూనిస్టు యోధ అని సిపిఐ పార్టీ తరుపున నివాళులర్పించారు. జాతీయ పీస్ అవార్డు గ్రహీత జాతీయ నేత కె.యాదవ రెడ్డి మాట్లాడుతూ రఘుపాల్ 83 ఏళ్ల వయసు మీద పడ్డప్పటికీ ఎన్నడు కూడా వయోభారమైనటువంటి కారణంగా ఉద్యమాలకు దూరంగా ఉన్న సందర్భాలు లేవని అన్నారు. అన్ని సమావేశాలకు సమయం కంటే ముందే హాజరయ్యే వ్యక్తిని అన్నారు. శాంతి ఉద్యమాలలో జిల్లా రాష్ట్ర జాతీయ మహాసభలలో కలిసి తిరిగిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రఘుపాల్ కమ్యూనిస్టు ఉద్యమ అనే పద్యం నుండి వచ్చారని ఆయన నిత్యం తన ఆలోచనలతో వామపక్ష ఉద్యమాల బలోపేతం గురించి ప్రజలలో స్ఫూర్తిని నింపే వారనీ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి తో పాటుగా ఒకటి రెండు మినహా అన్ని జిల్లాలను తిరిగి ఉద్యమం కోసం కృషి చేశారని అన్నారు. ఐప్సో జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ డి .సుధాకర్ మాట్లాడుతూ రఘుపాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు .రఘుపాల్ నిత్యం రాష్ట్ర కేంద్రంలో అందుబాటులో ఉండి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న నాయకుడని అన్నారు. వారి సేవలు మరువలేనివి అని కొనియాడారు. సిపిఐ(ఎం) రాష్ట్ర సెక్రటేరియట్ నెంబర్ అబ్బాస్ మాట్లాడుతూ రఘు పాల్ కమ్యూనిస్టు శాంతి ఉద్యమ నాయకుడు మాత్రమే కాదు ఆయన గొప్ప మానవతా వాదని, ఆయన అందరినిసహృదయంతో ప్రేమించడంతోపాటు కార్యకర్తల ప్రోత్సహించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. అరుణోదయ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ రఘుపాల్ శక్తి విల్ పవర్ శారీరక దృఢత్వం చాలా గొప్పదని షో టీం లో మేమంతా చైనాకు వెళ్ళిన సందర్భంగా ఆయన చూపిన ,చర్చించిన విషయాలను మర్చిపోలేని వని నివాళులర్పించారు. ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెపిఎల్ మాట్లాడుతూ పోరాట బాటలో రఘుపాల్‌తో తను చాలా గంటల కొద్ది సమావేశాల్లో, రైళ్లలో, బస్సులలో, ప్రయాణం సందర్భంగా సంఘీభావ సంఘం ఉద్యమ ప్రాధాన్యతను, ఈ సంఘాన్ని ప్రజల సంఘంగా గా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన అనేక విషయాల గురించి మాట్లాడుకునే వారమన్నారు. రఘుపాల్ ఉద్యమ వ్యాప్తికి చేసిన కృషి మరువలేనిదని చెప్పారు . రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి .నాగేశ్వరరావు రఘుపాల్‌తో తనకున్న అనుబంధాన్ని, పోరాటంఅనుభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జిల్లా నాయకులు వెంకట రామ్ రెడ్డి , గురు బచ్చన్ సింగ్ ,రామరాజ్, ప్రేమ పావని, డాక్టర్ సమత రోషిని, అనూష, కమలా రెడ్డి నరహరి, పి ఎస్ ఎన్ మూర్తి, తిప్పర్తి మహేష్, జగన్మోహన్, లక్ష్మీ కాంతం. జెకె శ్రీనివాస్, శ్రీమన్నారాయణ,డాక్టర్ జి గోపి ,హర్ష అహ్మద్, బొమ్మగాని నాగభూషణం, వెంకట్ గౌడ్, రఘుపాల్ తో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రఘుపాల్ మరణం అనంతరం తన దేహాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ కు ఇచ్చిన సందర్భంగా రఘుపాల్ కుమారుడు డాక్టర్ గోపిని సన్మానించారు .




# వెదిరె రామచంద్రారెడ్డికి 'పద్మ విభూషణ్' ఇవ్వాలి

### అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి




**ప్రజాపక్షం / హైదరాబాద్:** స్వచ్ఛంద భూదాన ఉద్యమ ప్రేరణకర్త, భూదాన ఉద్యమ వ్యవస్థాపకుడు, భూదాన ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన వెదిరే రామచంద్రారెడ్డికి 'పద్మ విభూషణ్' ఇవ్వాలని పలువురు వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పాఠ్యాంశాల్లో వెదిరె రామచంద్రారెడ్డి జీవిత చరిత్రను చేర్చి భవిష్యత్ తరాలలో స్ఫూర్తి నింపాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బ్యాండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'భూదాన ఉద్యమ ప్రాముఖ్యత గతం, వర్తమానం వేదిరె రామ చంద్రా రెడ్డి భూదాన ఉద్యమ వ్యవస్థాపకుడు' అనే అంశంపై సదస్సు తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగింది. సదస్సులో అఖిల భారత సర్వోదయ మండలి మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు తోలుపునూరి కృష్ణ గౌడ్, భూదాన్ రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ వెదిరె ప్రబోధ్ చంద్రా రెడ్డి, ప్రమోతిష్ చంద్రా రెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి నేత టి.నరేష్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. జులై 17న ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిఎం రేవంత్ రెడ్డికి మహాదేవ్ విద్రోహి విజ్ఞప్తి చేశారు. వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడుతూ శాంతి యాత్రలో భాగంగా పోచంపల్లికి చేరిన ఆచార్య వినోబాభావే కోరిక మేరకు100 ఎకరాలను దానం చేశారని, ఈ ఘటనతో స్ఫూర్తి పొందిన వినోబా భావే దేశ వ్యాప్త భూదాన ఉద్యమానికి భూదాన జ్యోతిని ఈ ప్రాంతంలోనే వెలిగించారన్నారు. అటువంటి మహనీయుని త్యాగచరితను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి గౌరవించాలన్నారు. తోలుపునురి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూదాన భూములని కాపాడాలని, రాష్ట్రంలో భూదాన యజ్ఞ బోర్డు ఏర్పాటు చేసి మిగిలిఉన్న భూదాన భూములను పేదలకు పంపిణి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

## టార్గెట్ హిడ్మా

(మొదటి పేజీ తరువాయి)

అలియాస్ గంగన్న ఉన్నారు. కాగా ఇతని మరణంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంబాల కేశవరావును మట్టుబెట్టిన తరువాత పోలీసుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది. అక్కడే కేంద్ర, రాష్ట్ర బలగాలు క్యాంప్‌లు ఏర్పాటు చేసుకుని తరువాత టార్గెట్‌గా హిడ్మా కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. హిడ్మా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని పూర్వాటి గ్రామంలో జన్మించారు. గిరిజనుడైన హిడ్మా మసమాజానికి చెందిన హిడ్మా, పదవ తరగతి వరకు చదివిన తర్వాత నక్సల్స్ ఉద్యమంలో చిన్న వయసులోనే చేరారు. ఆయన సిపిఐ (మావోయిస్టు) పార్టీ 21 మంది సభ్యుల కేంద్ర కమిటీలో అత్యంత చిన్న వయస్సులో చేరిన సభ్యుడిగా గుర్తింపు పొందారు. గెరిల్లా యుద్ధ నిపుణుడైన హిడ్మావ్యూహాత్మక దాడులలో నిపుణుడిగా పేరు తెచ్చుకున్నాడు. 2010లో దంతేవాడలో 76 సిఆర్‌పిఎఫ్ జవాన్లను హతమార్చిన దాడి, 2013లో జిరం ఘాటి దాడి, 2017లో బుర్కపాల్ దాడి వంటి అనేక దాడులకు ఆయన నాయకత్వం వహించారు. ఇప్పుడు మావోయిస్టు పార్టీలో అతనొక అత్యంత బలమైన నాయకుడయ్యాడు.

**ఆహారం, నీరు అందక...**

కర్రెగుట్టను చుట్టుముట్టు మావోయిస్టులపై రోజున రోజుపై చేయి సాధించుకుంటూ పోతున్నారు.మరోపక్క ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మావోయిస్టులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. భద్రతా బలగాల ముట్టడి కారణంగా మావోయిస్టులు ఆహారం, నీటి కొరతతో డీహైడ్రేషన్‌కు గురవుతున్నట్లు సమాచారం. మావోయిస్టులు కర్రెగుట్ట ప్రాంతంలో ల్యాండ్ మైన్స్ అమర్చినట్లు తెలుస్తోంది. సెర్చ్ ఆపరేషన్ సమయంలో ఓ జవాన్ ల్యాండ్ మైన్ పై కాలు వేయడంతో గాయపడ్డాడు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## చిన్నారులను చిదిమేస్తున్నారు..!

(మొదటి పేజీ తరువాయి)

వారు గతంలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన వారు మరోమారు గర్భం దాల్చిన తర్వాత తమకు పుట్టబోయేది ఆడా.. మగా బిడ్డ అనేది తెలుసుకునేందుకు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. స్కానింగ్‌లో ఆడ శిశువే పుడుతుందని తెలవడంతో కడుపులోని పిండాన్ని తొలగించుకుంటున్నారు. ఇది నేరమని చెప్పినా తాము ఆడపిల్లలకు జన్మనిచ్చి పెంచి పోషించేస్థోమత తమకు లేదంటూ చెబుతున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆసుపత్రుల నిర్వాహకులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో ఆయా గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్‌ఎంపి, పిఎంపిలను ఏజెంట్లుగా పెట్టుకుని లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలకు పాల్పడుతున్నారు. లింగనిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడిన వారిపై (లింగ ఎంపిక నిర్ధారణ చట్టం 1994 అండ్ 1996 ప్రకారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 50వేల జరిమాన విధించే అవకాశం ఉన్నా సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో విద్యానగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భిణికి వైద్యురాలు లింగనిర్ధారణ చేసి గర్భ విఛ్చినానికి పాల్పడింది. ఈ విషయం బయటకు పొక్కడంతో పత్రికల్లో పెద్ద ఎత్తున వార్తలు ప్రచురితమయ్యాయి. దీని ఆధారంగా విచారణ జరిపిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సదరు మహిళ వైద్యురాలుతో బేరసారాలు ఆడి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఆమె తప్పు ఏమీలేదు అన్నట్లు ప్రకటించారు. తాజాగా మోతె మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన భయ్యా అనూష అనే మహిళ ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిన తర్వాత మరోమారు గర్భందాల్చగా మగా, ఆడా శిశువు అనే విషయం తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులతో నిర్ధారణ చేసుకునేందుకు ఓ ఆర్‌ఎంపి వైద్యునితో నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ లో ఉన్న ఓ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లింది. ఈ స్కానింగ్‌లో ఆమెకు పుట్టబోయే బిడ్డ ఆడ శిశువు అని తేలడంతో ఆమె కుటుంబ సభ్యులు గర్భస్రావం (అబార్షన్) చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఓమెగా ప్రైవేట్ ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. అక్కడి వైద్యులు ఆమెకు అబార్షన్ చేస్తున్న క్రమంలో అధికంగా రక్తం స్రావం కావడంతో ఆమె ప్రాణాలను ముప్పు ఉన్నదని చెప్పి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై ప్రభుత్వ నిబంధనలను పక్కకు పెట్టి లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు (అబార్షన్) లు యధేచ్ఛగా చేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షకు రూ.15వేలు, గర్భస్రావం (అబార్షన్‌కు)రూ.35 వేలు దండుకుంటున్నారు. ఇవి కాకుండా మందులకు మరో రూ.5 నుండి రూ.10 వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ దందాకు భాగస్వాములుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యులకు పెద్ద మొత్తంలో కమిషన్లు ఇస్తున్నారు. దీంతో వారు కాసులకు కక్కుర్తి పడి అబార్షన్‌లు చేపిస్తున్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణ ప్రాంతాలలో లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు అత్యధికంగా జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతం వైద్యులే కాకుం డా గ్రామీణ ప్రాంత ఆర్‌ఎంపి, పిఎంపి లు కూడా అబార్షన్‌లు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే సాగుతున్నా సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఒకటి, రెండు వెలుగులోకి వచ్చినప్పుడు హడావుడి చేస్తున్నారే తప్పా ఈ దందా కొనసాగిస్తున్నా స్కానిం గ్ సెంటర్లు, ఆసుపత్రుల వైపు తిరిగి కన్నెతి చూడటంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం భ్రూణ హత్యలు చే స్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రంలో మళ్ళీ కరోనా

(మొదటి పేజీ తరువాయి)

మాస్కులు ధరించాలని, కరోనా లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా టెస్టులు చేయించుకొని స్వీయ జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక వైద్యునికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం రేపింది.

**దేశవ్యాప్తంగా పంజా విసురుతున్న కరోనా..**

దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మరోసారి నెమ్మదిగా పంజా విసురుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మే 19నాటికి దేశవ్యాప్తంగా 257 కొవిడ్ కేసులు ఉన్నట్లు ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ కొవిడ్ కేసులన్నీ దాదాపుగా తేలికపాటివేనని, ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. సింగపూర్, హాంకాంగ్‌లో కొవిడ్ కేసులు పెరుగుతుండడం వల్ల అప్రమత్తమయ్యామని తెలిపింది. సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. వారంలోనే వేల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయి.

**ఆందోళన కలిగిస్తోన్న కేసుల పెరుగుదల..**

పలు రాష్ట్రాల్లో కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కర్ణాటక, కేరళ వంటి పొరుగు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగుచూడటంతో తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కర్ణాటక రాజధాని బెంగళూరులో తొమ్మిది నెల ల పసికందుకు కరోనా సోకినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. కేరళ లోనూ కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరు గుతోంది. మే నెలలో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 182 కొత్త ఇన్‌ఫెక్షన్‌లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com